www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 17-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 31

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: పంచమి పూర్తి, నక్షత్రం: పూర్వాషాఢ సా5.44 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా2.06 - తె3.47, దుర్ముహూర్తం: ఉ5.46 -7.29 , అమృతఘడియలు: మ12.36 - 2.19, రాహుకాలం: ఉ. 9.00 - 10.30, సూర్యోదయం: 5.46, సూర్యాస్తమయం: 6.37

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నేడు, రేపు భారీ వానలు!

రాష్ట్రవ్యాప్తంగా కురిసే అవకాశం

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గద్వాల, వనపర్తి, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, యాదాద్రి, మేడ్చల్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది.

లక్షకు ఐదు వేలు

అమెరికా నుంచి డబ్బు పంపితే పన్ను బాదుడు?

విదేశాలకు నగదు బదిలీలపై 5% పన్ను విధిస్తూ బిల్లు

తిరస్కరించిన ప్రతినిధుల సభ బడ్జెట్ కమిటీ

సవరణలు చేసి మళ్లీ ప్రవేశపెడతామన్న స్పీకర్

బిల్లు అమలైతే ప్రవాస భారతీయులకు భారమే

ప్రస్తుతం అమెరికాలో 45 లక్షల మంది భారతీయులు

కొత్త పన్నుతో వీరిపై రూ.13,688 కోట్ల మేర భారం

అమెరికా నుంచి దేశంలోకి తగ్గనున్న నగదు బదిలీలు

భారత రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం

అమెరికా పౌరులకు పన్ను నుంచి మినహాయింపు



యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ నుంచి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం అందుకుంటున్న ట్రంప్

న్యూఢిల్లీ, మే 16: అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు అక్కడి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పెద్ద షాకిచ్చింది. అమెరికా నుంచి ఇతర దేశాలకు జరిగే నగదు బదిలీలపై 5 శాతం పన్ను వసూలు చేసేందుకు వీలుగా "బిగ్ బ్యూటిఫుల్ బిల్" పేరిట బిల్లును తీసుకొచ్చింది. అయితే, ప్రతినిధుల సభ బడ్జెట్ కమిటీ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు 21-16 ఓట్ల తేడాతో వ్యతిరేకించింది. అయిదుగురు రిపబ్లికన్లు కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. దాంతో సవరణలు చేసి బిల్లును తిరిగి ప్రతినిధుల సభలో ప్రవేశపెడతామని స్పీకర్ మైక్ జాన్సన్ తెలిపారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొందితే .. అమెరికాలో సంపాదించిన డబ్బును.. వేరే దేశాల్లో ఉన్న తమ వారికి పంపే విదేశీయులు పన్నుల రూపంలో భారీగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిపాదిత విధానం ప్రకారం.. అమెరికాలో ఉన్న భారతీయులు.. స్వదేశంలో ఉన్న తమ వారికి 1160 డాలర్లు అనగా దాదాపు రూ.లక్ష పంపిస్తే అందులో ఐదు శాతం.. రూ.5000ను పన్నుగా చెల్లించాలి. ఈ పన్నును నగదు బదిలీ సేవలను అందించే వెస్టర్న్ యూనియన్, మనీగ్రామ్ లేదా అమెరికా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకులు వసూలు చేస్తాయి. హెచ్-1బీ, ఎఫ్-1 లేదా జే-1 తదితర వీసాదారులు, గ్రీన్ కార్డుదారులు, తగిన గుర్తింపు పత్రాలు లేనివారు నగదు బదిలీలు చేసినప్పుడు ఈ పన్ను చెల్లించాల్సిందే. గుర్తింపు పొందిన అమెరికా పౌరులకు మాత్రం ఈ పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. పౌరసత్వ నిర్ధారణ సదుపాయం ఉండి ప్రభుత్వ గుర్తింపు కలిగిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా నగదు బదిలీ చేస్తేనే వారికి కూడా మినహాయింపు

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ మిస్టరీ!

భారత్ విషయంలో చర్చనీయాంశంగా అమెరికా అధ్యక్షుడి వైఖరి

మోదీకి ప్రాధాన్యమిస్తూనే పన్ను మోత

వాణిజ్య చర్చలు జరుగుతుండగానే జీరో ట్యాక్స్ అంటూ వ్యాఖ్యలు

ఐఫోన్ యూనిట్లను భారత్ నుంచి తరలించాలని యాపిల్‌కు సూచన

భారత్, పాక్‌లను ఒకేగాటన కట్టే వైఖరి

టర్కీతో క్షిపణుల విక్రయ కాంట్రాక్టు

తొలుత హడావుడి చేసినా చివరికి చైనాపైనా సానుకూల వైఖరి

2



నెలాఖరులోపు కాళేశ్వరం

నివేదిక

కేసీఆర్, హరీశ్‌రావును పిలవకుండానే విచారణ పూర్తి

పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయం?

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి లోపాలు, వైఫల్యాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెలాఖరులోపు (ఈనెల 22వ తేదీ తర్వాత) నివేదికను ప్రభుత్వానికి అందించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత,

మిగతా 3వ పేజీలో...



పోలవరంపై 28న ప్రధాని సమీక్ష

వర్చువల్‌గా హాజరుకానున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సీఎంలు

ముంపు ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలంటున్న తెలంగాణ

12

హైదరాబాద్‌లో

డేటా సిటీ

భవిష్యత్తులో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్

పెరిగే విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళిక ఉండాలి

పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఫ్లోటింగ్ ప్లాంట్లు, ఔటర్ రింగ్ రోడ్డు, ఫుట్‌పాత్‌లు, నాలాలపై సౌర విద్యుదుత్పత్తికి అవకాశాలను పరిశీలించండి

ఫ్యూచర్ సిటీలో స్తంభాలు, లైన్లు, టవర్లు బయటకు కనిపించొద్దు

జీహెచ్ఎంసీ పరిధిలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయండి

విద్యుత్తు శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ నాంపల్లిలో హజ్‌యాత్రను ప్రారంభిస్తున్న సీఎం

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ దేశంలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని, భవిష్యత్తులో డేటా సెంటర్ల హబ్‌గా మారబోతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో రాబోయే మూడేళ్లలో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరగనుందని, భవిష్యత్తు అవసరాలను

మిగతా 12వ పేజీలో...

నకిలీ విత్తనాల విక్రేతలపై ఉక్కుపాదం

పీడీ యాక్ట్ పెట్టండి

పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేయాలి

వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్

12



మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి చెట్టు వద్ద ప్రపంచ సుందరీమణులు

ఐసీయూలో పిల్లలతో.. అందాల భామల ముచ్చట్లు!

ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను పరామర్శించిన ప్రపంచ సుందరి పోటీదారులు

హైదరాబాద్ శివార్లలోని ఎకోపార్క్ సందర్శన

మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వద్దకూ..

బతుకమ్మ ఆడి మొక్కలు నాటిన సుందరీమణులు

13



ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాలుడ్ని పరామర్శిస్తున్న మిస్ నైజీరియా



రూ.100 కోట్ల పన్ను ఎగవేత

లగ్జరీ కార్ల డీలర్ అరెస్టు

హైదరాబాద్‌లో బషారత్ అదుపులోకి

అహ్మదాబాద్‌కు తరలింపు

కార్లు కొనుగోలు చేసిన వారిలో నేతలు, ప్రముఖులు

పన్ను ఎగవేతతో సంబంధం ఉన్న వారిపైనా దర్యాప్తు

14

రక్షణ రంగానికి

మరో 50వేల కోట్లు!

ఆపరేషన్ సిందూర్ నేపథ్యమే కారణం.. మొత్తం రక్షణ బడ్జెట్ 7 లక్షల కోట్లు దాటే అవకాశం

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదం!

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ రక్షణ రంగానికి అదనంగా రూ.50వేల కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రం యోచిస్తోంది. సప్లిమెంటరీ బడ్జెట్ ద్వారా అందించనున్న ఈ మొత్తంతో రక్షణ రంగానికి కేటాయింపులు రూ.7లక్షల కోట్లు దాటనుందని

మిగతా 10వ పేజీలో...



విజయ్ షాపై చర్యలు తీస్కోండి

మోదీకి కర్నల్ సోఫియా బంధువుల వినతి

2

తుర్కియే ఉత్పత్తులు వద్దు!

యాపిల్ల దిగుమతిని నిలిపేసిన ఢిల్లీ మండి

ఆభరణాలు కొనమన్న లఖ్‌నవూ వ్యాపారులు

పాక్ సరిహద్దుల మీదుగా భారత్‌కు అఫ్గాన్ ట్రక్కులు

తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చల్లో నిర్ణయం

10

అసెంబ్లీ, మండలి ఒకే చోట



పార్లమెంటు తరహాలో ఏర్పాట్లు

పనులను పరిశీలించిన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

12



పశ్చిమ బెంగాల్ ఉద్యోగుల డీఏ

25% పెంచండి

మూడు నెలల్లో అమలు చేయండి

రాష్ట్ర సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశం

10



భుజ్ ఎయిర్‌బేస్‌లో సైనికులకు మిఠాయి తినిపిస్తున్న రాజ్‌నాథ్

ఆపరేషన్ సిందూర్ ట్రైలరే!

» ఉగ్రవాదానికి తగిన బదులిచ్చేందుకు సిద్ధం: రాజ్‌నాథ్

భుజ్, మే 16: ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, జరిగింది ఒక ట్రైలర్ మాత్రమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సరైన సమయంలో మొత్తం సినిమా చూపిస్తామని పాకిస్థాన్‌ను హెచ్చరించారు. భారత సార్వభౌమాధికారానికి ముప్పు కలిగించాలని ఎవరైనా చూస్తే.. తగిన విధంగా బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి తగిన బదులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించిన రాజ్‌నాథ్.. అక్కడి వైమానిక బలగాలతో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల సమయంలో పాక్ లక్ష్యంగా చేసుకొన్న సైనిక స్థావరాల్లో ఇది ఒకటి. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ఏ విధంగా ధ్వంసం చేశామో ప్రపంచమంతా చూసిందని, ఉగ్రవాదానికి మద్దతు పలకడం ఆపకుంటే.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌లో వైమానిక దళం కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత దళాలు శత్రువుపై ఆధిపత్యం చూపడమే కాకుండా, ఉగ్రవాద నిర్మూలనలో కూడా విజయం సాధించాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,555 కోట్లు) ఆర్థిక సహకారం మంజూరు చేయడంపై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) పునరాలోచన చేయాలని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఐఎంఎఫ్ నుంచి వచ్చిన నిధుల్లో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలో ఉగ్రవాద ఫండింగ్ కోసం వినియోగిస్తోందన్నారు.

దాయాదిపై 'దౌత్య' యుద్ధం!

» పలు దేశాలకు ఎంపీలను పంపించాలని నిర్ణయం

» పాక్‌ను దోషిగా, ఏకాకిగా నిలబెట్టడమే లక్ష్యం

న్యూఢిల్లీ, మే 16 : ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఎదుట దోషిగానూ, ఏకాకిగానూ నిలబెట్టే దౌత్యపరమైన చర్యలను భారత్ తీవ్రతరం చేసింది. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా జరిగిన ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు, ఆ ఆపరేషన్ జరిగిన తీరును ప్రపంచానికి తెలియజేసేందుకు సిద్ధమవుతోంది. దీనికోసం పార్లమెంటు సభ్యులను బృందాలుగా చేసి పలు దేశాలకు పంపాలని నిర్ణయించినట్టు ప్రభుత్వ అధికార వర్గాల సమాచారం. ఈ బృందాల్లో అన్ని రాజకీయ పార్టీల సభ్యులకు ప్రాతినిథ్యం కల్పించనున్నారు. ఈ బృందాలకు కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు నాయకత్వం వహిస్తారని, ఈ నెల 22లేక23 తేదీల్లో అవి బయలుదేరి వెళతాయని తెలిసింది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఇప్పటికే ప్రతినిధుల బృందంలో ఉండే ఎంపీలకు ఆహ్వానాలు వెళ్లాయి. ఒక్కో బృందంలో ఐదు నుంచి ఆరుగురు ఉంటారు. అమెరికా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలను ఈ బృందాలు సందర్శిస్తాయి. పది రోజుల పాటు పర్యటన సాగుతుంది. ఎన్ని బృందాలను పంపుతారనేది ఇంకా స్పష్టత రాలేదు. 30 మంది ఎంపీలకు చోటు కల్పించవచ్చునని కొందరు నాయకులు చెబుతున్నారు.

ఎఫ్-35ని ఎఫ్-55గా అభివృద్ధి చేస్తాం!

» రష్యా-ఉక్రెయిన్ చర్చల కోసం పుతిన్‌ను కలుస్తా: ట్రంప్

దోహా, మే 16: ఎఫ్-35 యుద్ధవిమానాన్ని ఎఫ్-55 పేరుతో రెండు ఇంజిన్ల యుద్ధవిమానంగా అభివృద్ధి చేయాలని యోచిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీంతోపాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎఫ్-22 విమానాన్ని కూడా 'ఎఫ్-22 సూపర్' పేరుతో ఉన్నతీకరించాలనుకుంటున్నట్లు తెలిపారు. దోహా పర్యటన సందర్భంగా బోయింగ్, జీఈ ఎయిరోస్పేస్ విమానయాన సంస్థల అధిపతులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వివరాలు వెల్లడించారు. కాగా, ట్రంప్ 4 రోజుల పశ్చిమాసియా పర్యటన శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, రష్యా-ఉక్రెయిన్ చర్చలకు తాను వెళ్లకపోవటం వల్లనే రష్యా అధ్యక్షుడు పుతిన్ రానట్టున్నారని పేర్కొన్నారు. త్వరలోనే పుతిన్‌ను ముఖాముఖి కలుస్తానని వెల్లడించారు. తన కుమార్తెకు తొలి కాన్పులో కొడుకు పుట్టాడని, మనవన్ని చూడటానికి వెళ్తున్నానని చెప్పారు.

యావత్ సైన్యం మోదీ పాదాలకు ప్రణమిల్లింది

» మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం జగదీశ్ వ్యాఖ్యలు

భోపాల్, మే 16: ఆపరేషన్ సిందూర్ కోసం యావత్ దేశం, సైన్యం ప్రధాని మోదీ పాదాలకు ప్రణమిల్లిందని మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం జగదీశ్ దేవ్‌డా వ్యాఖ్యానించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని పేర్కొంది. "మనం ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేయాలి. యావత్ ఆర్మీ, సైనికులు ఆయన పాదాల వద్ద ప్రణమిల్లారు. యావత్ దేశం ఆయన పాదాలకు తలవంచి నమస్కరించింది" అని జగదీశ్ అన్నట్లుగా ఉన్న వీడియోను కాంగ్రెస్ శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆయన వ్యాఖ్యలు మన సైన్యం పరాక్రమాన్ని అవమానించడమేనని.. బీజేపీ, జగదీశ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. అయితే తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని జగదీశ్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మార్చేసిందని ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సైన్యం అద్భుతంగా పనిచేసిందని, భారతీయులందరూ సైన్యానికి తల వంచి నమస్కరించాలని చెప్పానని అన్నారు.

ట్రంప్ మిస్టరీ!



భారత్ విషయంలో చర్చనీయంగా అమెరికా అధ్యక్షుడి వైఖరి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు అనుకూలమా!? ప్రతికూలమా!? ఆయన నిర్ణయాలు మన దేశానికి మంచి చేసేవా!? చెడు చేసేవా!? ప్రస్తుతం ప్రతి ఒక్కరి మదిలోనూ మెన్నాడుతున్న ప్రశ్నలివి! నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించినట్లు ఇటీవలికాలంలో ఆయన నిర్ణయాలు ఉండడమే ఇందుకు కారణం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లారు. అప్పుడు మోదీకి ట్రంప్ ఘన స్వాగతం పలికారు. ఒప్పందాలపై సంతకాలు చేసే సమయంలో మోదీ కుర్చీ లాగి మరీ ఆయనను కూర్చోబెట్టారు. దీంతో, ట్రంప్ వచ్చినా భారత వాణిజ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, రెండు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణమే ఉంటుందని వాణిజ్యవర్గాలు భావించాయి. అంతలోనే ట్రంప్ పరస్పర సుంకాల వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఏప్రిల్ 4న భారత్‌పైనా 26శాతం సుంకాలను ప్రతిపాదించారు. దీంతో మన స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. వారం రోజుల్లోనే ఈ సుంకాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన దేశాలతో పాటు భారత్‌కూ సుంకాలపై 90 రోజుల విరామం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈలోపులో సంప్రదింపులు జరుగుతాయని ప్రకటించారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుండగానే.. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తన బృందంతో అమెరికా పర్యటనకు వెళ్లడానికి ఒక్క రోజు ముందు తమ దిగుమతులపై సుంకాలన్నీ ఎత్తేస్తామంటూ భారత్ సూపర్ ఆఫర్ ఇచ్చిందని ట్రంప్ ప్రకటించారు. అయితే చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని విదేశాంగమంత్రి జైశంకర్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. భారత్ తమకు ప్రాధాన్య దేశమని, ఆ దేశంతో వాణిజ్యం కీలకమంటూనే భారత్‌లోని ఐఫోన్ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాలని యాపిల్ సీఈవో టిమ్‌ కుక్‌కు ట్రంప్ సూచించారు. వాణిజ్య యుద్ధంలో భాగంగా చైనాపై ట్రంప్ భారీ సుంకాలు వేశారు. దాంతో అక్కడ తయారు చేసిన ఐఫోన్లను దిగుమతి చేసుకోవడం అమెరికాకు భారంగా పరిణవిుంచనుంది. దీంతో చైనా నుంచి ఫోన్ల తయారీ యూనిట్లను భారీగా భారత్‌కు తరలించాలని యాపిల్ నిర్ణయించింది. అంతలోనే ట్రంప్ బాంబు పేల్చారు. భారత్‌కు బదులుగా అమెరికాలోనే ఐఫోన్ల తయారీ యూనిట్లను నిర్మించాలని టిమ్ కుక్‌కు సూచించానని స్వయంగా ఆయనే వెల్లడించారు. ట్రంప్ నిర్ణయంతో సంబంధంలేదని, భారత్‌లో ఐఫోన్ల తయారీ యూనిట్ల కార్యకలాపాలను కొనసాగిస్తామని యాపిల్ ప్రకటించినా.. ట్రంప్ వ్యాఖ్యలు భారత్‌కు ప్రతికూలమనే వాదన వెల్లువెత్తుతోంది. పహల్గాం ఉగ్రదాడి ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో.. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇచ్చే ఆర్థిక సాయాన్ని నిలిపివేయాలని భారత్ విజ్ఞప్తి చేసింది. కానీ, పాకిస్థాన్ 7బిలియన్ డాలర్లు అడిగితే తొలి విడతగా 1బిలియన్ డాలర్లు ఇచ్చింది. దీనిపై తీవ్రస్థాయిలోనే భారత్ మండిపడింది. అమెరికా మద్దతులేకుండా ఐఎంఎఫ్ ఈ రుణాన్ని మంజూరు చేయదనే విశ్లేషణలూ అప్పట్లో వెలువడ్డాయి. దీనిపై అమెరికా మిలటరీ వ్యూహకర్త, పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రుబిన్ కూడా ట్రంప్ సర్కారును తీవ్రంగా తప్పుబట్టారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వకుండా నిలుపు చేయకపోవడం తీవ్ర తప్పిదమని, పాకిస్థాన్‌కు సాయం చేయడం చైనాకూ సాయం చేసినట్లేనన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ట్రంప్ వైఖరి ఇలాగే ఉంది. రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. మరోవైపు పాకిస్థాన్‌ను భారత్‌ను; మోదీని, షెహబాజ్‌ను ఒకే గాటన కట్టారు. రెండూ గొప్ప దేశాలని, ఇద్దరూ చరిత్రాత్మక, విరోచిత నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. రెండు దేశాలతోనూ వాణిజ్యాన్ని భారీగా పెంచుతానని ప్రకటించారు. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించి పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం చేయకుండా ఆపానన్నారు. యుద్ధసమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా డ్రోన్లు, క్షిపణులు అందజేసిన విషయం తెలిసిందే. తుర్కియేకు 304మిలియన్ డాలర్ల క్షిపణులను విక్రయించే ఒప్పందానికి అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవలికాలంలో అమెరికాలోని భారతీయులకు భారం గా పరిణమించే నిర్ణయాలు తీసుకుంటున్నారు. అక్ర మ వలసదారులను అత్యంత అమానవీయంగా భారత్‌కు తిరిగిపంపడంపై అప్పట్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఎన్ఆర్ఐలు ఇండియాకు పంపే నిధులపైనా పన్ను విధిస్తామని ప్రకటించడం భారత్ వ్యతిరేక చర్యేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత చైనాతో ఢీ అంటే ఢీ అన్నట్లుగా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంపై 145% సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించి తర్వాత వెనక్కి తగ్గి 30%సుంకాలను యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. చైనా, పాక్‌లతో సానుకూలంగా.. భారత్ విషయంలో ట్రంప్ ప్రతికూల వైఖరి కనబరచడం చర్చనీయాంశమైంది

- సెంట్రల్ డెస్క్

లక్షకు ఐదు వేలు

(మొదటి పేజీ తరవాయి)

లభిస్తుంది. కాగా, ఈ నూతన విధానం అమలులోకి వస్తే ప్రవాస భారతీయులపైన, భారత రియల్ ఎస్టేట్ రంగంపైనా ప్రభావం చూపనుంది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 2023-24లో భారత్‌కు విదేశాల నుంచి 118.7బిలియన్ డాలర్ల మేర నగదు బదిలీలు జరిగాయి. ఇందులో 32 బిలియన్ డాలర్లు.. 28 శాతానికి పైగా మొత్తం అమెరికా నుంచి వచ్చినవే. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం దాదాపు 45లక్షల మంది భారతీయులు(ఇందులో 32లక్షల మంది భారత సంతతి వారు) అమెరికాలో ఉన్నారు. వీరు భారత్‌లోని తమ కుటుంబసభ్యులకు గృహ, విద్య, వైద్య అవసరాలకు, పెట్టుబడులకు డబ్బు పంపుతారు. ఎప్పట్లానే వీరు నగదు బదిలీలు కొనసాగిస్తే 5 % పన్ను నిబంధన కింద వీరం తా 1.6 బిలియన్ డాలర్లు నష్టపోనున్నారు. దీంతో నూతన పన్ను విధానం అమలులోకి వస్తే అమెరికా నుంచి భారత్‌కు జరిగే నగదు బదిలీలు తగ్గుతాయి. ఇది భారత రియల్‌ఎస్టేట్ రంగంలో పెట్టుబడులపై ప్రభావం చూపనుంది. విదేశాల్లో ఉన్న తమ వారు పంపే డబ్బును భారత్‌లో చాలామంది ముంబై, హైదరాబాద్, కొచ్చి తదితర నగరాల్లో రియాల్టీ రంగంలో పెట్టుబడిగా పెడుతుంటారు. అనరాక్ 2024 వార్షిక రెసిడెన్షియల్ నివేదిక ప్రకారం.. కొత్త హౌసింగ్ ప్రాజెక్టుల్లో న్యూఢిల్లీలోని 59%, హైదరాబాద్‌లో 18%, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 12% విలాసవంతమైన ఇళ్ల ధరలు రూ.2.5 కోట్లకుపైనే పలుకుతున్నాయి. ధనిక వర్గాలు ఎక్కువ ఆసక్తి చూపే ఈ ప్రాజెక్టుల్లో ఎన్ఆర్ఐల పెట్టుబడులే చాలా కీలకం. అమెరికా 5% పన్ను విధానం అమలు చేస్తే ఎన్ఆర్ఐల పెట్టుబడులు తగ్గుతాయి. ఈ పన్ను విధానంతో అమెరికాలోని భారతీయులు స్వదేశంలో ఉన్న తమ వారికి పంపే డాలర్ విలువ కూడా తగ్గిపోనుంది. ఈ పన్ను విధానం అమల్లోకి వచ్చేలోపే భారతీయులు స్వదేశానికి ఓ ప్రణాళిక ప్రకారం నగదు బదిలీలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

లోకం తీరు



'బ్రహ్మోస్' భళా!

» దీనిముందు పాక్, చైనా రక్షణ వ్యవస్థలు దిగదుడుపే

» అమెరికా యుద్ధ నిపుణుడు స్పెన్సర్

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణి పనితీరును అమెరికాకు చెందిన యుద్ధరంగ నిపుణుడు, రిటైర్డ్ కల్నల్ జాన్ స్పెన్సర్ ప్రశంసించారు. పాక్‌తో యుద్ధంలో అటు దాడి చేయడంలోనూ, ఇటు రక్షణాత్మకంగా వ్యవహరించడంలోనూ భారత్ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని కొనియాడారు. దాయాది దేశంలోని ఏ ప్రాంతాన్ని అయినా, ఏ సమయంలో అయినా సునాయాసంగా ఛేదించగలమనే సందేశాన్ని భారత్ పంపిందని 'ఇండియా టుడే'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. పాక్ ఉపయోగించిన చైనా వైమానిక రక్షణ వ్యవస్థలు బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి నిలబడలేకపోయాయని తెలిపారు. అసలు వాటికి బ్రహ్మోస్‌తో పోలికే లేదని తేల్చేశారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాలు, ఎయిర్ బేస్‌లను భారత్ సునాయాసంగా ధ్వంసం చేయడంలో బ్రహ్మోస్ కీలక పాత్ర పోషించింది. పాకిస్థాన్ వ్యాప్తంగా దాడులు చేయడమే కాకుండా శత్రుదేశం చేసిన డ్రోన్ దాడులు, క్షిపణులను సమర్థంగా అడ్డుకోవడంలో భారత్ విజయవంతమైందని స్పెన్సర్ వివరించారు. పాక్ ఉపయోగించిన చైనా రక్షణ వ్యవస్థల్లోకి బ్రహ్మోస్ చొచ్చుకుపోవడం భారతదేశ అధునాతన సైనిక సామర్థ్యాలకు నిదర్శనమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ పాక్ సైన్యానికి భారీ నష్టాలను మిగిల్చిందని తెలిపారు. భవిష్యత్తులో సైనిక వ్యూహకర్తలు, విద్యార్థులకు ఈ ఆపరేషన్ ఒక అధ్యయనాంశంగా మారుతుందని స్పెన్సర్ అభిప్రాయపడ్డారు. సింధు జలాలపై భారత్ తెలివైన నిర్ణయం తీసుకుందని, ఉగ్ర సంస్థలకు ఇస్తున్న మద్దతుపై పాక్ పునరాలోచించుకొనేలా చేసిందని స్పెన్సర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

గాలమేసి.. గురిచూసి..



పాక్ ఎయిర్‌బేస్‌లపై దాడి కోసం భారత్ వినూత్న వ్యూహం

» పైలట్ రహిత విమానాలను ఎరగా పంపి సుఖోయ్, మిగ్-29లుగా భ్రమింపజేసి..

» తమ రక్షణ వ్యవస్థలు, రాడార్లను పాక్ యాక్టివేట్ చేసేలా ఊరించి..

» ఆ వ్యవస్థలను, ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేసిన భారత వాయుసేన

న్యూఢిల్లీ, మే 16: భారత్ ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టగానే.. పాక్ విచ్చలవిడిగా డ్రోన్లు, స్వల్ప శ్రేణి క్షిపణులతో దాడులు మొదలుపెట్టింది. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్న భారత్.. పాక్ మళ్లీ ఆ పనిచేయకుండా, ఆ దేశంలోని కీలక ఎయిర్‌బేస్‌లను దెబ్బతీయాలని నిర్ణయించింది. ఇందుకు బ్రహ్మోస్ క్షిపణులు, హారోప్ సూసైడ్ డ్రోన్లు వంటి అత్యాధునిక ఆయుధాలు వినియోగించాలి. కానీ పాక్ గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు వాటిని గుర్తించి అడ్డుకుంటే నష్టం జరగడంతోపాటు మన లక్ష్యమూ నెరవేరదు. ఆ రక్షణ వ్యవస్థలు, రాడార్లను మొదట ధ్వంసం చేస్తే.. ఎయిర్‌బేస్‌లపై దాడి సులువు అవుతుంది. కానీ పాక్ తన రక్షణ వ్యవస్థలను, రాడార్లను ఎక్కడ మోహరించినదీ తెలియదు. వాటిని యాక్టివేట్ చేస్తే తప్ప వాటి ఉనికిని గుర్తించలేని పరిస్థితి. ఇక్కడే మన వాయుసేన వినూత్న ఆలోచన చేసింది. మే 9న అర్ధరాత్రి 'లక్ష్య, బన్షీజెట్ 40 ప్లస్' వంటి పైలట్ రహిత విమానాలను రంగంలోకి దింపింది. పాక్‌లో దాడి చేయాలనుకున్న ఎయిర్‌బేస్‌లకు దూరంగా, వేర్వేరు ప్రాంతాల్లోకి వాటిని పంపింది. ఆ పైలట్ రహిత విమానాలను.. సుఖోయ్ ఎంకేఐ30, మిగ్-29 విమానాలుగా, భారీగా ఆయుధాలతో దాడికి వస్తున్నట్టుగా భ్రమింపజేసింది. ఈ గాలానికి చిక్కిన పాక్.. తాను వినియోగించే చైనా తయారీ హెచ్‌క్యూ9 రక్షణ వ్యవస్థను, సామ్ (సర్ఫేస్ టు ఎయిర్) బ్యాటరీ వ్యవస్థలను, రాడార్లను యాక్టివేట్ చేసింది. పైలట్ రహిత విమానాలను అసలైన సుఖోయ్, మిగ్ విమానాలుగా భావించి.. వాటిని కూల్చేందుకు యుద్ధ విమానాలను పంపింది. క్షిపణి వ్యవస్థలనూ అటువైపే టార్గెట్ చేసింది. దీంతో ఆ రక్షణ వ్యవస్థలు, రాడార్లు, వాటిని నియంత్రించే కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు ఎక్కడున్నాయో భారత వాయుసేనకు తెలిసింది. మరుక్షణంలోనే మన వాయుసేన అసలు పని మొదలుపెట్టింది. ఇజ్రాయెల్ తయారీ హారోప్ లాయిటరింగ్ మ్యూనిషన్లను (సూసైడ్ డ్రోన్లుగా పిలుస్తారు) ప్రయోగించి.. రాడార్లు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలను ధ్వంసం చేసింది. పాక్ గగనతల రక్షణ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఇదే అదనుగా మన వాయుసేన 15 బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించి.. పాకిస్థాన్‌లోని 12 కీలక ఎయిర్‌బేస్‌లలో 11 ఎయిర్‌బేస్‌లను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసింది. మనవైపు నష్టమేమీ లేకుండా అత్యాధునిక యుద్ధ తంత్రాల్లో అత్యంత కీలకమైన వ్యూహాన్ని విజయవంతంగా అమలు చేసింది.

అసలైన యుద్ధ విమానాలుగా.. అలా ఎలా?

భారత్ వద్ద సొంతంగా అభివృద్ధి చేసిన 'లక్ష్య'తో పాటు యూకే తయారీ 'బన్షీజెట్ 40 ప్లస్' పైలట్ రహిత విమానాలు ఉన్నాయి. వీటిని యుద్ధ విమాన పైలట్లకు శిక్షణ ఇచ్చే సమయంలో, యుద్ధ విమానాల సామర్థ్యాన్ని పరీక్షించేందుకు లక్ష్యాలుగా వినియోగిస్తుంటారు. నిజానికి ఇవి రాడార్లపై సరిగా గుర్తించలేనంత చిన్న పరిమాణంలోనే ఉంటాయి. కానీ వీటిలోని వివిధ పరికరాలు.. అసలైన యుద్ధ విమానాల తరహాలో వివిధ రకాల సిగ్నళ్లను.. యుద్ధ విమానాల ఇంజన్లు, బాడీ నుంచి వెలువడే తీవ్ర ఉష్ణాన్ని పోలినట్టుగా 'ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్ల'ను విడుదల చేస్తాయి. వీటికి డమ్మీ క్షిపణులను కూడా అమర్చవచ్చు. దీనితో శత్రుదేశాల రాడార్లు.. అసలైన యుద్ధ విమానం దూసుకువస్తున్నట్టు భ్రమించి శత్రుదేశాలు వాటిపైకి క్షిపణులు ప్రయోగించడమో, యుద్ధ విమానాలను పంపడమో చేస్తాయి. ఈ పైలట్ రహిత విమానాల్లోని పరికరాల నుంచి వెలువడే సిగ్నళ్లు, సిగ్నేచర్లను వేర్వేరుగా మార్చుకోవచ్చు. శత్రుదేశాల రాడార్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలను గందరగోళానికి గురిచేయగల 'ఈసీఎం (ఎలక్ట్రానిక్ కౌంటర్‌మెజర్స్)' వ్యవస్థలను అమర్చవచ్చు. మన వాయుసేన వీటిలో సుఖోయ్-30ఎంకేఐ, మిగ్-29 విమానాలు, క్షిపణులతో సహా వస్తున్నట్టుగా సిగ్నళ్లు వెలువర్చేలా ఏర్పాట్లు చేసిందని రక్షణ వర్గాల సమాచారం.

విజయ్ షాపై చర్యలు తీసుకోండి

» ప్రధానికి కర్నల్ సోఫియా బంధువుల వినతి

భోపాల్, మే 16: ఆపరేషన్ సిందూర్‌లో ప్రముఖ పాత్ర పోషించిన కర్నల్ సోఫియా ఖురేషీ ఉగ్రవాదుల సోదరి అని మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా అభివర్ణించడంపై ఆమె కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రధాని, రక్షణ మంత్రి, కేంద్ర హోం మంత్రిలకు విజ్ఞప్తి చేశారు. ఆమె బంధువు బంటీ సులేమాన్ మాట్లాడుతూ 'ఆమె మా కుమార్తె కాదు..దేశం కుమార్తె..ఆర్మీ కుమార్తె' అని అన్నారు. ఛత్తర్‌పూర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు భన్వర్ రాజా తమ ఇంటికి వచ్చారని, మంత్రిపై ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

అభ్యర్థులను గుర్తించడానికి ఆధార్ ప్రామాణీకరణ

» ఎన్ఆర్ఏకు కేంద్రం అనుమతులు

న్యూఢిల్లీ, మే 16: వివిధ పోటీ పరీక్షలు నిర్వహించే నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ఆర్ఏ)కి అభ్యర్థుల గుర్తింపును స్వచ్ఛందంగా గుర్తించడానికి ఆధార్ ఆధారిత ప్రామాణీకరణను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పరీక్ష నిర్వహణ పరంగా నెలకొనే సమస్యలను ఇది పరిష్కరిస్తుందని, పరీక్షలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి కూడా దోహదపడుతుందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ గతంలోనే పేర్కొన్నారు. ఇక యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్‌లకు కేంద్రం ఆధార్ ఆధారిత ప్రామణికతను నిర్వహించడానికి ఇదివరకే అనుమతులిచ్చింది.

ఆకాశ్‌తీర్‌తో ఆటకట్టు

పాక్‌కు అడ్డుగోడగా నిలిచిన రక్షణ వ్యవస్థ



» దాయాది ఎన్నడూ చూడని అస్త్రంతో దెబ్బ

న్యూఢిల్లీ, మే16: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని వ్యూహాత్మక ప్రదేశాల్లో ఎనిమిది వైమానిక స్థావరాలు సహా 13 లక్ష్యాలను భారత్ అత్యంత కచ్చితత్వంలో ఎలా ఛేదించగలిగింది ? ఈ దాడులను అడ్డుకోవడంలో పాక్ ఎందుకింత ఘోరంగా విఫలమైంది ? ప్రపంచవ్యాప్తంగా అనేక మంది నిపుణులు ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ కొన్ని కీలక అంశాలను వెల్లడించింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) రూపొందించి, అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్ అనే గగనతల రక్షణ వ్యవస్థ పాక్ ఆటకట్టించిందని, వాళ్ల ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులు, మైక్రో యూఏవీలను సమర్థవంతంగా కూలగొట్టడంలో కీలక పాత్ర పోషించిందని వివరించింది. దేశీయంగా తయారైన ఆకాశ్‌తీర్ అంచనాలకు మించి రాణించిందంటూ దీని సత్తాను తెలియజేసింది.

ఆకాశ్‌తీర్ ప్రత్యేకతలివే...

- ఈ నెల 9, 10వ తేదీల్లో భారత్‌లోని సైనిక, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ డ్రోన్స్, క్షిపణి దాడులకు తెగబడింది. అయితే, దేశీయంగా అభివృద్ధి చేసిన గగనతల రక్షణ వ్యవస్థ ఆకాశ్‌తీర్ రక్షణగోడగా నిలిచి ఆ దాడులను అడ్డుకుంది.
- పాక్ నుంచి దూసుకొచ్చే డ్రోన్లు, క్షిపణులు, మైక్రో యూఏవీ (మానవరహిత వైమానిక వాహనాలు)లు భారత భూభాగంలో పడకుండా ఆకాశ్‌తీర్ నిరోధించింది. దీనిలో ఉన్న అత్యంత విధ్వంసక అంశం ఏమిటంటే.. భూమిపై ఉన్న రక్షణ వ్యవస్థలను అనుసంధానం చేయడం ద్వారా వాతావరణం, భూభాగం, రాడార్ ఇంటర్‌సెప్ట్‌ల నుంచి డేటాను సంగ్రహించి.. రియల్‌టైమ్‌లో నిర్ణయాలు తీసుకోగలదు. స్వయంప్రతిపత్తితో దాడులు అమలుచేసే సామర్థ్యం దీనిలో ఉంది. ఇలాంటి వ్యవస్థను ఎన్నడూ చూడలేదని పాక్ రక్షణ రంగ నిపుణులే అన్నారంటే దీని సత్తా అర్థం చేసుకోవచ్చు.
- ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రూపొందించిన ఆకాశ్‌తీర్.. భారత పరాక్రమాన్ని ప్రదర్శించే స్వదేశీ ఉత్పత్తి. ఆకాశ్‌తీర్‌కు పోటీగా చెప్పుకునే.. పాకిస్థాన్ వైమానిక రక్షణ (ఏడీ) నెట్‌వర్క్‌లో చైనాకు చెందిన హెచ్‌క్యూ-9, హెచ్‌క్యూ-16 అనే గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. అవి మన వైమానిక దాడులను అడ్డుకోవడంలో విఫలమయ్యాయి.
- ఆకాశ్‌తీర్ అనేది పూర్తిగా స్వయంప్రతిపత్తి కలిగిన రక్షణ వ్యవస్థ. దీనిలో భాగస్వామ్యమైన అన్ని వ్యవస్థల (కంట్రోల్ రూమ్, రాడార్లు, ఎయిర్ డిఫెన్స్ గన్స్) కు పరిస్థితి తీవ్రతను రియల్‌టైమ్‌లో అందిస్తుంది. ఇది శత్రు విమానాలు, డ్రోన్లు, క్షిపణులను గుర్తించి, ట్రాకింగ్ చేసి, వాటిపై చర్యలు తీసుకునేలా ఎయిర్ డిఫెన్స్‌ను అందిస్తుంది.
- ఈ ప్లాట్‌ఫామ్ రాడార్ వ్యవస్థలు, సెన్సర్లు, కమ్యూనికేషన్ టెక్నాలజీలను ఒకే కార్యచరణ చట్రంలోకి తీసుకువస్తుంది.
- ఆకాశ్‌తీర్ విస్తృతమైన సీ4ఐఎస్ఆర్ (కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, సర్వేలెన్స్, రికనైసెన్స్) ఫ్రేమ్‌వర్క్‌లో భాగం. ఇది ఇతర వ్యవస్థలను సమన్వయం చేసుకుని పనిచేస్తుంది. శక్తితో కాక బుద్ధి బలంతో యుద్ధం చేస్తుంది.
- ఆకాశ్‌తీర్ ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల ఎయిర్ డిఫెన్స్‌పై స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శిస్తుందనే నమ్మకం ఇచ్చింది.
- ఆకాశ్‌తీర్‌తో భారత్ కూడా పూర్తిగా ఆటోమేటెడ్, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్, సీ అండ్ ఆర్ సామర్థ్యం కలిగిన దేశాల జాబితాలో చేరింది. ఆకాశ్‌తీర్ ఊహించినదాని కంటే వేగంగా శత్రువుని గుర్తిస్తుందని, వేగంగా నిర్ణయాలు తీసుకుంటుందని, వేగంగా దాడి చేస్తుందని నిరూపితమైంది. ఆకాశ్‌తీర్ వ్యవస్థను వాహనంపై అమర్చవచ్చు. ప్రతికూల వాతావరణంలోనూ సులువుగా నిర్వహించవచ్చు.

ప్రభుత్వ వ్యయం 2.12 లక్షల కోట్లు

2024-25లో అంచనా వ్యయంలో 83.64 శాతం.. 2023-24 కంటే 1.37 శాతం తగ్గిన ఖర్చు

- 2022-23తో పోలిస్తే 5.63 % అధికం
- ప్రవేశపెట్టిన బడ్జెట్ 2.91 లక్షల కోట్లు
- రాబడులు, కేంద్ర గ్రాంట్లలో లేని పురోగతి
- పెనుభారంగా మారిన వడ్డీ చెల్లింపులు
- సర్కారుకు కలిసిరాని పన్నేతర రాబడి
- 108 శాతంతో మూలధన వ్యయం భేష్
- మార్చి నివేదిక విడుదల చేసిన 'కాగ్'



హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాబడుల్లో ఆశించిన పురోగతి లేకపోయినా, కేంద్రం నుంచి వస్తాయనుకున్న గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు పూర్తి స్థాయిలో రాకపోయినా, పన్నేతర రాబడి లక్ష్యాన్ని చేరుకోకపోయినా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పద్దుల కింద రూ.2,12,796.27 కోట్లను వ్యయం చేసింది. ప్రతిపాదిత వ్యయం రూ.2,54,431.31 కోట్లలో ఇది 83.64% కావడం గమనార్హం. అంతకుముందు 2023-24లో చేసిన 85.01% వ్యయం కంటే కొంత తక్కువగా నమోదైనా.. బీఆర్ఎస్ హయాం నాటి ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే 5.63% అధిక వ్యయం నమోదైంది. ఈమేరకు రాష్ట్ర ఆదాయ వ్యయాలపై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' శుక్రవారం విడుదల చేసిన మార్చి నివేదికలో వివరాలను వెల్లడించింది. మార్చితో ముగిసిన 2024-25ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం చేసిన మొత్తం వ్యయాలు, సాధించిన రాబడులను వివరించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2,91,159 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలు, అడ్వాన్సులు, ఆర్థిక లోటును మినహాయించి రూ.2,54,431.31 కోట్లను వ్యయం చేస్తామని ప్రకటించింది. కానీ,పలు కారణాలతో రూ.2,12,796.27 కోట్లను మాత్రమే వ్యయం చేయగలిగింది.

కేంద్ర గ్రాంట్లలో మళ్లీ దెబ్బే!

కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల విషయంలో రాష్ట్రానికి మళ్లీ ఎదురుదెబ్బే తగిలింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఇదే పరిస్థితి. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అత్యాశకు పోకుండా, ఆచితూచి కేంద్ర గ్రాంట్లను అంచనా వేసింది. ఈ పద్దు కింద కేంద్రం నుంచి రూ.21,636.15 కోట్లు వస్తాయని అంచనా వేస్తే.. మార్చి నాటికి వచ్చింది రూ.7,913.08 కోట్లు మాత్రమే. అంటే కేవలం 36.57 శాతం నిధులు మాత్రమే సమకూరాయి. కనీసం మార్చిలోనైనా ఎక్కువ నిధులు వస్తాయనుకుంటే.. ఎప్పటిలాగే రూ.1,903 కోట్లు వచ్చాయి.

అప్పులకు వడ్డీలతో పెనుభారం..

పథకాలు, ఇతర కార్యక్రమాల కింద రూ.1,35,289.45 కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకోగా.. సంవత్సరాంతానికి రూ.79,193.85 కోట్లు.. అంటే 58.54 శాతాన్ని మాత్రమే ఖర్చు చేయగలిగింది. తెచ్చిన అప్పులపై వడ్డీలు చెల్లించడం ప్రభుత్వానికి పెనుభారంగా పరిణమించినట్లు నివేదిక ద్వారా తెలుస్తోంది. వడ్డీ చెల్లింపుల కింద సంవత్సరానికిగాను రూ.17,729.77 కోట్లను వ్యయం చేయగలమని ప్రభుత్వం అంచనా వేయగా... అది కాస్తా రూ.26,688.27 కోట్లకు చేరడం గమనార్హం. అంటే... అంచనా వ్యయం కంటే ఎక్కువ మొత్తంలో వడ్డీల కింద చెల్లించాల్సి వచ్చింది. ఇక ఉద్యోగుల జీత భత్యాల చెల్లింపులు కూడా అంచనా కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఈ పద్దు కింద రూ.40,041.79 కోట్లను అంచనా వేయగా.. మార్చి నాటికి రూ.42,245.51 కోట్లు (105.50%) చెల్లించాల్సి వచ్చింది. రిటైర్డు ఉద్యోగుల పెన్షన్లు కూడా భారంగానే తయారయ్యాయి. దీని కింద రూ.11,641.38 కోట్లు అంచనా వేయగా.. మార్చి నాటికి ప్రభుత్వం రూ.16,950.17 కోట్లు (145.60%) చెల్లించింది. అంటే పెన్షన్ల చెల్లింపుల కోసం అంచనా వేసిన సొమ్ము ఏమాత్రం సరిపోలేదని, ఏకంగా 150 శాతం మేర వ్యయం చేయాల్సి వచ్చిందని అర్థమవుతోంది. పథకాల సబ్సిడీల కింద రూ.16,242.42 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేయగా... రూ.11,508.94 కోట్లు (70.86%) మాత్రమే ఖర్చయ్యాయి.

పన్ను రాబడి తగ్గినట్లే..

పన్ను రాబడి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. ఈ పద్దు కింద ఆర్థిక సంవత్సరం మొత్తంలో రూ.1,64,397.64 కోట్లు వస్తాయని సర్కారు అంచనా వేసింది. కానీ, సంవత్సరాంతానికల్లా రూ.1,36,283.47 కోట్లు (82.90%) మాత్రమే సమకూరాయి. ఇందులో ప్రధానంగా స్టాంపులు-రిజిస్ట్రేషన్ల రాబడి దెబ్బకొట్టింది. దీని కింద రూ.18,228.82 కోట్లను అంచనా వేస్తే.. రూ.8,473.21 కోట్లు(46.48%) మాత్రమే సమకూరాయి. జీఎస్టీ కింద రూ.58,594.91 కోట్ల అంచనాకుగాను రూ.50,343.46 కోట్లు(85.92%), అమ్మకం పన్ను కింద రూ.33,449.21 కోట్లకుగాను రూ.31,815.89 కోటు (95.12%), రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద రూ.25,617.53 కోట్లకుగాను రూ.18,603.66 కోట్లు (72.62%), కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో వాటా కింద రూ.18,384.19 కోట్లకుగాను రూ.19,149.89 కోట్లు(104.16%) సమకూరాయి. ఇతర పన్నులు, సుంకాల కింద రూ.10,111.78 కోట్లను అంచనా వేయగా... రూ.7,896.41 కోట్లు(78.09%) వచ్చాయి. మార్కెట్ అప్పుల కింద రూ.49,255.41 కోట్లు తీసుకుంటామని అంచనా వేయగా.. మార్చి నాటికి ప్రభుత్వం రూ.48,322.20 కోట్ల (98.11%) అప్పులు తీసుకున్నట్లు కాగ్ వెల్లడించింది.

మూలధన వ్యయం భేష్

మూలధన వ్యయం విషయంలో ప్రభుత్వ పనితీరు బేషుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. సాగునీటి పారుదల ప్రాజెక్టులు, భవనాలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ మూలధన వ్యయాన్ని వినియోగిస్తారు. దీని కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.33,486.50 కోట్లను వ్యయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఏకంగా రూ.36,209.53 కోట్లను వ్యయం చేసింది. ఇదిప్రతిపాదిత వ్యయంలో 108.13 శాతం కావడం గమనార్హం. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనులను కొనసాగిస్తూనే కొత్తగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తున్నందున.. మూలధన వ్యయం ఆశించిన స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది.

పన్నేతర రాబడీ కలిసి రాలేదు

పన్నేతర రాబడి కూడా ప్రభుత్వానికి కలిసి రాలేదు. దీని కింద రూ.35,208.44 కోట్లు అంచనా వేయగా.. రూ.23,607.77కోట్లు (67.05%) మాత్రమే వచ్చాయి. అయితే పన్నేతర రాబడి కింద మిగతా నెలల కంటే అధికంగా ఒక్క మార్చిలోనే ఏకంగా రూ.17,535.79 కోట్లు వచ్చినట్లు కాగ్ నివేదిక పేర్కొనడం గమనార్హం.

లండన్ పర్యటనకు మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): లండన్ కేంద్రంగా నిర్వహిస్తున్న ఆటోమొబైల్ ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) కేంద్రాన్ని ప్రారంభించాల్సిందిగా ఆ సంస్థ నిర్వాహకులు కేటీఆర్‌కు ఆహ్వానం పంపారు. యూకేలోని వార్విక్ టెక్నాలజీ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని ఈ నెల 30న ఆయన ప్రారంభించనున్నారు. ప్రపంచంలోనే విలువైన బ్రాండెడ్ కార్లు మెక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రముఖ ఆటో దిగ్గజాలకు సేవలు అందిస్తోందని సంస్థ డైరెక్టర్ క్రాంతి పుప్పాల తెలిపారు.

అమెరికాకు బయలుదేరి వెళ్లిన కవిత

తమ కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం అమెరికా పర్యటనకు వెళ్లారు. చిన్న కుమారుడు ఆర్యతో కలిసి బయలుదేరి వెళ్లారు. ఆమె విదేశీ పర్యటనకు సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతి ఇచ్చింది. ఈనెల 23న తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు.

బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు : రామచంద్ర నాయక్

బీఆర్ఎస్ పార్టీలో ముసలం పుట్టిందని, కల్వకుంట్ల కుటుంబంలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరిందని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆరోపించారు. ఒక వైపున హరీశ్ రావు కొత్త పార్టీ పెడుతున్నారన్న ప్రచారం జరుగుతుంటే.. మరో వైపున కల్వకుంట్ల కవిత.. ఆపార్టీకి వ్యతిరేకంగా బహిరంగ విమర్శలు చేస్తున్నారని చెప్పారు. హరీష్‌రావు ఇంట్లో ఫంక్షన్లు జరిగినా వెళ్లని కేటీఆర్.. అకస్మాత్తుగా ఆయన ఇంటికి వెళ్లి 2గంటలు ఎందుకు చర్చలు జరిపినట్లని నిలదీశారు.

నెలాఖరులోపు కాళేశ్వరం నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ అంశాలపై ఇప్పటికే విచారణ పూర్తయినందున నివేదికకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమైంది. కమిషన్ ఇప్పటికే విజిలెన్స్, జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలను పరిశీలించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై సంబంధిత ఇంజనీర్లు, ఉన్నతాధికారులు, సిబ్బందిని విచారించింది. దీంతో పాటు పత్రాలతో కూడిన ఆధారాలు, వివిధ సమావేశాల మినిట్స్ తనకు చేరడంతో ఇక వాటినే ఆధారం చేసుకొని ప్రభుత్వానికి నివేదిక అందించాలని కమిషన్ నిర్ణయించింది. కాగా, విచారణకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను పిలువాలని మొదట భావించిన కమిషన్.. ఆ తర్వాత ప్రస్తుత పరిస్థితుల్లో వారిని పిలువాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో నివేదికను త్వరితగతిన సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించేందుకు చర్యలు చేపట్టింది.

సురేఖ తెగించి కమీషన్ మంత్రుల పేర్లు చెప్పాలి

- మంత్రి ఆరోపణలపై దర్యాప్తు చేయించగలరా?
- రాహుల్, రేవంత్ రెడ్డిలను ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెగించి.. కమీషన్లు తీసుకుంటున్న మంత్రుల పేర్లను బయట పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. మంత్రుల దగ్గర ఏ ఫైల్ కదలాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందేనని మంత్రి కొండా సురేఖ ఎట్టకేలకు నిజం చెప్పారని పేర్కొన్నారు. సురేఖ వ్యాఖ్యలపై శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ.. కమీషన్ సర్కారు నడిపిస్తోందని వ్యాఖ్యానించారు. దురదృష్టవశాత్తు ఇది బహిరంగ రహస్యమై పోయిందన్నారు. సొంత పార్టీ మంత్రి చేసిన అవినీతి ఆరోపణలపై సీఎం ఎ.రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దర్యాప్తు చేయించగలరా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ కమీషన్ వ్యాపారాన్ని ఎత్తి చూపుతూ సచివాలయం ముందే కాంట్రాక్టర్లు ధర్నాకు దిగడం కాంగ్రెస్ సర్కారు అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేస్తుందన్నారు.

నీ చెల్లిని నా దగ్గరకు పంపు!

- ప్రేమించిన బాలికకు యువకుడి బ్లాక్‌మెయిల్
- లేదంటే ఫొటోలు బయటపెడతానని బెదిరింపులు
- ఆత్మహత్యకు యత్నించిన బాలిక చెల్లెలు
- నిందితుడిపై పోక్సో కేసు.. మేడ్చల్ జిల్లాలో ఘటన

ఘట్‌కేసర్ రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి ఆమె చెల్లిని తనతో పంపాలని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడో బీటెక్ విద్యార్థి. ఇది తెలిసి తీవ్ర మనస్తాపానికి గురైన ఆ బాలిక చెల్లెలు ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలో వెలుగుచూసింది. ఘట్‌కేసర్ మునిసిపాలిటీ అవుశాపూర్‌కు చెందిన గుర్రం అవినాశ్ రెడ్డి(20) ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చౌదరిగూడలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్న అదే గ్రామానికి చెందిన బాలిక(16)తో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో అతడికి పరిచయమైంది. ప్రేమ పేరుతో వల వేశాడు.. అప్పటినుంచి ఇద్దరూ సన్నిహితంగా ఉంటూ కలిసి ఫొటోలు దిగారు. వీడియోలు తీసుకున్నారు. 15 రోజుల క్రితం అవినాశ్ రెడ్డి డబ్బులు అవసరం ఉన్నాయంటూ బాలికకు ఫోన్‌చేసి.. ఆమె చెల్లి (15)తో పంపించాలని డిమాండ్ చేశాడు. డబ్బులు తనవద్ద లేవని ఆ బాలిక చెప్పింది. అయితే బంగారు ఆభరణాలైనా ఇచ్చి పంపించాలని.. లేదంటే తాము దిగిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేస్తానని బాలికకు ఆ యువకుడు బ్లాక్‌మెయిల్ చేశాడు. ఆ బాలిక చేసేది లేక ఇంట్లోని ఆరు తులాల బంగారు ఆభరణాలను తన చెల్లితో ఇచ్చి పంపించింది. తర్వాత అవినాశ్... బాలికకు ఫోన్ చేసి ఆమె చెల్లిని తన వద్దకు పంపాలని ఒత్తిడి చేశాడు. రెండ్రోజుల తర్వాత ఇంట్లో బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ఇద్దరు కూతుళ్లను తల్లి మందలించింది. భయపడిపోయిన ఆ బాలిక చెల్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. అనంతరం తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాలికల తండ్రి ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు అవినాశ్ రెడ్డిని అదుపులోకి తీసుకొని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.



అదంపూర్ వైమానిక స్థావరంలో లక్ష్మీకాంత్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న ప్రధాని

భారత వైమానిక రక్షణ దళంలో తెలుగువాడు

- ఆపరేషన్ సింధూర్‌లో కీలక పాత్ర
- ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ బాధ్యతల్లో లక్ష్మీకాంత్‌రెడ్డి

కోహీర్, మే 16 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో తెలుగు యువకుడు కీలక పాత్ర పోషించాడు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి 2019లో భారత వైమానిక దళానికి ఎంపికయ్యారు. ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పంజాబ్ రాష్ట్రంలోని అదంపూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రాజనెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల రాజవర్ధన్‌రెడ్డి పెద్ద కుమారుడు లక్ష్మీకాంత్‌రెడ్డి. పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ముందుగానే గుర్తించి నాశనం చేసిన అత్యాధునిక రక్షణ వ్యవస్థ ఎస్-400 ఆపరేటింగ్ విధులు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ ముగిసిన అనంతరం అదంపూర్ వైమానిక స్థావరాన్ని సందర్శించిన ప్రధాని మోదీ ఈ సందర్భంగా లెఫ్టినెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డిని అభినందించారు.

యుద్ధ సామాగ్రి విక్రయాలను అమెరికా నిలిపివేయాలి

- 24న సికింద్రాబాద్‌లో శాంతి సభ: కేఏ పాల్

న్యూఢిల్లీ, మే 16(ఆంధ్రజ్యోతి): 'యుద్ధ సామాగ్రిని అమ్మేవారు యుద్ధాన్ని కోరుకుంటారు తప్ప శాంతిని కోరుకోరని' ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. శుక్రవారం, తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతిని కోరుకుంటే మొదట యుద్ధ సామాగ్రిని అమ్మడాన్ని ఆపేయాలి. మన దేశ జీడీపీలోని మూడో వంతుకు సమానమైన యుద్ధ సామాగ్రిని సౌదీ, యూఏఈ, ఖతార్ దేశాలకు ఇటీవల ట్రంప్ మూడు రోజుల్లోనే అమ్మారు. అలాంటి వారు యుద్ధాన్ని ఆపగలరా? భారత్, పాక్ యుద్ధం సీజ్ ఫైర్‌కు ముందు తాము జోక్యం చేసుకోబోమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. ఆ తర్వాత తామే యుద్ధాన్ని ఆపామని ట్రంప్ అబద్ధాలు చెప్పారు. ట్రంప్ పరువు పోతుందని ప్రధాని మోదీ ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉన్నారు. ఈ నెల 24న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో శాంతిసభ నిర్వహిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల నుంచి ప్రజలు వస్తున్నారు' అని కేఏ పాల్ ప్రకటించారు.

మీరా.. మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడేది?

- కేటీఆర్‌పై ఎంపీ చామల ధ్వజం

హైదరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): మార్ఫింగ్ వీడియోలతో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రామప్ప గుడి దగ్గర అత్యుత్సాహంతో.. ఎవరో ఒకరు మిస్ వరల్డ్ కంటెస్టెంట్ కాళ్లకు కర్చీఫ్ అద్దినట్టు ఫొటో చూపించి, దానికి తెలంగాణ మహిళల ఆత్మగౌరవం ఏమైందంటూ సోనియాగాంధీకి కేటీఆర్ ట్వీట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. "పదేళ్ల పాలనలో కల్వకుంట్ల ఇంటి ఆడబిడ్డ తప్ప.. రాష్ట్రంలోని ఏ ఇంటి ఆడబిడ్డా మీకు గుర్తుకు రాలేదు. మీరా.. మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడేది" అంటూ కేటీఆర్‌పై ధ్వజమెత్తారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆ ప్రశ్నల ఆంతర్యం

ప్రశ్న మంచిదే. అయితే, ఏ ఉద్దేశంతో, ఏ ప్రయోజనాలకోసం? రాష్ట్రపతి సుప్రీంకోర్టును పద్నాలుగు ప్రశ్నలు వేశారు. బిల్లుల ఆమోదానికి గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితులు విధిస్తూ సుప్రీంకోర్టు గతనెల తీర్పు వెలువరించినప్పుడు, అధికారపక్షం నుంచి ఏ స్థాయిలో విమర్శలు వచ్చాయో తెలిసిందే. ఇలా రాష్ట్రపతిని రంగంలోకి తెచ్చి ఇంకా యుద్ధం కొనసాగించడం ఎందుకూ, సుప్రీంకోర్టు తీర్పుమీద అంత కోపం ఉంటే, రాజ్యాంగాన్నే మీకు నచ్చినట్టుగా మార్చేసుకోండి అని కొందరు న్యాయకోవిదులు ఆగ్రహంతోనో, అభిమానంతోనో ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు. న్యాయవ్యవస్థకూ, కార్యనిర్వాహక వ్యవస్థకూ మధ్య వివాదం కొనసాగడం, అగాధం పెరగడం అధికులకు నచ్చడం లేదు. ప్రశ్నించినంత మాత్రాన సవాలు చేసినట్టు కాదు, వివరణ అడిగితే విమర్శించినట్టూ కాదు. కానీ, ఈ ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ లక్ష్యం అంత సున్నితంగా, ఉన్నతంగా కనిపించకనే ఈ అనుమానాలు, విమర్శలు.

రాజ్యాంగంలో లేని కాలపరిమితులను గవర్నర్లమీదా, రాష్ట్రపతిమీదా విధించడమేమిటంటూ, న్యాయసలహా పేరిట పద్నాలుగు ప్రశ్నలు సుప్రీంకోర్టుకు సంధించి రాష్ట్రపతి దానిని జవాబుదారీని చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇప్పటివరకూ పద్నాలుగుసార్లు మాత్రమే ఈ న్యాయ సలహా ప్రయోజనాన్ని రాష్ట్రపతి వినియోగించుకున్నందున, మొన్నటి తీర్పు విషయంలో కార్యనిర్వాహక వ్యవస్థ ఎంత పట్టుదలగా ఉన్నదో అర్థమవుతుంది. రాజ్యాంగపరమైన హద్దులు, అధికారాల విభజన ఇత్యాది అంశాలకు సంబంధించి సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి చక్కని ప్రశ్నలు వేశారు. గవర్నర్ల అధికారాలు, రాష్ట్రపతి విచక్షణాధికారాల గురించి ఆరా తీశారు. గట్టిగా గుదిగుచ్చిన ఆ ప్రశ్నల మధ్యన మీ తీర్పు ఎలా చెల్లుబాటవుతుందన్న అసలు ప్రశ్న కూడా వేశారు. రాష్ట్రపతి సంధించిన ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు విలవిలలాడి, ఈ వివాదానికి మూల కారణమైన తీర్పును సమీక్షించుకుంటుందనీ, రద్దుపరుచుకుంటుందనీ కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కొత్త ప్రధాన న్యాయమూర్తి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసి, సమాధానాలు సిద్ధం చేయవచ్చునని వార్తలు వస్తున్నాయి. రాష్ట్రపతి ఆమోదించని బిల్లులను సైతం రాజ్యాంగ అధికరణం 142 ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని చెల్లుబాటైనట్టుగా నిర్ధారించిన సుప్రీంకోర్టును 143వ అధికరణం కింద రాష్ట్రపతి ప్రశ్నించడం బాగున్నది కానీ, ఈ ప్రశ్నలు కొత్తవీ కావు, వీటిని తెరవెనుకనుంచి అడుగుతున్నవారికి సమాధానాలు తెలియనిదీ కాదు.

ఆర్టికల్ 142ను న్యూక్లియర్ మిసైల్‌గా అభివర్ణించిన ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ సహా ఆ నాటి తీర్పును తూర్పారబట్టిన నాయకులంతా బిల్లుల ఆమోదానికి నిర్దిష్టమైన గడువు విధించడాన్ని సహించలేకపోతున్నారు. ఈ తీర్పు తమిళనాడు గవర్నర్‌కో, అధికారపక్షంతో ఆయన క్రీడించిన ఓ డజను బిల్లులకో పరిమితమైనది కాదు. ఆర్.ఎన్. రవి తరహాలో వ్యవహరిస్తున్న విపక్షపాలిత రాష్ట్రాల గవర్నర్లందరికీ లక్ష్మణరేఖ దాటవద్దన్న ఘాటైన హెచ్చరిక అది. రాజ్యాంగం ఆశయాలకు అనుగుణంగా, ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసిన తీర్పు ఇది. బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు, రాష్ట్రపతికి రాజ్యాంగం గడువులేమీ విధించలేదు కనుకనే, ఆ పని మొన్నటి తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం చేసింది. గడువు లేని కారణంగా గవర్నర్లు విపక్షపార్టీల ప్రభుత్వాలతో ఆడుకుంటున్నారు కనుకనే, ప్రజాభీష్టాన్ని పరిరక్షించడానికి వీలుగా కాలపరిమితులు విధించింది. గడువుదాటిన గవర్నర్ల చర్యలు న్యాయసమీక్షకు నిలవాల్సి వస్తుందని హెచ్చరించింది. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న రవి వంటివారిని వల్లనే ఇదంతా చేయవలసి వచ్చింది. ఇప్పుడు సుప్రీంకోర్టును ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాష్ట్రపతి ఎప్పటికప్పుడు రవి వంటివారిని హద్దుల్లో ఉంచివుంటే ఈ గొడవే ఉండేదికాదు. కాల పరిమితి దాటిన బిల్లులను కూడా తెలివిగా రాష్ట్రపతి బరిలోకి తోసినప్పుడే రవిని ఆ రాజ్యాంగాధిపతి కన్నెర్ర చేసివుంటే బాగుండేది.

సుప్రీంకోర్టు తీర్పును మన పాలకులు పలు రకాల పిటిషన్లతో పునఃపరిశీలించమని అడగవచ్చు, విస్తృత ధర్మాసనం కోసం విజ్ఞప్తి చేయవచ్చును. కానీ, ఇవేమీ కాకుండా ఇలా ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌తో ప్రశ్నించి, దాని హద్దులను తెలియచెప్పాలని కోరుకుంటున్నట్టుంది. ఈ అంశంలో సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని నివేదించినప్పటికీ, దానికి కట్టుబడాలన్న నియమం ఏమీ లేదు కనుక, కార్యనిర్వాహక వ్యవస్థ తనకు తోచిన విధంగా వ్యవహరించవచ్చు. కాకపోతే, రాష్ట్రాల హక్కులు, గవర్నర్ల విధులకు సంబంధించి కొన్ని కొత్త అంశాలతో లోతైన చర్చ జరిగేందుకు ఈ పరిణామం ఉపకరించవచ్చు.

ట్రంప్ దౌత్య రాజకీయం!

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత వ్యవహారాలలో ప్రమేయం పెట్టుకోకుండా దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారు. అయితే ట్రంప్ మహాశయుడు మోదీ అభీష్టాన్ని నెరవేరుస్తారా? నెరవేర్చరు, సందేహం లేదు. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలో ఉగ్రవాద దాడితో ప్రారంభమైన ఇండియా-పాకిస్థాన్ సంఘర్షణలో అమెరికా ప్రమేయం పెట్టుకుని తీరాలని డోనాల్డ్ ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఈ ఘర్షణపై తాను మాట్లాడిన ప్రతిసారీ, ట్వీట్ చేసిన ప్రతిసారీ తానూ భాగస్తుడినని మరీ మరీ స్పష్టం చేస్తున్నారు. ట్రంప్ అత్యుత్సాహానికి మౌనమే ఇంతవరకూ మోదీ ప్రతిస్పందన. సెప్టెంబర్ 2019లో హ్యూస్టన్‌లో 'అబ్కీ బార్, ట్రంప్ సర్కార్' అని పిలుపు ఇచ్చినందుకు మోదీ ఇప్పుడు కలవరపడుతూ ఉండవచ్చని నేను అనుమానిస్తున్నాను.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఏప్రిల్ 22న, ఇతర ప్రపంచ నాయకుల వలే ట్రంప్ కూడా పహల్గాం ఘాతుకంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఘటనను తీవ్రంగా ఖండించారు. మే 7న పాకిస్థాన్‌లో ఎంపిక చేసిన లక్ష్యాలపై భారత్ మిస్సైళ్ల, డ్రోన్‌ల దాడి ప్రారంభించింది. పూర్తి స్థాయి యుద్ధానికి దిగే ఉద్దేశం తమకు లేదని ఇండియా స్పష్టం చేసింది. భారత్ పాకిస్థాన్‌ల మధ్య సాయుధ ఘర్షణ శీఘ్రగతిన ముగుస్తుందని ఆశిస్తున్నానని ట్రంప్ ట్వీట్ చేశారు. ఆ మరుసటి రోజు 'తాను ఏమైనా సహాయం చేయగలుగుతానని భావిస్తే అక్కడ ఉంటాను' అని ఆయన అన్నారు.

మే 8/9 రాత్రి ఆయన వైఖరిలో ఏదో మార్పు చోటుచేసుకున్నది. చైనా ఉత్పత్తి చేసిన యుద్ధ విమానాలు, మిస్సైళ్లు, టర్కీలో తయారైన డ్రోన్‌స్‌ను పాకిస్థాన్ ఉపయోగిస్తున్న విషయం తెలియడం వల్లే ఆ మార్పు సంభవించి ఉంటుందని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ ప్రయోగించిన మిస్సైళ్లు, డ్రోన్‌లు అన్నిటినీ కూల్చివేసినట్టు మన సీనియర్ సైనికాధికారులు ధ్రువీకరించారు. రెండు రోజుల అనంతరం భారత్‌కు కొంత 'నష్టం' సంభవించినట్టు అధికారికంగా అంగీకరించారు. యుద్ధంలో రెండు పక్షాలకు నష్టం వాటిల్లడం సహజమే కదా. జరిగిన నష్టానికి ఇండియా ఏమీ ఆందోళన చెందలేదు. భారత ప్రజలూ కలవరపడలేదు. మే 10న ట్రంప్ తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో చేసిన ట్వీట్‌తో కలవరం మొదలయింది. ఆ రోజు సాయంత్రం 5.25 గంటలకు ట్రంప్ తన ట్వీట్‌లో అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల గురించి ప్రస్తావిస్తూ భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే, పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించేందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇరు దేశాలను అభినందించారు. కొద్ది నిమిషాల అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి ఒక 'తటస్థ' ప్రదేశంలో చర్చలకు భారత్, పాకిస్థాన్‌లు సమావేశమవనున్నాయని ట్వీట్ చేశారు. అంతకు ముందు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ మోదీతో టెలిఫోన్‌లో జరిపిన సంభాషణల్లో ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని తెలియజేసినట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ ట్వీట్‌లు అన్నీ ఆసక్తికరంగానూ, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి.



ఇండియా, పాకిస్థాన్‌ల మధ్య సాయుధ సంఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్వీట్‌లు ఆసక్తికరంగాను, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి. ఈ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?

మే 10 మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)ల మధ్య చర్చలు జరిగాయని, సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని అదే రోజు సాయంత్రం 6 గంటలకు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి ధ్రువీకరించారు.

మే 12న 'అణు యుద్ధ' ప్రమాదాన్ని నివారించామని ట్రంప్ పేర్కొన్నారు. 'ఆ భయంకర యుద్ధానికి పాల్పడవద్దు. మీరు సంయమనంతో వ్యవహరిస్తేనే మీతో మేము వాణిజ్యం చేస్తామ'ని ఆయన అన్నారు. 'మీరు గనుక యుద్ధాన్ని ఆపకపోతే మేము ఎటువంటి వాణిజ్యమూ చేయం' అని ఆయన పేర్కొన్నారు. (సౌదీ అరేబియా, ఖతర్ పర్యటనలలో కూడా అధ్యక్షుడు ట్రంప్ తన ప్రకటనలను పునరుద్ఘాటించారు). మే 13న 'కొత్త సాధారణ పరిస్థితి' గురించి మోదీ ప్రస్తావించారు. 'అణు బ్లాక్ మెయిల్'కు తాము భయపడమని, తలొగ్గమని స్పష్టం చేశారు.

కొన్ని సహేతుకమైన ప్రశ్నలు: మూడు అంశాల సూత్రంలో 'కొత్త' విషయమేమీ లేదు. ఉగ్రవాద దాడికి దీటుగా ప్రతిస్పందించడం; అణు బ్లాక్‌మెయిల్‌ను సహించకపోవడం; రాజ్య ఉగ్రవాదం, ఉగ్రదాడుల వ్యూహ ప్రజ్ఞాధురీణుల మధ్య వ్యత్యాసాన్ని పాటించకపోవడం. ఈ సువ్యవస్థిత సిద్ధాంతాన్నే కదా మోదీ పునరుద్ఘాటించింది? (2) ఉపాధ్యక్షుడు వ్యాన్స్ విదేశాంగ కార్యదర్శి రూబియో మే 8, 9న కాల్పుల విరమణ గురించి మాట్లాడారా? అదే సమయంలో వారు పాకిస్థాన్ నేతలతో కూడా మాట్లాడారా? మాట్లాడి ఉన్నట్టయితే అది మధ్యవర్తిత్వం కిందకు వస్తుంది కదా. (3) మే 9న మోదీతో 'ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని' ఉపాధ్యక్షుడు వ్యాన్స్ పంచుకున్నారా? అణ్వస్త్రాలను ప్రయోగిస్తామన్న పాకిస్థాన్ బెదిరింపునకు సంబంధించినదేనా ఆ సమాచారం? కానట్టయితే ప్రధానమంత్రి (మే 12), రక్షణ మంత్రి (మే 15) అణు బ్లాక్‌మెయిల్ గురించి ఎందుకు ప్రస్తావించారు? (4) మే 10న మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్‌ల డీజీఎమ్ఓలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చినట్టు ట్రంప్‌కు ఎలా తెలిసింది? ఆ విషయాన్ని అదే రోజు సాయంత్రం 5.25 గంటలకు తన ట్వీట్‌లో ఆయన ఎలా ప్రకటించారు? (5) ట్రంప్ ఏప్రిల్ 2న సుంకాల సమరాన్ని ప్రారంభించిన తరువాత భారత్ మారు ప్రతిపాదనలు పంపలేదా? ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తన ఇండియా పర్యటనలో మోదీతో జరిపిన సంభాషణల్లో 'వాణిజ్య ఒప్పందం' విషయాన్ని ప్రస్తావించిందా? (6) భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం చేశామని, వాణిజ్యం అంశాన్ని ఉపయోగించుకుని కాల్పుల విరమణ పాటించేలా బలవంతం చేశామని ట్రంప్ పదే పదే చెప్పుతుండడంపట్ల అమెరికాకు ఇండియా నిరసన తెలిపిందా? పాకిస్థాన్‌కు ఐఎమ్ఎఫ్ రుణం మంజూరుకు సంబంధించిన సమావేశానికి ఇండియా ఎందుకు గైర్హాజరయింది? ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయలేదు? ఇంకా వివిధ ప్రశ్నలు ఉన్నాయి. అయితే వాటిని ప్రస్తావించేందుకు తగిన సమయం ఆసన్నమవలేదు. డోనాల్డ్ ట్రంప్ ఎవరికీ లొంగే వ్యక్తి కాదు. భారత్, పాకిస్థాన్ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తిరోగమనంలో పురోగామి భారత్!

భారత్, పాకిస్థాన్‌లు ఏకోదరులు. బ్రిటిష్ వలస పాలన నుంచి ఏకకాలంలో విముక్తమై స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించాయి. ఉమ్మడి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వారసత్వమున్నప్పటికీ ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర అస్తిత్వంలో అవి భిన్న బాటలలో నడిచాయి. భారత ఆర్థిక వ్యవస్థ శీఘ్రగతిన అభివృద్ధి చెందింది. భారత్ తలసరి ఆదాయం పాకిస్థాన్ తలసరి ఆదాయం కంటే రెండు రెట్లు ఎక్కువ. ఇండియా సమైక్యంగా ఉన్నది. పాకిస్థాన్ 1971లో, అత్యధిక జనాభా ఉన్న తన తూర్పు విభాగాన్ని కోల్పోయింది. తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా ప్రభవించింది. ఇండియా విధిగా ప్రతి ఐదేళ్ల కొకసారి ఎన్నికలు నిర్వహిస్తోంది. అధికారానికి వివిధ రాజకీయ పార్టీలు తీవ్రంగా పోటీడుతున్నాయి. పాకిస్థాన్‌లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలి, ఫలితాలు ఎలా ఉండాలన్న విషయాన్ని సైనికాధికారులు నిర్ణయిస్తారు!

పాకిస్థాన్ కంటే ఇండియా ఎందుకు మెరుగ్గా, సమున్నతంగా ఉన్నది? తమ మత ఔన్నత్యం ఉత్కృష్టమైనది కనుక ఇస్లాంపై స్వతస్సిద్ధ, ఆధిక్యత కలిగి ఉన్నదని, ఇదే భారత్ సమున్నతికి కారణమని హిందూ మత దురభిమానులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. సత్యమేమిటి? అది భిన్నంగా ఉన్నది. భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య (భారత రిపబ్లిక్) పితామహులు, మాతృమూర్తులు మత దురభిమానాన్ని తోసిపుచ్చారు. మత ప్రాతిపదిక ఆధిక్యతావాదాలను తిరస్కరించారు. ఇదే మనలను పాకిస్థాన్‌కు భిన్నంగా ప్రగతిశీల బాటలో నిలిపింది. భారత రాజ్యాంగం పురాతన హిందూ రాజరిక పాలనా నమూనాలను తిరస్కరించింది. ఒక వ్యక్తి, ఒక ఓటు ఆధారంగా ఉండే రాజకీయ వ్యవస్థ వైపు మొగ్గు చూపింది. కుల అసమానతలు, జెండర్ వివక్షలతో ఘనీభవించిన సంప్రదాయ సామాజిక నిచ్చెన మెట్ల వ్యవస్థను గర్హించింది. మతాన్ని రాజ్యవ్యవస్థతో మిళితం చేసేందుకు నిర్ద్వంద్వంగా నిరాకరించింది. పాకిస్థాన్ అలా చేసినప్పటికీ భారత్ తన లౌకిక, ప్రజాస్వామిక విశ్వాసాలకు పూర్తిగా కట్టుబడిపోయింది. స్వతంత్ర భారతదేశ నాయకులు ఆధునిక విజ్ఞానశాస్త్రానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. సహేతుక ఆలోచనా ధోరణులను పెంపొందించారు. ఆర్థిక ప్రగతిని ప్రోత్సహించారు.

భారత రిపబ్లిక్ సంస్థాపక విలువలు అయిన ప్రజాస్వామ్యం, బహుళత్వ వాదంను ఇండియా సదా గౌరవించలేదు, అనుసరించ లేదు. 1975–77 అత్యవసర పరిస్థితి కాలంలో దేశ ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు, పౌర స్వేచ్ఛలు లభించలేదు. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు రాజ్యవ్యవస్థ హింసాకాండను చవి చూశాయి. మైనారిటీలపై మళ్లీ మళ్లీ దాడులు జరుగుతూనే ఉన్నాయి; విదేశీయులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయినప్పటికీ రిపబ్లిక్ సంస్థాపక విలువలు సుస్థిరంగా ఉన్నాయి. 1991లో లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్ రద్దయిన దరిమిలా రెండున్నర దశాబ్దాలలో దేశంలో అద్వితీయమైన అభివృద్ధి జరిగింది. ఇండియా కనుక సంకుచిత ప్రాతిపదికలపై ప్రాంతాల వారిగా చీలిపోయినా, నిరంకుశ పాలనలో ఉండిపోయినా, లేక మత రాజ్యంగా పరిణమించినా ఆ అద్భుత ఆర్థిక ప్రగతి సాధ్యమయ్యేది కాదు.

ప్రచ్ఛన్నయుద్ధానంతర పరిస్థితులు ఆర్థిక పురోగతికి కల్పించిన అవకాశాలను పాకిస్థాన్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఎందుకని? దేశ రాజకీయాలలో సైన్యం జోక్యం పెరిగిపోవడం, పాకిస్థానీయుల దైనందిన జీవితాలలో ఛాందసవాద ఇస్లాం ప్రభావం పెరిగిపోవడమే అందుకు కారణాలు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడం, ఒసామా బిన్‌లాడెన్‌కు ఆశ్రయమివ్వడం, అణ్వస్త్రాల వ్యాప్తికి కీలకంగా తోడ్పడడం మొదలైనవి అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. భారత్, పాకిస్థాన్‌లు పూర్తిగా భిన్న బాటల్లో నడిచినప్పటికీ ప్రపంచ దేశాలు ఇప్పటికీ కొన్నిసార్లు రెండిటినీ ఒకే గాటన నిలబెడుతున్నాయి. ప్రతి విషయంలోను ఉభయ దేశాలను కలిపి ప్రస్తావిస్తున్నాయి! కశ్మీర్‌పై మూడు యుద్ధాలు జరగడమే అందుకొక ప్రధాన కారణం. అయితే ఈ శతాబ్ది తొలినాళ్ల నాటికి భారత్ అన్ని విధాల అసాధారణ పురోగతి సాధించడంతో 'ఇండో-పాక్' ప్రశ్నపై తర్జనభర్జనలు ఆగిపోయాయి. ఇండియా తన అద్భుత పురోగతితో ఫలప్రదంగా పాకిస్థాన్‌తో తనను కలిపి చూసే ధోరణుల నుంచి బయటపడింది. అదే సమయంలో ఇండియాను చైనాతో కలిపి ప్రస్తావించడం ప్రారంభమయింది. 'చిండియా' అనే భావన బాగా ప్రాచుర్యం పొందింది. అయితే ఇండియా ప్రజాస్వామిక సంప్రదాయాలు, బహుళత్వ వాద విలువల కారణంగా జపాన్, ఉత్తర అమెరికా, యూరోపియన్ దేశాల ప్రభుత్వాల, ప్రజల, మదుపుదారుల మద్దతును విశేషంగా పొందింది.



తమ పౌరులకు మెరుగైన జీవన స్థితిగతులను సమకూర్చడంలో పాకిస్థాన్ కంటే ఇండియా అన్ని విధాల ఉన్నతస్థాయిలో ఉందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ మనకు మనం ఒక ప్రశ్న వేసుకునితీరాలి: ఇటీవలి సంవత్సరాలలో మనం తిరోగమించలేదూ? అమెరికా పూర్వ అధ్యక్షులు జార్జి బుష్, బరాక్ ఒబామా, జో బైడెన్ ఎప్పుడైనా భారత్, పాకిస్థాన్‌లను జోడించి ప్రస్తావించారా? కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం నెరపుతామని ప్రతిపాదించారా?



■ రామచంద్ర గుహ

గతానుగతం

అయితే ఇప్పుడు పహల్గాం ఉగ్ర దాడి, దానికి మన ప్రభుత్వ ప్రతిస్పందన ఫలితంగా భారత్, పాకిస్థాన్‌ల గురించి కలిపికట్టుగా మాట్లాడడం మళ్లీ ప్రారంభమయింది. భారత్ సమున్నతిని తక్కువ చేసే విధంగా హైఫనేషన్‌ను మళ్లీ ఉపయోగిస్తున్నారు. భారత్, పాకిస్థాన్ అని విడివిడిగా కాకుండా భారత్-పాకిస్థాన్ అని ప్రస్తావిస్తున్నారు! భారత్, పాకిస్థాన్‌లు సమ స్థాయి దేశాలు అన్నట్టుగా డోనాల్డ్ ట్రంప్ స్పష్టాతి స్పష్టంగా మాట్లాడటం ప్రారంభించారు ఆ రెండూ 'గొప్ప' దేశాలనీ, రెండిటితోను తనకు మంచి సంబంధాలు ఉన్నాయనీ, కాల్పుల విరమణకు ఇరు దేశాల నాయకులను ఒప్పించానని, సరైన తీరులో ఉంటే వాణిజ్యం కొనసాగిస్తానని చెప్పానని ట్రంప్ వెల్లడించారు. పుండు మీద కారం చల్లినట్లుగా కశ్మీర్‌పై 'వెయ్యి' సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధం విషయమై రెండు దేశాల మధ్య రాజీ కుదిర్చేందుకు మధ్యవర్తిత్వం నెరపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ తెలిపారు.

ట్రంప్ వాచాలుడు, అహంకారి, చంచల స్వభావి. అయితే ప్రపంచ అతి సంపన్న, మహాశక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడు. ఆ దేశంతో మనకు కీలకమైన ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. కనుక ఆయన మాటలు ఎంత ఆషామాషీగా ఉన్నప్పటికీ మనం గంభీరంగా వినాలి. వాటిపై ఆలోచించాలి. అయితే అంతర్జాతీయ మీడియా జగత్తులో భారత్, పాకిస్థాన్‌లను హైఫన్ (భారత్-పాకిస్థాన్)తో ప్రస్తావించడాన్ని ఉపేక్షించకూడదు. ఈ నెల 10వ తేదీన భారత్, పాకిస్థాన్‌ల మధ్య చెలరేగుతున్న ఘర్షణల నేపథ్యంపై 'ఫైనాన్షియల్ టైమ్స్' ఒక విపుల కథనాన్ని ప్రచురించింది. దాని శీర్షిక : 'Two religious strongmen clash' ప్రస్తావిత ఇద్దరు వ్యక్తులు అసీమ్ మునీర్, నరేంద్ర మోదీ!

తమ పౌరులకు మెరుగైన జీవన స్థితిగతులను సమకూర్చడంలో పాకిస్థాన్ కంటే ఇండియా అన్ని విధాల ఉన్నతస్థాయిలో ఉందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ మనకు మనం ఒక ప్రశ్న వేసుకునితీరాలి: ఇటీవలి సంవత్సరాలలో మనం తిరోగమించలేదూ? అమెరికా పూర్వ అధ్యక్షులు జార్జి బుష్, బరాక్ ఒబామా, జో బైడెన్ ఎప్పుడైనా భారత్, పాకిస్థాన్‌లను జోడించి ప్రస్తావించారా? కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం నెరపుతామని ప్రతిపాదించారా? మన్మోహన్‌సింగ్, నరసింహారావు, రాజీవ్‌గాంధీ, దేవెగౌడ లేదా అటల్ బిహారి వాజపేయిలలో ఎవరినైనా Religious strongman' అని ఫైనాన్షియల్ టైమ్స్ ఎప్పుడైనా ప్రస్తావించిందా?

నిజానికి ఇండియా గత దశాబ్దంలో తిరోగమించిందని ఒక చరిత్రకారుడుగా, ఒక పౌరుడుగా నేను సునిశ్చితంగా వాదిస్తాను. ఇప్పటికీ మనం జాతీయ స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను ఎన్నికలను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నాము. అయితే ఆ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయమై న్యాయసమ్మతమైన సంశయాలు ఉన్నాయి. మీడియా చాలవరకు ప్రభుత్వ ప్రచారానికి ఒక ప్రధాన ఆలంబనగా ఉయోగపడుతోంది. రెగ్యులేటరీ, దర్యాప్తు సంస్థలు అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల గవర్నర్లు జాతీయ పాలక పక్షానికి అనుకూలంగా ఉంటూ సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తున్నారు. ప్రధానమంత్రి వ్యక్తి పూజ బ్రహ్మాండంగా వర్ధిల్లుతోంది– ప్రజల సొమ్ముతో సుమా! ఈ ఆరాధనా భావం మన ప్రజాస్వామ్య ప్రమాణాలను మరింతగా భ్రష్టుపరిచింది.

మన ప్రజాస్వామ్యం అంతకంతకూ మరింత లోపభూయిష్టమవుతోంది. మన లౌకికవాద, బహుళత్వవాద విలువలపై దాడులు తీవ్రమవుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌తో సంఘర్షణ సమయంలో అధికారప్రతినిధిగా ఒక ముస్లిం మహిళా సైనికాధికారిని నియమించడంలో ఉన్న ప్రతీకాత్మక విలువ, ఒక సీనియర్ బీజేపీ నాయకుడు ఆమెను అగౌరవపరుస్తూ చేసిన వ్యాఖ్యలతో, వ్యర్థమైపోయింది. ఇటీవలి సంవత్సరాలలో నోయిడా మీడియా, హిందుత్వవాదులు ఉధృతం చేసిన ముస్లిం వ్యతిరేక విష ప్రచారం రాబోయే నెలల్లో తగ్గిపోతుందో లేదో వేచి చూడవలసి ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడి దరిమిలా కశ్మీర్ లోయలో అనేక మందిని అకారణంగా అరెస్ట్ చేశారు. పలువురి గృహాలను బుల్డోజర్‌తో కూల్చివేశారు. కశ్మీరీలకు సంతోషప్రదమైన భవిష్యత్తును, అవి సూచిస్తున్నాయా?

పహల్గాం ఘటన, దాని పర్యవసానాల పట్ల అంతర్జాతీయ సమాజం ప్రతిస్పందనలు మనకు నేర్పుతున్నదేమిటి? భారత్‌ను పాకిస్థాన్‌తో జోడించి మాట్లాడేందుకు మళ్లీ జరుగుతున్న ప్రయత్నాలకు మనమెలా ప్రతిస్పందించాలి? నిరాలోచనపరుడు అయిన యుద్ధోన్మాది 'అర్బన్ నక్సల్స్'ను నిందిస్తాడు. బాధితుడి మనస్తత్వాన్ని ప్రదర్శిస్తాడు. ఆ తరువాత ఇండియా ఇప్పుడూ ఎప్పుడూ విశ్వగురుగా ఉండిపోతుందని ప్రకటిస్తాడు. ఆలోచనాశీలి అయిన దేశభక్తుడు ఆత్మపరిశీలన చేసుకోవడం ప్రారంభిస్తాడు. నిరంకుశ పాలనా ధోరణులు, మెజారిటేరియనిజం పెచ్చరిల్లిపోవడాన్ని గత దశాబ్దం చూసింది: ఇదే ఇండియాను పొరుగుదేశంతో పోల్చేందుకు పురిగొల్పుతోంది. కనుక మనం జాగ్రత్తగా ఆత్మపరీక్ష చేసుకోవాలి. మన రిపబ్లిక్ సంస్థాపక విలువలు అయిన ప్రజాస్వామ్యం, బహుళత్వ వాదంకు పునరంకితమయ్యేందుకు కాలం మించిపోయిందా అనే ప్రశ్న వేసుకోవాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఎవరికీ పట్టని మరో యుద్ధం!

కోర్టులు, చట్టాలు తమనేమీ చేయవన్న నమ్మకంతో ఆదివాసీలపైన, వారికి అండగా నిలుస్తున్న మావోయిస్టుల పైన భారత సైనిక బలగాలు జరిపిన హంతక చర్యకి వేదికగా నిలిచింది కర్రెగుట్ట. ఆదివాసీలకు తిండి అందకుండా చేశారు, షాపులను సంతలను బంద్ చేయించారు, పారామిలటరీ బలగాలు గ్రామాలకు గ్రామాలు దిగ్బంధించి కాల్పులు జరిపాయి. దండకారణ్య అదివాసీలకు, మధ్య భారతదేశానికి అసలు రాజ్యాంగం వర్తిస్తుందా? అటవీ ప్రాంతంలో ఖనిజ వనరులను బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టుతుంటే వ్యతిరేకించిన ప్రజలు దేశద్రోహులవుతున్నారు. ప్రభుత్వ పెద్దలే దేశద్రోహం తలపెడుతుంటే, అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్న నిజమైన దేశభక్తుల్ని సైన్యం చేత చంపించడాన్ని 'ఆపరేషన్ కగార్' అంటున్నారు. మనం యుద్ధం మధ్యలో ఉన్నాం. ఇది భారత్ పాకిస్థాన్ యుద్ధం కాదు. ఆదివాసీ ప్రాంతాల్లో సాగుతున్న ఈ యుద్ధాన్ని నివారించాలంటే మధ్యభారత ఆదివాసీలకు అండగా నిలుస్తున్న మావోయిస్టులు కోరుతున్న శాంతి చర్చలకు పూనుకొని ఆయా సమస్యలకు పరిష్కార మార్గాలు ఆలోచించాలి. అదివాసీలు ఎందుకు పోరాడుతున్నారో, వారు కోరుతున్నదేమిటో ప్రపంచానికి చెప్పగలిగే అవకాశం వారికి కలిగినప్పుడే పరిష్కారం సాధ్యమవుతుంది.

భారత సైనిక బలగాలు ఆదివాసీలను, మావోయిస్టులను ఎలా ఊచకోత కోశారో, హెలీకాప్టర్ల నుంచి అత్యాధునిక ఆయుధాలతో, బాంబు దాడులతో ఎలా ఏకపక్ష కాల్పులకు ఒడిగట్టారో చూశాం. 50 డిగ్రీల ఎండలో తీవ్రమైన వేసవి కాలంలో ఆకు ఎండిపోయి తుపాకీ తూటాలకు అడవి తగలబడి, ఆదివాసీల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే ఈ మారణహోమాన్ని ప్రశ్నించే, ఎదిరించే పరిస్థితే లేకుండా పోయింది. ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే కాదు ఏజెన్సీ ప్రాంతమంతా ఆదివాసీ ప్రజలను అస్థిరపర్చి, వారి పాదాల కింద ఖనిజ సంపదను దోచుకెళ్లడమే లక్ష్యంగా ఈ భీకర కాల్పులకు, దాడులకు పాలకులు పూనుకుంటున్నారు. 63 మంది అపర కుబేరుల్ని తయారు చేసిన 'న్యూ ఇండియా' నిర్మాణానికి ఆదివాసులను ఇలా నిరాశ్రయులుగా చేస్తూ దాన్ని 'కొలాటరల్ డేమేజ్' అంటున్నారు. ఎన్నికల్లో గెలవాలని ఆశించే పార్టీ ఏదీ కూడా ఈ ఎన్‌కౌంటర్ల పట్ల ఒక నైతిక వైఖరిని తీసుకోదు. ఇప్పుడు మనకు కావాల్సింది నిజాన్ని నిజం అని చెప్పడానికి సంసిద్ధమైనవాళ్లు, సాహసికులైన పాత్రికేయులు, న్యాయవాదులు, రచయితలు, కవులు.

– మెంతెన సంజీవరావు
తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కో కన్వీనర్

పోరుపాటల జలపాతం.. కలేకూరి

అరుదైన ప్రజాకవి కలేకూరి ప్రసాద్. వెలివాడలో రగిలే కన్నీటి మంటల నిప్పురవ్వలతో వర్తమాన సాహిత్యాన్ని వెలిగించి, అంటరాని బతుకుల్లో పిడికెడు ఆత్మగౌరవాన్ని ప్రసరించిన సాంస్కృతిక సమరయోధుడు ఆయన. "నేను జనసమూహాల గాయాన్ని/ గాయాల సమూహాన్ని" అంటూ తన సృజన నైజాన్ని ప్రకటించి దళిత, బహుజన, ఆదివాసీ సమూహాల గాయాలకు గొంతునిచ్చి మూడు దశాబ్దాల పాటు పీడిత ప్రజావాణిని వినిపించిన కవన పిల్లనగ్రోవి కలేకూరి. అందుకే గాయాలనే స్వర మాతృకలుగా మార్చుకొని విప్లవ, దళితోద్యమాల దారిలో పెను చేతనా ప్రవాహమై, పోరుపాటల జలపాతమై ప్రతిధ్వనించాడు. అధికార పీఠాలకు, అధినాయకత్వానికి శాశ్వత ప్రతిపక్షంగా రచయిత వ్యవహరించాలని చెప్పిన కలేకూరి, అత్యంత ప్రభావశీలమైన, స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని సృష్టించాడు. పాత్రికేయునిగా, కవిగా, విమర్శకునిగా, అనువాదకునిగా కలేకూరి నిశితమైన దార్శనిక దృష్టితో ఈనాటి అస్తిత్వ ఉద్యమాల విస్తృతికి, తదనుగుణమైన సాహిత్యపరిపుష్టికి 'వెన్నుదన్ను'గా నిలిచాడు.



యువక, శబరి, నవత, కవన తదితర కలం పేర్లతో ప్రసిద్ధమైన కలేకూరి దేవవర ప్రసాద్... లలితా సరోజినీ, శ్రీనివాసరావు దంపతులకు 1962 అక్టోబర్ 25న కృష్ణా జిల్లా కంచికచర్లలో జన్మించాడు. డిగ్రీ చదువుతున్నప్పుడే రాడికల్ విద్యార్థి సంఘ రాజకీయాల వైపు ఆకర్షితుడై కొంతకాలం ప్రజాయుద్ధ తీరాల్లో సంచరించాడు. విప్లవోద్యమ కార్యకలాపాలకు అరుణోత్తేజంతో అంకితమయ్యాడు. కారంచేడు, చుండూరు సంఘటనల నేపథ్యంలో కలేకూరి ప్రస్థానం గుణాత్మకమైన మలుపు తిరిగింది. 'దళిత మహాసభ' రగిలించిన ఆత్మగౌరవ పోరాటాన్ని అందిపుచ్చుకొని అణగారిన జీవితపు సన్నని సందుల్లోకి చొచ్చుకొని పోయాడు. త్వరత్వరగా రాయాల్సింది రాసి, సత్వరం చేయాల్సింది చేసి 2013, మే 17న సెలవంటూ వెళ్లిపోయాడు. విప్లవోద్యమ నేపథ్యం, విప్లవ సాహిత్యభావజాల వెలుగుల్లో కలేకూరి ప్రజాసాహిత్యం దిశగా చూపు సారించాడు. 'యువక' పేరుతో ఆయన రాసిన పాటలు అనేక ప్రజాస్వామ్య పోరాటాలకు సాంస్కృతిక సామర్థ్యాన్ని అందించాయి. 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా!', 'భూమికి పచ్చని రంగేసినట్టు', 'కుమిలిపోయినా నలిగిపోయినా', 'పల్లెపల్లెనా దళిత కోయిల', 'దళితాకాశపు ధ్రువతార' లాంటి హృద్యమైన పాటల ద్వారా కలేకూరి సాహిత్య, సాంస్కృతిక రంగాలపై చెరగని ముద్ర వేశాడు. కారంచేడు మారణకాండ నేపథ్యంలో తన మిత్రులతో కలిసి కలేకూరి రాసిన ఒగ్గుకథ ఈ ఉద్యమానికి ఎంతో ఉత్తేజాన్ని అందించింది.

'పిడికెడు ఆత్మగౌరవం' నుండి 'అతడొక నిబద్ధ వజ్రాక్షరం' వరకు కలేకూరి రాసిన కవితలు ఉన్నతమైనవి. అనువాదకునిగా ప్రసాద్ చారిత్రాత్మకమైన కృషి చేశాడు. అపారమైన భాషా పాండిత్యంతో, మేధోశక్తితో అనేక గ్రంథాలు తెలుగులోకి తర్జుమా చేసి అనువాదకునిగా తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నాడు. మాదిగ దండోరా ఉద్యమానికి సంఘీభావం తెలియజేసి, నాయకుల్లోని మాల వ్యతిరేక ధోరణుల్ని నిర్మొహమాటంగా విమర్శించాడు. 'నీది ధర్మపోరాటం/ నీ రణక్షేత్రానికి నా శ్వాస కాపలాగా పెడుతున్నానని' తెలంగాణ ప్రజల చేతిలో చేయి వేసి బాస చేశాడు. ఫాసిజానికి వ్యతిరేకంగా బలమైన రాజకీయ, సాంస్కృతిక ఉద్యమం నిర్మించాలని కలేకూరి కన్న కలని సాకారం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

– డాక్టర్ కోయి కోటేశ్వరరావు

(నేడు కలేకూరి ప్రసాద్ వర్ధంతి)

కోయ వీరగాథాచక్రం ప్రదర్శన.. డాక్యుమెంటేషన్

ఆధునిక మానవుడు అలనాటి ఆదివాసీ వారసుడు. ఏ జాతిలోనైనా ఆ జీవకణజాలం అక్కడ నుండే నేటి వరకు ప్రవహిస్తుంది. కానీ ఆర్థిక-రాజకీయ పరిణామాలు, నగరీకరణ, సాంకేతికాభివృద్ధి వారిని దూరం కొట్టింది. ఆ మూలాల నుండి ఎదిగిన, దూరమైన వాళ్లు వారిని అవమానపరిచారు. వారి జ్ఞానం, సంగీతం, కళలు, సంస్కృతి, భాష వంటి వాటిని పరాయీకరించి వారిని మరింత దూరం చేసుకున్నాం. అలాంటి ఆదివాసీ జాతులలో కోయలు ఒకరు. మధ్యభారతంలో, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో గల వివిధ తెగలు, ఉపతెగలు ఇప్పటికీ ప్రతికూల పరిస్థితులకి ఎదురొడ్డి జీవనపోరాటం చేస్తున్నాయి. వారిని ఉపయోగించుకోవడం పెరిగిపోయింది. వారికి ఏ మేరకు ఉపయోగపడ్డామో పరిశీలన చేసుకోవలసి ఉంది.

ఈ సంఘర్షణలో ఆయా తెగల మధ్య అవగాహన పెరగాలి. రాజకీయ, సాంస్కృతిక వైరుధ్యాలను తగ్గించాలి. ముందుగా మనం వారి స్థానికత, ఆచార వ్యవహారాలు, చరిత్ర, భాష, సాంస్కృతిక జీవనం అర్థం చేసుకోవాలి. వీటికి మూలమైన ఆధారాలను సేకరించుకోవాలి. వీటి ఆమూకీని లోతుగా పరిశోధించాలి. వాటిని గ్రంథస్థం చేయాలి. అందుకు అనేక అధ్యయన బృందాలు ఏర్పడాలి.

కోయతెగ వీరవనితలు సమ్మక్క, సారక్కల గురించి కొంత మాత్రమే తెలుసు. వారి సమగ్ర చరిత్ర నిర్మాణం జరగాలి. అందుకే వీరి సమకాలీనుల పోరుచరిత్ర తవ్వితీయాలి. వీరితో పాటుగా ఆ పోరాటంలో మరణించిన వీరులు గుడి కామరాజు, జంపన్న, నాగులమ్మ, ముసలమ్మ, బ్రాహ్మణమ్మ, వెంకటపతిరాజు వంటివాళ్ల వీరగాథల్ని డోలీలు ఈనాటికీ గానం చేస్తున్నారు. తలపతులు ఈ వీరుల చరిత్రని, సంకేతరూపాలను జాగ్రత్తపరుస్తున్నారు. వారి వద్ద డాలుగుడ్డలు, పగిడెలు, కోయపటాలు, వేల్పుగుడ్డలు ఉన్నాయి. వీటిని ప్రదర్శిస్తూ వీరిని గాథల్లో కీర్తించే సంప్రదాయం ఇంకా సజీవం. అయితే కొత్తతరం డోలీగాయకులు తయారుకాకపోవడం వల్ల ఈ గాన సంప్రదాయం చివరి దశకు చేరుకుంది. ముందుగా వీటిని సేకరించడానికి 'కోయభాష, సంస్కృతి అధ్యయన వేదిక' లోగడ సమ్మక-సారక్కల గాథని సేకరించింది.

ప్రస్తుతం బ్రాహ్మణమ్మ, వెంకటపతి రాజుల గాథల్ని ఈ నెల 18న ఉదయం పది గంటల నుంచి భద్రాచలం ఐటీడీఏలో ఆడియో, వీడియో డాక్యుమెంటేషన్ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి సంబంధిత తలపతులు, డోలీలు, కోయపెద్దలు హాజరవుతారు.

– జయధీర్ తిరుమలరావు
పద్దం అనసూయ
ప్రొ. జి. మనోజ



అందాలలో అహో.. మహోదయం

ఎకో పార్కులో సుందరాంగుల సందడి

రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలంలోని ఎక్స్‌పీరియం ఎకో పార్కు అందాల భామలతో మరింత అందంగా మారింది. వివిధ దేశాల నుంచి వచ్చిన సుందరాంగులతో ఆ ప్రాంతం పులకరించిపోయింది. మిస్ వరల్డ్-2025 పోటీల నిమిత్తం మహా నగరానికి విచ్చేసిన వీరంతా హెరిటేజ్ వాక్‌లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఎకో పార్కును సందర్శించారు. వీరికి డోలు వాయిద్యాలతో పర్యాటక శాఖ ఘన స్వాగతం పలికింది. డోలు చప్పుళ్లకు అందగత్తెలు నృత్యం చేశారు. పార్కులోని విభిన్న ప్రాంతాల్లో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అక్కడి ప్రదేశాలను చూసి వావ్ అంటూ మురిసిపోయారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



తక్కువ కమీషన్‌కు డబ్బు పేరుతో

రూ.2లక్షలు కాజేసిన టెకీ

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): తక్కువ కమీషన్ తీసుకొని క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు ఇస్తానని మోసం చేసిన వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైం అధికారులు అరెస్ట్ చేశారు. అదిలాబాద్ జిల్లా తాళ్లపల్లికి చెందిన ముత్తినేని రాజశేఖర్ (26) ఐటీ ఉద్యోగి. ఇతడు సాంబశివ ఆన్‌లైన్ సర్వీసెస్ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నానని సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకున్నాడు. క్రెడిట్ కార్డు నుంచి డబ్బు ఇచ్చేందుకు కేవలం 1.8 శాతం మాత్రమే చార్జీలు తీసుకుంటానని ప్రచారం చేసుకున్నాడు. నవిన్మన నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి ఇతడిని సంప్రదించాడు. రాజశేఖర్‌కు, క్రెడిట్ కార్డు వివరాలు, సీవీవీ, ఓటీపీలు చెప్పాడు. ఈ వివరాలతో రాజశేఖర్ రెండుసార్లు క్రెడిట్ కార్డు నుంచి రూ.1.99 లక్షలు విత్‌డ్రా చేసుకున్న తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు రాజశేఖర్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు.

ఖాళీ స్థలాలకూ ఇంటి నంబర్లు

బల్దియా ఖజానాకు రూ.కోట్లలో గండి

- చందానగర్ సర్కిల్‌లో గుర్తింపు
- రెండు చోట్ల రూ.1.04 లక్షల నష్టం
- డీసీ, ఏఎంసీ, టీఐ, బీసీలకు షోకాజ్ నోటీసు
- త్వరలో వారిపై శాఖాపరమైన చర్యలు
- ఇతర సర్కిళ్లలోనూ అదే పరిస్థితి
- సమగ్ర విచారణకు ఉన్నతాధికారుల నిర్ణయం



హైదరాబాద్ సిటీ/చందానగర్, మే 16 (ఆంధ్రజ్యోతి):

చందానగర్ సర్కిల్ పరిధిలోని మదీనాగూడలో రెండు చోట్ల ఖాళీ స్థలాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించారు. ఈ విషయంపై డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ (డీఎంసీ) మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ (ఏఎంసీ) కృష్ణ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బిల్ కలెక్టర్ బాబ్జీలకు తాజాగా అదనపు కమిషనర్ (రెవెన్యూ) షోకాజ్ నోటీసులిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేసినందుకు మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే భవనాలు నిర్మించి పన్ను చెల్లిస్తున్నా, వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) చెల్లింపునకు డిమాండ్ నోటీసులు పంపిస్తున్నారు. బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లను సంప్రదిస్తే వీఎల్‌టీ తొలగించాలంటే ఖర్చవుతుందని పౌరులతో చెబుతున్నట్టు కేంద్ర కార్యాలయ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

సంస్కరణలు తీసుకువచ్చినా, ఆన్‌లైన్ విధానం అమలులోకి తెచ్చినా, గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు ఆగడం లేదు. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు, ఇప్పటికే మదింపు జరిగిన భవనాలకు తక్కువ పన్ను నిర్ధారిస్తూ కొత్త ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ల (పీటీఐఎన్) కేటాయింపు వంటివి నిత్యకృత్యంగా మారాయి. కొందరు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల అక్రమాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. తద్వారా బల్దియా ఖజానాకు రూ.కోట్లలో గండి పడుతోంది. ఇందులో సర్కిల్ స్థాయిలోని ఉన్నతాధికారుల హస్తమూ ఉంటుండడం గమనార్హం. మదీనాగూడలో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా.. రెండు స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించి పన్ను మదింపు చేశారు. వాస్తవంగా ఖాళీ స్థలాలకు సబ్ రిజిస్ట్రార్ విలువ (డాక్యుమెంట్ ప్రకారం)లో .50 శాతం (ఒకటో వంతులో సగం) ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ)గా నిర్ధారిస్తారు. మదీనాగూడలో ఓ స్థలానికి వీఎల్‌టీ రూ.122408 కాగా, రూ.35,904 ఆస్తిపన్నుగా, మరో స్థలానికి వీఎల్‌టీ రూ.28,836 కాగా, రూ.11616గా ఆస్తిపన్నుగా మదింపు చేసి పీటీఐఎన్ కేటాయించారు. ఈ రెండు ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ కాకుండా ఆస్తిపన్ను కేటగిరీలో మదింపు చేయడం వల్ల సంస్థకు రూ.1.04 లక్షల మేర నష్టం జరిగింది. రెండు స్థలాలకు సంబంధించి సరైన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు కూడా లేవని అధికారుల పరిశీలనలో

మిగతా 6వ పేజీలో..

లాభాల ఆశ చూపి

రూ.15.20 లక్షలు కాజేశారు!



హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): స్టాక్ ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చేలా చేస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.15.20 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి (46)ని వాట్సప్ ద్వారా కొందరు సంప్రదించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. తాము సెబీ ద్వారా అనుమతులు పొందిన "ఐసీఐసీఐ సెక్యూరిటీస్" సంస్థ ప్రతినిధులమని చెబుతూ స్టాక్ ట్రేడింగ్‌పై

మిగతా 6వ పేజీలో..



ప్రభుత్వ భూమికి ఎమ్మెల్యే పేరుతో ఏర్పాటు చేసిన కాలనీ బోర్డు

ప్రభుత్వ భూమిలో

ప్రైవేటు లే అవుట్!

- 100 గజాలు రూ.3 లక్షల చొప్పున విక్రయాలు
- అధికార పార్టీ తాజా మాజీ ప్రజాప్రతినిధి నిర్వాకం
- చూసీ చూడనట్లు వదిలేస్తున్న రెవెన్యూ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 16(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామ పరిధి సర్వే నంబర్ 10/95లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. ఆ గ్రామానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధి సుమారు రూ.10 కోట్ల విలువైన ఎకరా ప్రభుత్వ భూమిలో లేఅవుట్ వేశారు. 100 గజాల చొప్పున ప్లాట్లు చేసి అమాయకులకు విక్రయిస్తున్నారు. ఒక్కో ప్లాటుకు సుమారు రూ.3 లక్షలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే పేరుతో కాలనీ బోర్డు ఏర్పాటు చేసి మరీ విక్రయాలు చేపడుతున్నారు. బహిరంగంగానే ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అధికారం అండతో..

మండల పరిధిలోని బాటసింగారం రెవెన్యూ పరిధిలోని కొత్తగూడెం పండ్ల మార్కెట్‌కు అనుకుని సర్వే నంబర్ 10/95లో ప్రభుత్వ భూమి ఉన్నది. ఇప్పటికే సర్వే నంబర్ 10లోని భూమిని ప్రభుత్వం పీఓటీ యాక్ట్ ద్వారా స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఆ సర్వే నంబర్‌లోని భూమి ప్రభుత్వ ఆధీనంలోని ఉన్నది. ఇటీవల బాటసింగారం గ్రామానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధి గతంలో అదే గ్రామానికి చెందిన అసైన్డ్ పట్టాదారుడి వద్ద సుమారు ఎకరా భూమిని రూ. 25 లక్షలకు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేశాడు. ఆ ప్రభుత్వ భూమిలో లేఅవుట్ చేశాడు. రెవెన్యూ అధికారులకు అనుమానం రాకుండా కేవలం పేపర్‌పై లేఅవుట్ చేసి అమాయక ప్రజలను నవిమ్మిస్తున్నాడు. 100 గజాలకు రూ.3 లక్షల చొప్పున వసూళ్లు చేసినట్లు

మిగతా 6వ పేజీలో..

వెళ్తున్న కారులో మంటలు

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- మైండ్‌స్పేస్ రూట్‌లో భారీగా ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్ మధ్యలో మంటలు చెలరేగిన కారు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లో వెళ్తున్న కారు ఇంజన్లో మంటలు అంటుకొని ముందు భాగం కాలిపోయింది. కారు నడిపిన వ్యక్తి వెంటనే దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్ టవర్ నుంచి బయో డైవర్సిటీ వైపు వెళ్తున్న కారు రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మైండ్ స్పేస్ ఎంట్రీ వద్దకు రాగానే ఇంజన్లో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. కారు నడుపుతున్న వ్యక్తి వెంటనే బయటకు దిగాడు. మాదాపూర్ ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కారు సగం వరకు కాలిపోయింది. ఈ అగ్ని ప్రమాదం కారణంగా సైబర్ టవర్ నుంచి మైండ్ స్పేస్ రూట్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు కారును పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న రంగనాథ్

మూసీకి ఎంఎఫ్ఎల్ నిర్ధారించాలి

- నాలాల వ్యవస్థనూ మెరుగుపర్చాలి
- హైడ్రా సదస్సులో నిపుణులు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుదలపై హైడ్రా దృష్టి సారించింది. మూసీ నది సరిహద్దుల నిర్ధారణ, ఔటర్ రింగ్ రోడ్డు లోపల నాలాల విస్తరణపై సదస్సు నిర్వహించింది. సదస్సులో పాల్గొన్న నిపుణులు ఆయా అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. చెరువుల పూర్తి నీటి నిల్వ స్థాయి (ఎఫ్‌టీఎల్) గుర్తింపు తరహాలోనూ మూసీ గరిష్ఠ వరద ప్రవాహ స్థాయి (ఎంఎఫ్ఎల్) నిర్ధారించాలని పలువురు పేర్కొన్నారు. ఇందుకు గ్రామ, రెవెన్యూ రికార్డులను పరిశీలించడంతో పాటు నది పరిసర ప్రాంతాల్లోని హైడ్రాలజీ నివేదికలు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) చిత్రాలు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులనూ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నాలాల విస్తరణకూ ప్రాధాన్యత ఇవ్వాలని, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 940 ప్రాంతాల్లో ఉన్న కల్వర్టుల వద్ద చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలన్నారు. నాలాల వ్యవస్థపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో హైడ్రాకు సంబంధం లేదని, వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుదల, ఆక్రమణల నియంత్రణకే నదికి హద్దుల గుర్తింపుపై దృష్టి సారించినట్టు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. రెవెన్యూ, సర్వే ఆఫ్ ఇండియా, నీటి పారుదల, హైడ్రాలజీ, ఎస్ఎన్‌డీపీ, ఎన్ఆర్ఎస్‌సీ, జీహెచ్‌ఎంసీ, ఎంఆర్‌డీసీఎల్ విభాగాలతోపాటు, పలువురు నిపుణులు పాల్గొన్నారు.

రక్తపోటు.. అవయవాలకు చేటు

6

నేడు ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవం



సున్నం చెరువుకు మహర్దశ

హైడ్రా నేతృత్వంలో రూ.10కోట్లతో అభివృద్ధి

లేక్ చుట్టూ వాకింగ్ ట్రాక్

6





సమావేశంలో మాట్లాడుతున్న కర్ణన్

వర్షాలు.. ముందు జాగ్రత్తలు!

- మాన్‌సూన్‌లో సమస్యలపై సమీక్ష
- సంయుక్తంగా పని చేయాలని కర్ణన్ సూచన

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ముందస్తు వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో పనిచేసే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ) 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో వర్షాకాల ముందస్తు ఏర్పాట్లపై ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీసులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వానాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. మొబైల్ రెస్పాన్స్ టీమ్‌ల వాహనాలకు జీహెచ్‌ఎంసీ లోగోతో సైనేజీ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆయా బృందాల ఫోన్ నెంబర్లను స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ల (పోలీస్)కు ఇవ్వాలన్నారు. వరద నీరు నిలిచే ప్రాంతాలను అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ఏసీపీ), జోనల్ కమిషనర్లు సంయుక్తంగా పరిశీలించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధి దీపాల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని, ఈ విభాగానికి ప్రత్యేకంగా వేణుగోపాల్‌రెడ్డిని అదనపు కమిషనర్‌గా నియమించినట్టు చెప్పారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ తవ్విన రహదారుల పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని, లేని పక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. సిగ్నళ్ల వద్ద బ్యాకప్ బ్యాటరీలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు.

మానసిక చికిత్సాలయం నుంచి

నిత్యం రోగులు మాయం

ఓపీ, ఓపెన్ వార్డు నుంచి పారిపోతున్న వైనం

కట్టుదిట్టంగా లేని రక్షణ వ్యవస్థ



6

రైల్వే ఉద్యోగుల ఆపరేషన్

సిందూర్ ఫ్లాగ్ మార్చ్



తిరంగా ర్యాలీ సందర్భంగా

ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): తిరంగా ర్యాలీ సందర్భంగా శనివారం ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ ఓ ప్రకటనలో తెలిపారు. ర్యాలీ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం, లిబర్టీ, అప్పర్ ట్యాంక్‌బండ్, సెయిలింగ్ క్లబ్, డీబీఆర్ మిల్స్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేయడం లేదా దారి మళ్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ చిల్డ్రన్ పార్కు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సాయంత్ర 5.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు.

సమాచార శాఖ కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ల నియామకంలో బీసీ రిజర్వేషన్ ఎందుకు అమలు చేయలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య శుక్రవారం లేఖ రాశారు. చీఫ్ కమిషనర్‌తోసహా ఆరుగురు కమిషనర్లను నియమిస్తే వీరిలో ఒక్కరు కూడా బీసీ వ్యక్తి లేరన్నారు. అన్ని శాఖల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు వందశాతం అమలు చేయాలని సీఎంకు రాసిన లేఖలో కృష్ణయ్య కోరారు.

మానసిక చికిత్సాలయం నుంచి
నిత్యం రోగులు అదృశ్యం

● ఓపీ, ఓపెన్ వార్డు నుంచి పారిపోతున్న వైనం ● కట్టుదిట్టంగా లేని రక్షణ వ్యవస్థ

- పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆడెపు తిరుపతి (30) మానసికస్థితి రెండేళ్లుగా బాగా లేదు. కుటుంబ సభ్యులు ఈనెల 10న ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయానికి తీసుకొచ్చారు. వైద్యులు అతడి పరిస్థితిని చూసి అడ్మిట్ చేసుకున్నారు. తిరుపతికి సహాయకురాలిగా తల్లి ఉంటోంది. ఆమె అదేరోజు సాయంత్రం తాగునీటి కోసం బయటకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి కుమారుడు కనిపించకపోవడంతో బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- గతంలో ఓ మానసిక రోగి ఎర్రగడ్డ రోడ్డుపై హల్‌చల్ చేశాడు. దారిన వెళ్తున్న ప్రయాణికులను ఇబ్బంది పెట్టడంతో కొంతమంది పరుగులు తీశారు.

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి నుంచి రోగులు పారిపోవడం నిత్యం జరుగుతోంది. ప్రతీనెలా ఇద్దరు, ముగ్గురు రోగులు తప్పించుకోవడం మామూలైపోయింది. రోగులు ఆస్పత్రి నుంచి తప్పించుకుపోతుంటే ఆ తప్పిదం తమది కాదని, కుటుంబ సభ్యులదే బాధ్యత అని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి. గతంలో ఒకేసారి 12 మంది ఖైదీ రోగులు పారిపోయారు. తర్వాత మరో ఖైదీ పారిపోయాడు. రోగులు పారిపోతున్నా భద్రతను కట్టుదిట్టం చేయడం లేదు.



ఆ వార్డు నుంచే..

పురుషుల వార్డులో 150 పడకలు, మహిళ, క్లోజ్ వార్డులో 50, ఓపెన్ వార్డులో మరో 100 పడకలున్నాయి. ఓపెన్ వార్డు నుంచి రోగులు ఎక్కువగా పారిపోతున్నారు. ఈ వార్డులోని రోగుల బాధ్యతను ఆస్పత్రి వర్గాలు పట్టించుకోవు. రోగులకు సహాయకులుగా ఉండే కుటుంబ సభ్యులు మందులు, భోజనం కోసం బయటకు వెళ్లినప్పుడు రోగులు అదృశ్యమవుతున్నారు. ఓపెన్ వార్డు, ఓపీ విభాగం నుంచి తప్పించుకుంటున్న వారిలో ఏడాదికి 60 మంది వరకు ఉంటున్నారు. ప్రిజనర్ వార్డు నుంచి కూడా ఖైదీలు తప్పించుకుంటున్నారు. మానసిక చికిత్సాలయంలో రక్షణ వ్యవస్థ కట్టుదిట్టంగా లేదు. రోగులు పారిపోవడానికి అనేక మార్గాలున్నాయి. దీనిపై ఆస్పత్రి అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదు.



సిక్కిం రాష్ట్ర దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఈశాన్యాన మెరిసే రత్నం సిక్కిం : గవర్నర్

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): సిక్కిం రాష్ట్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ సిక్కిం ప్రజల వైవిధ్యమైన సంస్కృతి, చరిత్ర అరుదైనదని, ఈశాన్య దేశంలో సిక్కిం మెరిసే రత్నం లాంటిదని పేర్కొన్నారు. సిక్కింలోని జీవ వైవిధ్యం జాతికి గర్వకారణమని, తెలంగాణ, సిక్కిం మధ్య సాంస్కృతిక బంధాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన సైనికులకు, పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పౌరులకు నివాళిగా ఒక నిమిషం మౌనం పాటించారు. నగరంలో నివసిస్తున్న సిక్కిం ప్రజలు, గవర్నర్ ప్రధాన కార్యదర్శి దానకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రభుత్వాలు ద్రోహం

రాంనగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన కళాకారులకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ద్రోహం చేశాయని మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయ ఆరోపించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూపతి వెంకటేశ్వర్లు, మురళీధర్‌దేశ్‌పాండే అధ్యక్షతన తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం - రాష్ట్ర సమాలోచన సదస్సు జరిగింది. సదస్సులో వక్తలు మాట్లాడుతూ కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కళాకారులను వాడుకుంటున్నాయి తప్ప వారికి చేయూతనీయడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో జానపద పరిశోధకుడు జయధీర్ తిరుమలరావు, కళల విశ్లేషకుడు అంబటి సురేంద్రరాజు, ప్రముఖ రచయిత్రి విమల, దర్శకుడు చంద్రశేఖర్, నటుడు శ్రీనివాస్, ప్రజానాట్య మండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జయధీర్ తిరుమలరావు, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయ తదితరులు



సికింద్రాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులు

రైల్వే ఉద్యోగుల ఆపరేషన్ సిందూర్ ఫ్లాగ్ మార్చ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా సికింద్రాబాద్ రైల్ నిలయం నుంచి సంగీత్ చౌరస్తా వరకు రైల్వే ఉద్యోగులు ఆపరేషన్ సిందూర్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ ఫ్లాగ్ మార్చ్ దేశంపట్ల మన నిబద్ధతను చాటి చెబుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్, డిప్యూటీ జీఎం ఉదయనాథ్ కోట్ల, రైల్వే డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ రావత్, ఆర్పీఎఫ్ పోలీసులు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'గాంధీ'ని సందర్శించిన ఆయుష్మాన్ భారత్ బృందం



గాంధీ ఆస్పత్రిని సందర్శించిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ బృందం సభ్యులు

అడ్డగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): సర్కారు ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ బృందం తెలిపింది. శుక్రవారం సంస్థ ప్రతినిధులు గాంధీ ఆస్పత్రిని సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లే ఓపీ రోగులు ఆయుష్మాన్ భారత్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. గాంధీ ఆస్పత్రిలో ఓపీ విభాగం, మదర్ చైల్డ్ ఆస్పత్రి (ఎంసీహెచ్) భవనంలో గర్భిణిలకు చీటీకి బదులు ఆయుష్మాన్ భారత్ యాప్ ద్వారా టోకెన్ తీసుకునే పద్ధతి ఉందని ఆర్ఎంఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వారికి తెలియజేశారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి. ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రి, జాతీయస్థాయి మెడికల్ బృందం సభ్యులు, వైద్యులు పంకజ్, అరోరా, సౌరబ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అహల్యబాయి సేవలు ప్రజలకు వివరించాలి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ సమాజంలో అహల్యబాయి హోల్కర్‌కు ప్రత్యేక స్థానం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అహల్యబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఆమె సేవలను, జీవితాన్ని ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ నేతలు చంద్రశేఖర్, శివప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమత తదితరులు పాల్గొన్నారు.

వేదవల్లి కుటుంబానికి సాయం

సీఎంఆర్ఎఫ్ కింద రూ.7 లక్షలు అందజేత

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడి చనిపోయిన చిన్నారి వేదవల్లి కుటుంబానికి సర్కారు అండగా నిలిచింది. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ కింద ఆ కుటుంబానికి అధికారులు రూ.7 లక్షలు అందజేశారు. ఎల్‌బీనగర్‌లో నివసిస్తున్న రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దపాప వేదవల్లి(5) బ్లడ్ క్యాన్సర్ బారినపడింది. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా చికిత్సకు రూ.8 లక్షలు ఎల్ఓసీ మంజూరు చేశారు. గతంలో చేసిన వ్యయానికి సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దీంతో రూ. 7 లక్షల చెక్కును వేదవల్లి తండ్రి రఘుకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు సచివాలయంలో అందజేశారు. రఘు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

విక్రమరావు జీవితం పాత్రికేయులకు ఆదర్శం

సంతాప సభలో వక్తలు

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ జర్నలిస్టుల ఉద్యమ నాయకుడు, సీనియర్ పాత్రికేయుడు కోటంరాజు విక్రమరావు మృతి జర్నలిస్టుల ఉద్యమానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన జీవితం పాత్రికేయులకు ఆదర్శమన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయగానసభలో విక్రమరావు సంతాపసభ జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్, ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుకుల ఆనందం, సీనియర్ పాత్రికేయుడు గౌరీశంకర్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రామ్‌చందర్, బండి విజయ్‌కుమార్, రఘు, కార్యదర్శి తస్నీరు శ్రీనివాస్ తదితరులు విక్రమ్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో ఢిల్లీలో ఏర్పడిన ఐఎఫ్‌డబ్ల్యూజే వ్యవస్థాపకుల్లో విక్రమరావు కీలకపాత్ర పోషించారని, దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల్లో యూనియన్‌ను విస్తరించి జర్నలిస్టుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపించారని తెలిపారు. ఆయన ఈ తరం జర్నలిస్టులకు మార్గదర్శకులన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విక్రమరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌డబ్ల్యూజే, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

ప్రభుత్వ భూమిలో ప్రైవేటు లే అవుట్!

(5వ పేజీ తరువాయి)

స్థానిక నాయకులు, ప్రజలు పేర్కొన్నారు.

మోసపోతున్న అమాయకులు

తక్కువ ధరకే ప్లాటు వస్తుందని ఇళ్లు లేని పేదలు అతడి మాట నమ్మి మోసపోతున్నారు. ప్రభుత్వ భూమిలో ప్లాట్లు కొన్న వారికి అనుమానం రాకుండా ఆ స్థలంలో ముందుగా ఆలయ నిర్మాణానికి నియోజకవర్గం ప్రజాప్రతినిధితో భూమి పూజ చేయించడం విశేషం. ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని మాజీ ప్రజా ప్రతినిధి నమ్మిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే 30 మంది అమాయకులకు ప్లాట్లు విక్రయించి సుమారు కోటి వసూలు చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆ భూమిలో నిర్మాణాలు లేకున్నా స్థానిక ఎమ్మెల్యే పేరుతో కాలనీ బోర్డు ఏర్పాటు చేయడం ఆశ్చర్యం కలిగించే విషయం.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బాటసింగారం రెవెన్యూ పరిధి కొత్తగూడెం సర్వే నంబర్ 10 ప్రభుత్వ భూమిలో నూతన ఆలయ నిర్మాణానికి అనుమతులు లేన్నారు. సదరు భూమిని సర్వే చేసి ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

ఐటీ కారిడార్‌లో రోడ్డు భద్రతపై అవగాహన

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించాయి. నానక్‌రాంగూడ సర్కిల్‌లో నిర్వహించిన ర్యాలీని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఎండీ, సీఈఓ క్యాస్పరస్ జె.హెచ్ క్రోమ్‌హౌట్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సీఈఓ నవేద్ అలంఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌లు అందజేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ అజిత్ బెనర్జీ, సలహాదారు రవికుమార్, గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఎండీ, సీఈఓ క్యాస్పరస్, ఏసీపీ తదితరులు

ఖాళీ స్థలాలకూ ఇంటి నంబర్లు

(5వ పేజీ తరువాయి)

తేలింది. దీంతో బాధ్యులైన అధికారులు, సిబ్బందికి 48 గంటల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంటు తాజాగా అదనపు కమిషనర్(రెవెన్యూ) షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వారు వివరణ కూడా సమర్పించినట్లు తెలిసింది. పరిశీలన అనంతరం చర్యలు తీసుకుంటారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

పాత ఆస్తులకు కొత్త పీటీఐఎన్‌లు

జీహెచ్ఎంసీలో 18.60 లక్షల పీటీఐఎన్‌లు ఉన్నాయి. ఇందులో ఏటా పన్ను చెల్లిస్తోన్న వారు 14 లక్షలు మంది మాత్రమే. మరో నాలుగు లక్షలకుపైగా పీటీఐఎన్‌లలో కూల్చివేసిన భవనాలు, ఒకే ఆస్తికి రెండు పీటీఐఎన్‌లు కేటాయించినవి కూడా ఉన్నాయి. కొందరు బిల్ కలెక్టర్లు పాత భవనాల పన్ను తగ్గిస్తామంటూ యజమానులతో బేరం కుదుర్చుకొని, ఆ ఆస్తులకు కొత్త పీటీఐఎన్ కేటాయిస్తున్నారు. ఖైరతాబాద్, బంజారాహిల్స్, గోషామహల్, ముషీరాబాద్, చందానగర్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలో ఈ తరహా అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. ఖాళీ స్థలాలకూ ఇంటి నంబర్ల కేటాయింపు యథేచ్ఛగా జరుగుతోంది.

వేర్వేరు ప్రాంతాల్లో 3.420 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు వ్యక్తుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 3.420 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరికి చెందిన రాజ్‌పాక సతీష్ ఉప్పల్‌లో నివసిస్తూ ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నాడు. సైడ్ బిజినెస్‌గా గంజాయి విక్రయిస్తున్నాడు. శుక్రవారం ఆదర్శ్‌నగర్ పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 1.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై ఇప్పటికే రెండు కేసులున్నాయి. మరో కేసులో వనస్థలిపురంలో గంజాయి విక్రయిస్తున్న ముత్యాల తిరుమలేష్‌ను రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాష్‌చందర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం బొంగులూరు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న చింతపల్లి వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 320 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మహిళలతో కాళ్లు కడిగించడం అవమానకరం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళలతో అందాల పోటీల్లో పాల్గొంటున్న విదేశీ మహిళల కాళ్లు కడిగించడం అవమానకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్ పర్యటనకు వెళ్లిన అందాల పోటీల్లో పాల్గొంటున్న వారి కోసం స్థానిక చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టడం, పరిసర ప్రాంతాల్లో గుడిసెలను ధ్వంసం చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తెలంగాణ మహిళలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించిన వారిపై విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

విదేశీ బాలుడికి అరుదైన సర్జరీ

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల విదేశీ బాలుడికి మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అరుదైన బ్రెయిన్ స్టెమ్ ట్యూమర్ శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పరిగి వివరాలు వెల్లడించారు. బాలుడి మెదడు స్టెమ్ ప్రాంతంలో కణితి ఉన్నట్లు గుర్తించామని, సర్జరీ చేసి తొలగించామన్నారు.

లాభాలు ఆశ చూపి రూ.15.20 లక్షలు కాజేశారు!

(5వ పేజీ తరువాయి)

సలహాలు, సూచనలు అందించారు. ముందుగా రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టించి లాభాలు చూపించారు. నమ్మకం కలిగిన ఉద్యోగి పలు దఫాలుగా రూ.15.20 లక్షలు పెట్టుబడి పేరుతో వివిధ ఖాతాల్లో డబ్బు జమ చేశాడు. ట్రేడింగ్ ఖాతాలో లాభం చూపుతున్నా, విత్‌డ్రా చేసుకునే అవకాశం లేదు. ఆ డబ్బు తీసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని చెప్పడంతో ఇదంతా సైబర్ మోసమని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

త్వరలో పాతబస్తీలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

చార్మినార్, మే 16(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎమ్మెల్సీ కవితను కోరామని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది తెలిపారు. శుక్రవారం మహమ్మద్ సైఫుద్దీన్ లోదితో కలిసి ఆమెతో సమావేశమైనట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింల అభివృద్ధికి కృషి చేశామాన్నారు.

సరస్వతి నది పుష్కరాలకు ఎంపీ వంశీని ఆహ్వానించకపోవడం అవమానకరం

అఫ్జల్‌గంజ్, మే 16(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ నెల 15న ప్రారంభమైన కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ప్రొటోకాల్ ప్రకా రం ఎంపీ గడ్డం వంశీని ఆహ్వానించకపోవడం అవమాన కరమని, వెంటనే మంత్రి శ్రీధర్‌బాబు, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామా అయ్యర్ భేషరతుగా యావత్ దళిత జాతికి క్షమాపన చెప్పాలని జాతీయ మాలల ఐక్యవేధిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల సుధీర్ బాలనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గోషామహల్‌లో విలేకరుల సమావేశంలో ఆవుల సుధీర్ బాలనాథం మాట్లాడారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామ అయ్యారు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే ఎంపీ గడ్డం వంశీకి క్షమాణలు చెప్పాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆవుల సుధీర్ బాలనాథం హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'కుక్కలు కరిచినా భయం వొద్దు'

చార్మినార్, మే 16(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనే సుందరీమణులు ఈ నెల 13న చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చార్మినార్, లాడ్ బజార్ పరిసర ప్రాంతాల్లో 64 వీధి కుక్కలను జీహెచ్ఎంసీ వెట్నరీ విభాగం అధికారులు పట్టుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ టీ శ్రీనివాస్ రెడ్డి, వెటనేరీ డాక్టర్ శ్రీకాంత్ పట్టుకున్న కుక్కలను చుడీబజారలోని జీహెచ్ఎంసీ ఎనిమల్ కేర్ సెంటర్‌లో ఉంచి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. వ్యాక్సినేషన్ అనంతరం పట్టుకున్న కుక్కలను చార్మినార్ వద్ద విడిచి పెట్టమని యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌వల్ల కుక్కలు కరిచినా భయపడాల్సిన అవసరం లేదన్నారు.

'ఈటలకు క్షమాపణ చెప్పాలి'

కార్వాన్, మే 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ని ఎమ్మెల్యే జగ్గారెడ్డి అనుచిత వాఖ్యలతో దూషించడం సరికాదని బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చ సభ్యులు దేవర శ్రీనివాస్ అన్నారు. కార్వాన్‌లో నిర్వహించిన బీజేపీ ముఖ్య నేతల సమావేశానికి హాజరైన దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ... జగ్గారెడ్డి బీజేపీ నాయకులపై మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు. ఈటల రాజేందర్‌కు జగ్గారెడ్డి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు అర్జున్‌కుమార్, ప్రభు పూజారి, వెంకటేశ్‌సాగర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

● బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

బర్కత్‌పుర, మే 16(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న అందాల పోటీలకు హాజరైన విదేశీ మహిళల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించి తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతీసిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు ఆరోపించారు. శుక్రవారం బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కీర్తిప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తం చేస్తామని వందలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అందాల పోటీలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ దేశాల ముందు తెలంగాణ ఆత్మగౌరవాన్ని పెంచాల్సింది పోయి వారి ముందు మన ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికైనప్పటి నుంచీ నేటికీ ఒక్క రేషన్‌కార్డు కూడా పంపిణీ చేయలేదని ఆరోపించారు. తక్షణమే అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా అగ్రి వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ ఎన్నికలు

రాజేంద్రనగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం కోసం శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 95 శాతం ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కళాశాలలు, వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో 695 మంది నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ ఉండగా, వారిలో 650 మందికి పైగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వర్సిటీ పరిపాలన భవనం, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పరిశోధన స్థానం, సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీ, రుద్రూర్, అదిలాబాద్, జగిత్యాల్, వరంగల్, అశ్వారావుపేట్, మధిర, పాలెం, సంగారెడ్డిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ఓటు వేయడానికి ఉద్యోగుల క్యూ

నేడు ఓట్ల లెక్కింపు

వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచిం గ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుర్తింపు సం ఘం కోసం జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం ఉదయం 11 గంటలకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అడిటోరియంలో నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

28న అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్‌కు ఎన్నికలు

రాజేంద్రనగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా)కు ఎన్నికలు నిర్వహించడానికి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో వర్సిటీకి చెందిన 447 మంది శాస్త్రవేత్తలు, అధ్యాపకులు మూడు ప్యానెళ్లుగా విడిపోయి నామినేషన్‌లు దాఖలు చేశారు.

ప్రచారం కూడా మొదలు పెట్టారు. పాలెం, వరంగల్, జగిత్యాల్, అశ్వారావుపేట్, సంగారెడ్డి, సైఫాబాద్, రుద్రూర్, రాజేంద్రనగర్‌లో పోలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న ఎన్నికలు ఉండగా, 30న ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

పోటీలో మూడు ప్యానెల్స్

టాసాకు జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికలలో డాక్టర్ కె. పవన్ చంద్రారెడ్డి ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తుండగా, ఆయన ప్యానెల్‌లో ఉపాధ్యక్షునిగా డాక్టర్ జె.కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సల్లా సౌజన్య, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ పి.రమేశ్, కోశాధికారిగా డాక్టర్ జె. రాజేందర్ పోటీలో ఉన్నారు.

● డాక్టర్ జె.రాజేశ్వర్ నాయక్ అధ్యక్షుడుగా పోటీ చేస్తున్న ప్యానెల్‌లో ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఎస్. నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కె. భానురేఖ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఎం.శంకర్, కోశాధికారిగా డాక్టర్ పి.ప్రశాంత్ పోటీలో ఉన్నారు.

● డాక్టర్ పి.రజనీకాంత్ అధ్యక్షునిగా పోటీ చేస్తున్న ప్యానెల్ లో ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ వి.రమ్య, ప్రదాన కార్యదర్శిగా డాక్టర్ బి.వి వరప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ బి.లక్ష్మీ ప్రసన్న, కోశాధికారిగా డాక్టర్ ఎండీ అలీబాబా పోటీలో ఉన్నారు.

ఖానాపూర్‌లో బుల్కాపూర్ నాలాకు విముక్తి

నార్సింగ్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన బుల్కాపూర్ నాలాను వట్టినాగుపల్లి, ఖానాపూర్‌లకు మంచి రోజులు వచ్చాయి. బుల్కాపూర్ నాలా నుంచి వస్తున్న మురుగునీరు గండిపేటలో కలుస్తుందని ఆ నీటిని అడ్డుకుంటూ హైడ్రా అధికారులు ఖానాపూర్‌లో గేట్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే హైడ్రా గేట్లు ఏర్పాటు చేయగా, నార్సింగ్ మున్సిపల్ అధికారులు ఈ బుల్కాపూర్ నాలాకు పూడికతీత కార్యక్రమం మొదలుపెట్టారు. కొన్ని ప్రాంతాల్లో కొంతమంది మట్టి పోసి ఆక్రమించుకున్నారు. మరికొంతమంది నాయకుల ప్రోత్సలంతో అమ్మకాలు సాగించారు. ఇప్పుడు ఆ బుల్కాపూర్‌నాలా ముందుకెళ్లాల్సిన పరిస్థితి ఉండడంతో ఇక మున్సిపల్ అధికారులు బుల్కాపూర్‌నాలాకు ఖానాపూర్, వట్టినాగులపల్లి ప్రాంతంలో నాలాల్లో నీరు పారేందుకు అడ్డుగా ఉన్న వాటన్నింటిని తొలగించారు. కాల్వలో నీరు పారే విదంగా ఏర్పాటు చేశారు. దీంతో ఆక్రమణలన్నీ తుడుచుకుపోయి ఖానాపూర్ నుంచి నగరం వైపు నీరు సాఫీగా ప్రవహిస్తుంది. గండిపేటలో కలిసే ప్రమాదం తప్పింది.



బుల్కాపూర్ నాలాలో మట్టిని తొలగించడంతో సాఫీగా వెళ్తున్న నీరు

అయితే నాలాలకు విముక్తి కలిగించిన అధికారులు ఆ నాలాను మూసివేసిన వారిపై చర్యలు తీసుకోలేదు. వట్టినాగులపల్లి, ఖానాపూర్ ప్రాంతంలో చాలా మంది ఖద్దర్ నేతలు ఈ నాలాను పూడ్చి అమ్ముకొని కోట్లాది రూపాయిలు సంపాదించారని, ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ జరగాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్/చార్మినార్/అఫ్జల్‌గంజ్, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మైలార్‌దేవుపల్లిలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో



చార్మినార్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్

ఎంటమాలజీ విభాగం సిబ్బంది ఫాగింగ్, మలేరియా ఆయిల్ బాల్‌ల ద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/RNtiTMAలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

19 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

అఫ్జల్‌గంజ్, మే 16 (ఆంధ్రజ్యోతి): చరిత్రాత్మకమైన జియాగూడ శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 19న ప్రారంభం కానున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ దేవాలయల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఠాగూర్ జీవన్‌సింగ్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం జియాగూడ శ్రీరంగానాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల బ్రోచర్లను ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఎస్‌టీ చారి, ప్రతినిధి శేషాచారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస్, రంగనాథచార్యులు, బద్రినాథ్ చారి, శ్రీరంగనాథసేవ సమితి సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. 20న ఉదయం 10 గంటలకు గరుడ ప్రసాద పంపిణీ, 22న సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి కల్యాణమహోత్సవం, 23న రథోత్సవం ఊరేగింపు, 24న చక్రస్నానం, 25న లక్ష 25 వేల పుష్పాలతో పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, సాయంత్రం 108 కళశాలతో దేవరులకు మహాభిషేకం, మహాపూర్ణాహుతి, 28న 1001 కళశాలతో శాస్త్ర కళాభిషేకంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ప్రీమియా అకాడమీలో ఇంటర్ ఉపకార వేతన పరీక్ష

హైదరాబాద్ సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తామని, దీనికోసం అర్హత పరీక్షను నిర్వహిస్తామని ప్రీమియా అకాడమీ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ సింధూరి రెడ్డి తెలిపారు. అత్తాపూర్‌లోని ప్రీమియర్ అకాడమీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తమ అకాడమీలో 10, 12 తరగతుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చేందుకు ప్రీమియా అకాడమీ క్యాంపస్‌లో ఈనెల 17, 24, 31 తేదీల్లో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెజ్లర్లకు ఆర్థిక సాయం

అఫ్జల్‌గంజ్, మే 16 (ఆంధ్రజ్యోతి): చండీగఢ్‌లో జరుగనున్న నేషనల్ అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ నుంచి 22 మంది రెజ్లర్లు హాజరు కానున్నారు. వీరికి హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. చండీగఢ్ పోటీల్లో పాల్గొంటున్న రెజ్లర్లు మెడల్ సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, పైల్వాన్, అర్గనైజింగ్ సెక్రటరీ అస్లాం పాల్గొన్నారు.



రెజ్లర్‌కు చెక్కు అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, సంతోష్ పైల్వాన్, అస్లాం

రక్తపోటు.. అవయవాలకు చేటు

ముందస్తు గుర్తింపుతో ప్రమాద నివారణ ● నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే

చాదర్‌ఘాట్, మే 16(ఆంధ్రజ్యోతి): మానవాళికి అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ప్రమాదకరం. ఇదో సైలెంట్ కిల్లర్. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు లేకుండా ఇది గుండె, బ్రెయిన్, కిడ్నీలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు రెగ్యులర్‌గా బీపీ చెకప్‌లు చేయడం చాలా ముఖ్యం. భారతదేశంలో దాదాపు 22కోట్ల మంది హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారు. అయితే, 50 శాతం మందికి ఈ సమస్య ఉందనేదే తెలియకపోవడం ఆందోళనకరమైన విషయం.

లక్షణాలు

ప్రారంభ దశలో లక్షణాలు లేకపోయినా తీవ్రమైన లేదా నియంత్రించని రక్తపోటు వల్ల తలనొప్పి, తల తిరగడం వంటివి వస్తాయి. చూపు మబ్బుగా కనిపించడం, తీవ్రంగా అలసట చెందడం, చాతిలో నొప్పి, గుండె చప్పుళ్లు, అసమానంగా ఉండడం, శ్వాసలో ఇబ్బంది వంటి సంకేతాలు కనబడవచ్చు. ఇవి గుర్తించి వైద్య సాయం తీసుకోవడం చాలా ముఖ్యం. ఔషధాలతోపాటు గుండెకు మేలైన జీవనశైలిని అనుసరించడం కూడా ఎంతో అవసరం.

హైపర్ టెన్షన్ అంటే...

రక్తనాళాల్లో రక్తం వేగంగా ప్రవహించి అధిక ఒత్తిడి పెరగడం వల్ల వచ్చే సమస్యే హై బీపీ. సాధారణంగా 140/90ఎంఎంహెచ్‌జీ కంటే ఎక్కువ బీపీ ఉన్నట్లయితే హైపర్ టెన్షన్‌గా పరిగణిస్తారు.

- రీడింగ్ 140/90 ఎంఎంహెచ్‌జీ ఉంటే తేలికపాటి హైపర్ టెన్షన్
- 140/90 నుంచి 159/99ఎంఎంహెచ్‌జీ మధ్య ఉంటే స్టేజ్-1 హైపర్ టెన్షన్
- 160/100 ఎంఎంహెచ్‌జీ కంటే ఎక్కువైతే స్టేజ్-2 హైపర్ టెన్షన్
- 180/110ఎంఎంహెచ్‌జీ కంటే ఎక్కువైతే హైపర్ టెన్సివ్ ఎమర్జెన్సీ అంటారు. దీనికి అత్యవసరంగా చికిత్స చేయాల్సిన అవసరం ఉంటుంది.



హైపర్ టెన్షన్ రెండు రకాలు

- **ప్రైమరీ హైపర్ టెన్షన్:** ఇది వయస్సు పెరగడం, జీవనశైలి అలవాటు (అనారోగ్యకరమైన ఆహారం, వ్యాయామం లోపం, ఒత్తిడి)తో క్రమంగా వృద్ధి చెందుతుంది.
- **సెకండరీ హైపర్ టెన్షన్:** ఇది మూత్రపిండాల వ్యాధులు, హార్మోన్ వ్యత్యాసాలు, కొన్ని మందుల వాడకం లేదా స్లీప్ ఆప్నియా వంటి ఆరోగ్య సమస్యల కారణంగా వస్తుంది.

వ్యాయామం తప్పనిసరి



హై బీపీని నివారించేందుకు రోజుకు 5గ్రాముల కంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి. నిత్యం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు, పౌష్టిక ధాన్యాలను చేర్చాలి. మద్యం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలి. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం, యోగా వంటివి చేయాలి. 30 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరూ తమ బీపీని పరీక్షించుకోవాలి. దీనిని ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తమను తాము రక్షించుకోవచ్చు.

డాక్టర్ మురళీకృష్ణ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, కేర్ ఆస్పత్రి, మలక్‌పేట

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



అండర్-14 క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, వినయ్ కుమార్

ముషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, నీవి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 క్రికెట్ టోర్నీ-2025 పోటీలను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వ క్రీడా మైదానాలను కొంత మంది, కొన్ని సంస్థలు ఆక్రమించేందుకు యత్నిస్తున్నాయని, వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. బహిరంగ స్థలాలను ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నిస్తున్నదని, వాటిని ప్రజావసరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీవి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో స్లిట్ ల్యాంప్ ప్రారంభం



నిమ్స్‌లో స్లిట్ ల్యాంప్ పరీక్షల విభాగాన్ని ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తదితరులు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): బాల రుమటాలజీ రోగుల కళ్లకు సంబంధించి స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహించే నూతన విభాగాన్ని నిమ్స్‌లో శుక్రవారం సంస్థ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ విరాళంగా అందజేసిన రూ.4లక్షల విలువైన ఈ పరికరంతో మెరుగైన చికిత్సలను అందించవచ్చన్నారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి చెందిన కంటి వైద్యులు ప్రతి మంగళవారం నిమ్స్‌లోని పెడియాట్రిక్, రుమటాలజీ క్లినిక్‌లో స్లిట్ ల్యాంప్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజీరాజశేఖర్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, డాక్టర్ బసు, డా.కీర్తివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ శాఖలు కలిసి పనిచేయాలి

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతంగా ఆలోచించడంతోపాటు పనిలో వేగం పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డ్రగ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ రామ్‌ధన్, డిప్యూటీ కమిషనర్లు కేఏబీ శాస్త్రీ, పి.దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిసెంట్ డైరెక్టర్ డి.సరిత, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్లు డ్రగ్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాకాని మల్లేశ్వరుని సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మధుసూదనరావు దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న అర్చకులు

పెదకాకాని, మే 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. మధుసూదనరావు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దంపతులు రాహు కేతు పూజలలో పాల్గొన్నారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు న్యాయమూర్తి దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

ఇక సున్నం చెరువుకు మహర్దశ

● హైడ్రా నేతృత్వంలో రూ.10కోట్లతో అభివృద్ధి
● లేక్ చుట్టూ వాకింగ్ ట్రాక్





సున్నం చెరువు (ఇన్‌సెట్లో వాకింగ్ ట్రాక్ నమూనా)

హైటెక్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు మురుగు నీళ్లతో ఉన్న సున్నం చెరువుకు మహర్దశ పట్టనుంది. చుట్టూ అందమైన ప్లాంటేషన్‌తో మరో ఆరునెలల్లో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచనుంది. మాదాపూర్ పరిధి గుట్టల బేగంపేటలోని సున్నం చెరువును హైడ్రా అధికారులు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే చెరువులోని మురుగునీళ్లను తొలగించారు. మట్టిని లారీలతో తరలిస్తున్నారు. మొత్తం లేక్ ఏరియా 42.07ఎకరాలు కాగా, అందులో ఎఫ్‌టీఎల్ ఏరియా 32.20 గుంటలు. రూ.10 కోట్ల వ్యయంతో చెరువు సుందరీకరణ పనులు చేపట్టేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా లేక్ చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చుట్టూ గ్రానైట్ బెంచీస్, యోగా ప్లాట్‌ఫామ్, ఓపెన్ జిమ్, పిల్లలకోసం ఆట వస్తువులను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. ఎప్పటి కప్పుడు నీళ్లను మారుస్తూ అందమైన కొలనుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. చుట్టూ విద్యుత్ కాంతులతో ఆరునెలల కాలంలో అందమైన పార్కు ఇక్కడ అందుబాటులోకి రానున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.

వ్యూహాత్మక లోహాల కోసం పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయాలి

● మిధానీ సీఎండీ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మిధానీ సీఎండీ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

చంపాపేట, మే 16(ఆంధ్రజ్యోతి): వ్యూహాత్మక లోహాల కోసం పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయాలని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ)సీఎండీ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి ఎంఎస్‌ఎంఈలకు పిలుపునిచ్చారు. కంచన్‌బాగ్‌లోని మిధానీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రక్షణ రంగంలో స్వదేశీకరణను ప్రోత్సహించేందుకు యంఎస్‌ఎంఈ-2025 సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణమూర్తి మాట్లాడుతూ రక్షణ సామగ్రి రంగంలో స్వావలంబన, స్థిరత్వాన్ని నిర్ధారించడానికి దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ఉత్పత్తి, మార్కెటింగ్) టి.ముత్తుకుమార్, జీఎం(ఫైనాన్స్)కె.మధుబాల, ఏజీఎం(ఇన్‌చార్జి) శుభదీప్, యంఎస్‌ఎంఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ దినోత్సవం నేపథ్యంలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో గ్రేటర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు బస్తీలు, కాలనీల్లో దోమలు వృద్ధి చెందకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, డెంగీ ఎలా సోకుతుంది..? లక్షణాలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. పలుచోట్ల దోమల నివారణ చర్యలు, డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన స్టిక్కర్లను ఇంటింటికి అంటించారు.

ఉగ్రవాదంపై కవుల గళం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని వినిపించిన సామూహిక స్వరమే పహల్గాం సంకలనమని హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పహల్గాం ఉగ్రదాడిపై శతాధిక కవుల గళం, హాస్యవల్లరితో పాటు బాల సాహితీవేత్త గద్వాల సోమన్న రచించిన సప్తతి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దార్ల వెంకటేశ్వరరావు ఈ పుస్తకాల్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చౌదారి నరసింహారావు, కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, గద్వాల సోమన్న, రామకృష్ణ, చంద్రమౌళి, గజవెల్లి తదితరులు పాల్గొన్నారు.

చర్చిల వద్ద చలాన్ల సమస్యను నివారించాలి

సీ.ఎం ప్రజావాణిలో బిషప్స్, పాస్టర్ల వినతి



చిన్నారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సాల్మన్‌రాజ్ తదితరులు

బేగంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రై కమిషనరేట్‌ల పరిధుల్లోని చర్చీల వద్ద ప్రతి ఆదివారం పార్కింగ్ చేసే వాహనాలపై పోలీసులు చలానాలు విధిస్తున్నారని, దీనిని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని బిషప్స్, పాస్టర్స్ క్రిస్టియన్స్ సంఘం ప్రతినిధులు శుక్రవారం సీ.ఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన చిన్నారెడ్డి డీజీపీకి లేఖ రాస్తూ ప్రార్థనలు జరిగే సమయంలో చర్చీల వద్ద చలాన్ల సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనే సాల్మన్‌రాజ్ నేతృత్వంలో ప్రతినిధులు సీ.ఎం ప్రజావాణికి వచ్చారు.

సీ.ఎం ప్రజావాణికి 226 దరఖాస్తులు



సీ.ఎం ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న డా. చిన్నారెడ్డి

ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీ.ఎం ప్రజావాణికి మొత్తం 226 దరఖాస్తులు వచ్చాయి. సీ.ఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరగా, అందుకు తగిన నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని చిన్నారెడ్డి, దివ్య సమాధానం ఇచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 64, రెవెన్యూకు 54, హోం శాఖ విభాగానికి 20, ఇందిరమ్మ ఇళ్లకు 37, ఇతర శాఖలకు చెందిన 51 దరఖాస్తులు వచ్చాయి.

టీ-సాట్‌తో కలిసి పనిచేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ/హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలనే సంకల్పంతో ప్రతి ఇంటికి ఉన్నత విద్యను చేర్చాలనే టీ-సాట్ ఆశయంతో కలిసి పనిచేస్తామని ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ అన్నారు. ఓయూ అధ్యాపక బృందంతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్న టీ-సాట్ చానల్‌ను శుక్రవారం సందర్శించారు. ఆధునాతన టెక్నాలజీతో కూడిన పరికరాలు, స్టూడియోలు, పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్, కెమెరాలు, డిజిటల్ బోర్డులను తిలకరించారు. గతంలో కుదిరిన ఎంవోయూ ప్రకారం టీ సాట్‌తో కలిసి పనిచేస్తామని వీసీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీ సాట్ సీఈవో బోధనపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి పాల్గొన్నారు.



టీ-సాట్‌ను సందర్శించిన ఓయూ వీసీ మొలుగరం కుమార్, సాట్ సీఈవో బి.వేణుగోపాల్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు



ధర్నాలో మాట్లాడుతున్న విమలక్క తదితరులు

సింగరేణి మారుపేర్ల కేసులను పరిష్కరించాలి

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సింగరేణిలో 30ఏళ్ల నుంచి సర్వీస్ చేస్తున్న ఉద్యోగుల్లో కొందరికి మారుపేర్లు (రెండుపేర్లు) ఉండడంతో వారి పిల్లలు డిపెండెంట్ ఉద్యోగాలకు అనర్హులంటూ విచారణలో విజిలెన్స్ అధికారులు తిరస్కరించడం, పెండింగ్ కేసులను పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బాధితులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. అందాల పోటీలకు కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వానికి సింగరేణి మారుపేరు బాధితులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బాధితుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారు చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హెచ్చరించారు. ధర్నాలో బాధితులు లక్క శ్రవణ్, తిరుమల శ్రీనివాస్, ఓం ప్రకాష్, సంతోష్, రంజిత్ తదితరులు మాట్లాడుతూ ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేసి ఉద్యోగాలు కల్పించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారుహెచ్చరించారు.

చెత్తకుప్పలో పసికందు

బిట్స్ పిలానీ, మే 16 (ఆంధ్రజ్యోతి): బొడ్డు కూడా కోయని ఓ పసికందుకు నూరేళ్లు నిండాయి. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నవజాత మగ శిశువును చెత్తకుప్పలో పడేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీహాల్ సమీపంలో ఓ మగశిశువు మెడకు బొడ్డుతో చెత్తకుప్పలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108కు సమాచారం అందించగా పరిశీలించిన సిబ్బంది అప్పటికే శిశువు మరణించాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఎండీఏలో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

హైదరాబాద్ సిటీ, మే16 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏలో మహిళా ఉద్యోగుల కోసం రొమ్ము క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్ ఆస్పత్రితో కలిసి మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. 45 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసున్న మహిళలకు క్లినికల్ స్క్రీనింగ్‌లను కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ స్నేహ నిర్వహించారు. సుమారు 200 మంది మహిళా ఉద్యోగులు వైద్య సేవలను పొందారు.

నకిలీ ధ్రువపత్రాలు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



నకిలీ పత్రాలను చూపుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువపత్రాలతోపాటు పాత స్టాంపు పేపర్లు విక్రయిస్తున్న ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చిన వారికి ధ్రువపత్రాలు సమకూర్చుతున్న ముఠాను పట్టుకున్న కేసును లోతుగా దర్యాప్తు చేసి మరో ముఠాను అరెస్ట్ చేశామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఎల్‌బీనగర్ క్యాంపు కార్యాలయంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. హయత్‌నగర్ కుంట్లూరుకు చెందిన స్వస్తిక్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు తోట వెంకట భాను ప్రకాష్(55), అతడి భార్య తోట సాగరిక (38) ముఠాను ఏర్పాటు చేసుకొని నకిలీ ధ్రువపత్రాలు విక్రయిస్తున్నారు. పాత నేరస్తుడు ఆసిఫ్‌నగర్ హుడా కాలనీకి చెందిన సయ్యద్ ఫిరోజ్ అలీ (34), హయత్‌నగర్‌కు చెందిన అడ్డగూడూరు చంద్రశేఖర్ (64), డాక్యుమెంట్ విక్రేత అడ్డగూడూరు అనిల్ (35), అంబర్‌పేట్‌కు చెందిన ఎండీ జలీల్ (33), చౌటుప్పల్‌కు చెందిన పులుసు మల్లేష్‌గౌడ్, కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రవీణ్, నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి దుడ్డు సుధీర్‌కుమార్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్యాలయ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ముద్దసిర్, చౌటుప్పల్‌కు చెందిన జల్లా కిషోర్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ చంచల నిఖిల్, రబ్బర్ స్టాంప్ తయారు చేసే సత్యప్రభులతో కలిసి ఈ నకిలీ ధ్రువపత్రాల దందా చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి తోట వెంకటభానుప్రకాష్, తోట సాగరిక, చంద్రశేఖర్, అనిల్, జలీల్, కిషోర్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి నకిలీ సేల్‌డీడ్‌లు, ఖాళీ ఫ్రాంక్లిన్ పేపర్లు, పాత స్టాంపు పేపర్లు, 48 నకిలీ జనన ధృవపత్రాలు, నకిలీ కుల ధృవీకరణ పత్రాలు, నకిలీ ఆదాయ ధృవీకరణ పత్రాలు, పాత స్టాంపు పేపర్లు స్వాధీనం చేసుకున్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న వెంకటాచారి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 29 వరకు జిల్లాలోని 119 కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఫస్టియర్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న, అదనపు డిప్యూటీ కమిషనర్లు ఎస్. భాస్కర్, రాందాస్ తేజావత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భోజన కుతూహలం

మంచి చేసే 'కామంచి'

మనం కొన్ని రకాలైన ఆకు కూరలనే వండుకుంటూ ఉంటాం. కానీ ఔషధ గుణాలున్న అనేక ఆకు కూరలు మనకు ప్రకృతిలో లభ్యమవుతాయి. అలాంటి ఒక మొక్క కామంచి. దీని గురించి 'భోజన కుతూహలం' గ్రంథంలో రఘునాథ సూరి సవివరంగా ప్రస్తావించాడు.

కామంచి టమోటా జాతికి చెందిన మొక్క. ఇది గుబురుగా పెరుగుతుంది. దీనిని చిన్న చిన్న కాయలు కాస్తాయి. కామంచి ఆకులు కొద్దిగా కారంగా.. చేదుగా ఉంటాయి. వీటిని తమిళులు ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ఆకులతో 'మనత్తక్కళి కొర్ఘాంబు' అనే కూర వండుతారు. ఈ ఆకులను పాలకూర, మెంతికూర, తోటకూర వంటి ఆకు కూరలతో కలిపి వండి తింటే దోషాలు తొలగిపోతాయి. ఈ ఆకులను ఉడికించి తినాలి. లేదా వేయించుకొని తినాలి. అంతే తప్ప సలాడ్‌లో చేర్చి పచ్చి ఆకులు తినకూడదు. వీటిని పిల్లలకు, గర్భిణిలకు పరిమితంగా పెట్టాలి. ఇక ఈ ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో చూద్దాం..



- కామంచి ఆకులు ఫంగస్ వల్ల కలిగే వ్యాధులకు విరుగుడుగా పనిచేస్తాయి. ఈ ఆకులలో ఉండే కొన్ని ప్రత్యేక ఔషధ గుణాల వల్ల గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
- ఈ ఆకులు అజీర్తి కారణంగా వచ్చే కడుపులో నెప్పిని తగ్గిస్తాయి. జీర్ణకోశ సమస్యలకు నివారణగా పనిచేస్తాయి.
- ఈ ఆకులు చర్మ వ్యాధులను తగ్గిస్తాయి. దురద, దద్దుర్లను ఉపశమనింపచేస్తాయి. ఈ ఆకులను ఎండబెట్టి పొడి చేసి పట్టిస్తే గజ్జి, తామర వంటి వ్యాధులు కూడా తగ్గుతాయి.
- కామెర్ల వ్యాధి రాకుండా ఈ ఆకులతో టీ కాచుకొని తాగితే మంచి ప్రయోజనముంటుంది. ఈ ఆకులు కాలేయం దెబ్బతినకుండా కాపాడతాయని అధ్యయనాలలో తేలింది.
- ఈ ఆకులతో తయారుచేసిన టీని క్రమం తప్పకుండా తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

సులభంగా లభించే ఔషధ మొక్కలను సమాజ హితం కోసం వాడటం చాలా కాలంగా వస్తోంది. ఉదాహరణకు తమిళనాడులో ఉత్సవాల సమయంలో వచ్చిన జనాలకు నేలవాము కషాయం పంచుతారు. ఇది అంటువ్యాధులు ప్రబలకుండా కాపాడుతుంది. తెలుగు ప్రాంతాల్లో కూడా జాతరలప్పుడు స్థానికంగా దొరికే వన మూలికల కషాయాలు ఇస్తుంటారు. కామంచి ఆకుల కషాయాన్ని ఉత్సవాలప్పుడు ఇస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

కళ్లజోడుతో.. కళ్లు చెదిరేలా...



మందగించిన కంటిచూపు కోసం కళ్లజోడు పెట్టుకోక తప్పదు. అలాంటప్పుడు వేసుకునే మేకప్ జోడుతో సరిజోడీగా ఉండేలా చూసుకోవాలి.

ఐలైనర్: కనురెప్పల పైనా, దిగువనా ఐలైనర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవాలి. ఇందుకోసం పైకనురెప్పకు జెల్ ఐలైనర్ అప్లై చేసి, దిగువన పౌడర్ ఐలైనర్ ఉపయోగించాలి.

ప్రైమర్: ముక్కుకు ఇరువైపులా ప్రైమర్ అప్లై చేసి రూపమివ్వాలి. కళ్లద్దాలు ముక్కు మీదకు జారిపోతూ ఉంటాయి. కాబట్టి ఇలా తరచూ జరగకుండా ఉండడం కోసం, ముక్కు మీద కళ్లజోడు తగిలే ప్రదేశంలో ఐషాడో ప్రైమర్‌ను అద్దుకోవాలి


మస్కారా: కాలంచెల్లిన మస్కారా ధరిస్తే, పొడిగా జోడు మీద రాలిపడుతూ ఉంటుంది. తాజా మస్కారా ఎంచుకోవాలి. మూత తెరిచిన తర్వాత మస్కారాను మూడు నెలలకు మించి వాడుకోకూడదు. క్రీమీగా ఉండే వాటర్‌ప్రూఫ్ మస్కారానే ఉపయోగించాలి. ఇవి జోడుకు అంటుకోవు.

భూతద్దం: షార్ట్ సైట్ ఉన్నవాళ్లు జోడు ధరించకుండా మేకప్ వేసుకోలేరు. కాబట్టి జోడు లేకుండా మేకప్ వేసుకోవాలనుకుంటే, భూతద్దం కొనుక్కోవాలి. ఈ అద్దం దగ్గరుంటే, జోడుతో పని లేకుండా మేకప్ వేసుకోవచ్చు

ఐబ్రో: జోడు ఫ్రేమ్ కనుబొమలను కప్పేస్తున్నాయి కదా అని కనుబొమలను నిర్లక్ష్యం చేయకూడదు. వాటిని చక్కగా గ్రూమ్ చేసి, బ్రో పెన్సిల్‌తో దిద్దుకోవాలి. ఇలా చేస్తేనే జోడులో నుంచి కనుబొమలు స్పష్టంగా కనిపిస్తాయి.

బ్రష్: కురచ హ్యాండిల్ ఉన్న మేకప్ బ్రష్ ఎంచుకోవాలి. పొడవాటి హ్యాండిల్ మేకప్ బ్రష్‌లు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తాయి. కురచ బ్రష్షులతో మేకప్‌ను మరింత చక్కగా వేసుకోవచ్చు

స్ప్రే: కళ్లజోడు ధరించినప్పుడు కళ్ల చుట్టూ ఉండే ప్రదేశంలో తేలికగా చమట పడుతూ ఉంటుంది. కాబట్టి మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే ఉపయోగించాలి.



వంటిల్లు

వేసవి తాపాన్ని తగ్గించడంలో రాగి పిండిని విఎంచింది లేదు. దీనితో జావ, అంబలి, సంగటి, రొట్టె ఇలా ఎన్నో రకాల వంటలు చేస్తూ ఉంటాం. ఇవి కాక రాగి పిండితో చేసే వెరైటీ వంటకాలు మీ కోసం...

నోరూరించే రాగి రుచులు

రాగి కిచిడి

కావాల్సిన పదార్థాలు

రాగిపిండి- అర కప్పు, పెసరపప్పు- అర కప్పు, సగ్గుబియ్యం- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- అయిదు, టమాటా ముక్కలు- అర కప్పు, కేరట్ ముక్కలు- అర కప్పు, అల్లం తరుగు- రెండు చెంచాలు, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, మిరియాలు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నెయ్యి- నాలుగు చెంచాలు, జీడిపప్పు పలుకులు- రెండు చెంచాలు, జీలకర్ర- అర చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, ఇంగువ- చిటికెడు, కొత్తిమీర తరుగు- మూడు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో పెసరపప్పు తీసుకుని నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. మరో గిన్నెలో రాగిపిండి వేసి కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ గరిటె జారుగా కలపాలి. ఉండలు రాకుండా చూసుకోవాలి.
- స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో కడిగిన పెసరపప్పు, సగ్గుబియ్యం, ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కేరట్ ముక్కలు, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, మిరియాలు, పసుపు వేసి అవి మునిగేవరకూ నీళ్లు పోయాలి. మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. తరవాత స్టవ్ మీద నుంచి కుక్కర్‌ను దించి అది చల్లారాక మూత తీసి దానిలోని మిశ్రమాన్ని పప్పు గుత్తితో మెత్తగా మెదపాలి.
- కుక్కర్‌ను మళ్లీ స్టవ్‌మీద పెట్టాలి. పప్పు మిశ్రమం వేడెక్కాక అందులో రాగి పిండి విఎశ్రమం పోస్తూ బాగా కలపాలి. తరవాత ఉప్పు వేసి కలిపి చిన్న మంట మీద పది నిమిషాలు ఉడికించాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నెయ్యి వేసి కరగించాలి. ఇందులో జీలకర్ర, ఇంగువ, జీడిపప్పు పలుకులు, కరివేపాకు వేసి వేపాలి. ఈ తాలింపును కుక్కర్‌లోని మిశ్రమంలో వేసి బాగా కలిపి రెండు నిమిషాలు ఉడికించాలి. తరవాత నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కిచిడీని వేడివేడిగా సర్వ్ చేస్తే బాగుంటుంది.

జాగ్రత్తలు

- ఈ కిచిడీలో ఆలుగడ్డలు, క్యాలీఫ్లవర్ లాంటి ఇతర కూరగాయల ముక్కలతో పాటు పచ్చి బఠాణీలు కూడా వేసుకోవచ్చు.
- కిచిడీ ఉడుకుతున్నప్పుడు ముద్దలా అయిందనిపిస్తే కొన్ని వేడినీళ్లు కలుపుకోవాలి.
- నెయ్యి వద్దనుకుంటే నూనెతో తాలింపు పెట్టుకోవచ్చు.



రాగిపిండితో తయారుచేసే ఆహార పదార్థాలను తరచూ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. మలబద్ధకం రాదు. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. కండరాలు బలోపేతమవుతాయి. కేటరాక్ట్ లాంటి కంటి సమస్యలు రావు. శరీరంలో వేడి తగ్గుతుంది.

రాగి తోప

కావాల్సిన పదార్థాలు

రాగిపిండి- ఒక కప్పు, బెల్లం- ఒక కప్పు, నీళ్లు- రెండు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, పచ్చి కొబ్బరి తురుం- అర కప్పు, యాలకుల పొడి- అర చెంచా



తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి నీళ్లు పోసి కరిగించాలి. తరవాత ఈ బెల్లం నీళ్లను వడబోయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి కరగించాలి. ఇందులో రాగిపిండి వేసి బాగా కలుపుతూ కమ్మని వాసన వచ్చే వరకూ మూడు నిమిషాలపాటు వేయించాలి. తరవాత పచ్చి కొబ్బరి తురుం వేసి కలుపుతూ మరో రెండు నిమిషాలు వేయించాలి. ఈ విఎశ్రమం వేగిన తరవాత అందులో బెల్లం నీళ్లు పోస్తూ ఉండలు కట్టకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. మధ్య మధ్యలో నెయ్యి వేస్తూ ఉండాలి. పిండి మిశ్రమం... నెయ్యిని విడుస్తూ గిన్నెకు అంటుకోకుండా ముద్దలా అయ్యేవరకూ తిప్పుతూనే ఉండాలి. తరవాత యాలకుల పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలోకి తీయాలి. చల్లారాక ముక్కలుగా కోసుకోవచ్చు. వేడిగా తిన్నా, చల్లారాక తిన్నా ఈ రాగి తోప రుచిగానే ఉంటుంది.

జాగ్రత్తలు

- రాగి పిండిని చిన్న మంట మీద నిదానంగా వేయించాలి. లేదంటే పిండి మాడిపోతుంది.
- వేగిన పిండి మిశ్రమంలో బెల్లం నీళ్లు కలిపేటప్పుడు విస్కర్‌ను ఉపయోగిస్తే ఉండలు రావు.
- ఇందులో జీడిపప్పు, బాదం పప్పు, సార పప్పు, గుమ్మడి గింజలు లాంటివి కలుపుకోవచ్చు.

రాగులలో ఎక్కువగా పీచు పదార్థాలు, పిండి పదార్థాలు, ప్రోటీన్లు, కాల్షియం, పొటాషియం, సోడియం, ఐరన్, అయోడిన్ తదితర పోషకాలు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను కరగిస్తాయి. రక్తహీనతను నివారిస్తాయి.

రాగి ఊతప్పం

కావాల్సిన పదార్థాలు

రాగిపిండి- ఒక కప్పు, అటుకులు- ఒక కప్పు, నీళ్లు- రెండున్నర కప్పులు, అల్లం- చిన్న ముక్క, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పచ్చి మిర్చి- మూడు, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- అర కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కేరట్ తురుం- అర కప్పు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, కారం- అర చెంచా, ఉప్పు- తగినంత, జీలకర్ర- అర చెంచా, పసుపు- చిటికెడు, వంటసోడా- అర చెంచా, నిమ్మరసం- రెండు చెంచాలు, నూనె- తగినంత

తయారీ విధానం

- ఒక గిన్నెలో రాగిపిండి, అటుకులు వేసి ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి బాగా కలపాలి. గిన్నె మీద మూత పెట్టి పది నిమిషాలు నాననివ్వాలి.
- మిక్సీలో అల్లం, వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులోనే రాగిపిండి మిశ్రమం, అర కప్పు నీళ్లు పోసి మరోసారి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పిండి మిశ్రమాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీయాలి. పిండి గట్టిగా ఉందనిపిస్తే అర కప్పు నీళ్లు పోసి కలపాలి. ఇందులో కరివేపాకు తరుగు, అర కప్పు ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు, పావు కప్పు కేరట్ తురుం, పావు కప్పు కొత్తిమీర తరుగు, జీలకర్ర, పసుపు, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత వంటసోడా వేసి దానిపై నిమ్మరసం చిలకరించి బుడగలు వచ్చిన తరవాత పిండిలోకి కలపాలి. పిండి మరీ గట్టిగా లేదా మరీ పలుచగా కాకుండా చూసుకుంటూ అవసరమైతే మరికొన్ని నీళ్లు కలపాలి.
- స్టవ్ మీద పెనం పెట్టి వేడయ్యాక ఒక చెంచా నూనె రాయాలి. దీనిమీద గరిటెడు పిండిని సమంగా పరచి పైన కొన్ని ఉల్లిపాయ ముక్కలు, కొంచెం కొత్తిమీర తరుగు, కొద్దిగా కేరట్ తురుం వేసి మూతపెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. తరవాత మూత తీసి ఊతప్పం మీద అర చెంచా నూనె వేసి రెండో వైపునకు తిప్పి మరో రెండు నిమిషాలు ఉంచాలి. ఇలా రెండు వైపులా ఎర్రగా వేగిన ఊతప్పాన్ని పళ్లెంలోకి తీయాలి. దీనిని టమాటా, కొబ్బరి, పల్లీ చట్నీలతో తింటే రుచిగా ఉంటుంది. సాంబార్‌తో కూడా తినవచ్చు.



జాగ్రత్తలు

- రాగులను నీళ్లలో నానబెట్టి మొలకెత్తించి తరవాత ఆరబెట్టి తయారు చేసిన పిండిని తీసుకుంటే ఊతప్పం మరింత రుచిగా ఉంటుంది.
- వంటసోడా+నిమ్మరసం బదులు పావు కప్పు పుల్లని పెరుగు కలుపుకోవచ్చు.
- ఈ పిండితో ఇడ్లీ లేదా గుంట పొంగలాలు కూడా తయారు చేసుకోవచ్చు.

సంకల్పం

అమ్మ వేసిన గెలుపు బాట



జియా రాయ్... పదహారేళ్ల ఆటిజమ్ అమ్మాయి. గత ఏడాది... ఇంగ్లిష్ చానల్‌ను ఈదేసింది. ప్రపంచ రికార్డు నెలకొల్పింది. విజయం జియాదే..! కానీ... దాని వెనుకనున్న అసలు కష్టం... ఆమె తల్లి రచనా రాయ్‌ది. అందరిలా తన బిడ్డను సమున్నతంగా నిలబెట్టడం కోసం... వృత్తిని వదిలేసి... ఎన్నిటినో త్యాగం చేసి... స్విమ్మింగ్ నేర్చుకున్నారు 44 ఏళ్ల రచన. అమ్మగానే కాదు... ఒక స్నేహితురాలిగా... ఉపాధ్యాయురాలిగా... అన్నిటికీ మించి మంచి కోచ్‌గా కూతుర్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు.

"ఉన్నది ఒకటే జీవితం. దాన్ని ఎంత హుందాగా, ఎంత అర్థవంతంగా జీవించామన్నదే ముఖ్యం. ఇన్నేళ్ల నా ప్రయాణంలో నాకు అర్థమైంది ఇది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరం మాది. ఓ పాఠశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ బోధించేదాన్ని. మావారు మదన్ రాయ్ నేవీలో అధికారి. 2008లో మాకు పాప పుట్టింది. జియా అని పేరు పెట్టుకున్నాం. మా ఆకాంక్షలకు ప్రతిరూపం తను. కానీ రెండేళ్లు తిరిగేసరికి జియా ప్రవర్తనలో మార్పు కనిపించింది. తను బొమ్మలతో ఆడుకొనే తీరు మాకు వింతగా అనిపించేది. వైద్యులను సంప్రతిస్తే... జియాకు ఆటిజమ్ అని చెప్పారు. ఆటిజమ్ గురించి మాకు ఏమాత్రం అవగాహన లేదు. అప్పటికి వైద్యులు, సన్నిహితుల ద్వారా మాకు తెలిసింది ఏంటంటే... జియాకు నిరంతరం థెరపీలు చేయిస్తుండాలని, జీవితాంతం తను వేరొకరిపై ఆధారపడక తప్పదని.

కెరీర్ అనేది లేదన్నారు...

ఆటిజమ్ గురించి నేను, మావారు పరిశోధించాం. చాలా విషయాలు అవగాహనకు వచ్చాయి. మా అమ్మాయి పరిస్థితి కంటే నన్ను బాగా బాధించింది... ఇరుగుపొరుగు వారి వ్యాఖ్యలు. జియా ఎంతసేపూ మాపైనే ఆధారపడాలని, తనకు అసలు కెరీర్ అనేదే లేదని కొందరు అనేవారు. అవి నాలో పట్టుదల పెంచాయి. భగవంతుడు మనకు ఈ జీవితాన్ని ప్రసాదించాడు. అంటే ఆయన దృష్టిలో దానికి ఏదో ఒక కారణం ఉండే ఉంటుందనేది నా ప్రగాఢ విశ్వాసం.

ఉద్యోగం వదిలేసి...

నేను, మావారు కలిసి మా అమ్మాయికి మాటలు నేర్పించే ప్రయత్నం చేశాం. స్కూల్లో పని చేస్తూనే ఇంటి దగ్గర ట్యూషన్స్ చెప్పేదాన్ని. ఇంటి పనితో పాటు ఇవన్నీ చూసుకొంటూనే, జియాకు కావల్సినవి సమకూర్చేదాన్ని. క్షణం తీరిక లేకపోయినా ఏ రోజూ భారంగా భావించలేదు. అయితే జియాపై మరింత శ్రద్ధ పెట్టాలన్న ఉద్దేశంతో 2011లో ఉద్యోగం వదిలేశాను. ఇంటి దగ్గర ట్యూషన్లు కొనసాగించాను.

పిల్లలను దూరంగా తీసుకువెళ్లేవారు...

ఏడాది తరువాత మాకు అబ్బాయి పుట్టాడు. నాకు పని భారంతో పాటు బాధ్యతలు కూడా పెరిగాయి. దీంతో ట్యూషన్స్ కూడా మానేశాను. మరోవైపు జియా ప్రవర్తన చూసి చుట్టుపక్కల వారు 'మీ అమ్మాయి పిచ్చిదానిలా ఉంది' అంటూ తమ పిల్లలను జియాకు దూరంగా తీసుకువెళ్లేవారు. స్కూల్లో చేర్పిద్దామంటే... పాఠశాల యాజమాన్యాలు 'ప్రత్యేక పాఠశాలకు తీసుకువెళ్లండ'ని అనేవారు. చివరకు ఒక స్కూల్లో అడ్మిషన్ ఇచ్చారు.

మలుపు తిప్పిన ఈత...

బడికి అయితే వెళుతోంది కానీ... అందరూ జియాను జాలిగా చూడడం మొదలుపెట్టారు. అదే సమయంలో పాఠశాలలో ఈత పోటీలు జరిగాయి. అప్పటికే ఈతలో ప్రవేశం ఉండటం వల్ల జియా ఆ పోటీల్లో పాల్గొంది. విశేషమేమంటే... అందులో స్వర్ణ పతకం గెలిచింది. తోటి విద్యార్థులు చప్పట్లతో అభినందించారు. నా కళ్లు చెమర్చాయి. జియా జీవితాన్ని, తన పట్ల ఇతరుల ఆలోచనా విధానాన్ని సమూలంగా మార్చేసిన ఘట్టం అది. నాకు అర్థమైందేంటంటే... స్విమ్మింగ్ ద్వారా తనకు ఈ సమాజంలో తగిన గౌరవం లభిస్తుందని.

సవాళ్లు లేని ప్రయాణం లేదు...

జీవితంలో సవాళ్లు లేని ప్రయాణం అంటూ ఉండదు. జియా విషయంలో అడుగడుగునా ఎన్నో అడ్డంకులు, సమస్యలు. ఈత నేర్పిద్దామని ముంబయిలోని స్విమ్మింగ్ స్కూల్స్ చుట్టూ తిరిగాను. ఎవరూ తనను చేర్చుకోవడానికి ఇష్టపడలేదు. కొంతమంది శిక్షకులు ముందుకు వచ్చినా.. తనకు అర్థమయ్యేలా చెప్పలేకపోయారు. ఇక లాభం లేదని నేనే ఈత నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పటివరకు నేను ఈత కొట్టిందిలేదు. కూతురు కోసం మొదటిసారి కొలనులోకి దిగాను.

అద్భుత విజయాలు ఎన్నో..

2019లో... తొలిసారి జియా జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. స్వర్ణ పతకం గెలిచింది. అది మొదలు ఎన్నో పతకాలు సాధించింది. గత ఏడాది ఇంగ్లిష్ చానల్‌ను అతిపిన్న వయసులో, అతితక్కువ సమయంలో ఈదిన ఆటిజమ్ బాలికగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 2022లో 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్', మరుసటి ఏడాది 'నేషనల్ అవార్డ్ ఫర్ డిజేబిలిటీ' అందుకుంది. మొత్తంగా కెరీర్‌లో ఇప్పటివరకు 39 స్వర్ణ పతకాలు గెలుచుకుంది. తన విజయాలు చూసినప్పుడు నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. ఈ విజయాలు జియాకు మాత్రమే కాదు... ఒక తల్లిగా నాకూ ఎంతో గర్వకారణం. ఒకసారి గుడికి వెళ్లినప్పుడు... జియా చేతులు జోడించి నా ముందు నిలుచుంది. అది గమనించిన ఒకావిడ... 'తన మనసులో మీరు, ఆ భగవంతుడు ఒక్కటే అని మీ అమ్మాయి భావిస్తోంది' అన్నారు. ఆ మాటలకు నా నోట మాట రాలేదు. నా కూతుర్ని గట్టిగా హత్తుకుని ఏడ్చేశాను. ప్రతిభకు పదును పెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యం అడ్డు కాదని చెప్పడానికి జియా జీవితానికి మించిన రుజువు ఇంకేం కావాలి!"

నేర్చుకొని నేర్పించాను...

నాతోపాటు జియాను కూడా స్విమ్మింగ్ శిక్షణకు తీసుకువెళ్లేదాన్ని. 'మీరు నాకు ఈత నేర్పండి. మా అమ్మాయికి నేను నేర్పిస్తాను' అని ట్రైనర్‌కు చెప్పాను. నేను నేర్చుకున్నది నేర్చుకున్నట్టు తనకు అర్థమయ్యేలా వివరించేదాన్ని. తను కూడా ఇతరులకన్నా నేను చెబితే ఎంతో శ్రద్ధగా వినేది. ఇంట్లో ఉన్నప్పుడు స్విమ్మింగ్ వీడియోలు చూపించేదాన్ని. అలా క్రమంగా స్విమ్మింగ్‌లో జియా నైపుణ్యం సంపాదించింది. తన కోసం నా ఉద్యోగం వదిలేశాను. ట్యూషన్స్ మానేశాను. కానీ దాన్ని నేను త్యాగం అనను. ఎందుకంటే నా జీవితమే తను.

చెప్పులు లేదా షూల ఆకారంలో పాదాలమీద గుర్తులు కనిపిస్తుంటాయి. ఇలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి ఆ గుర్తులను పోగొట్టుకోవచ్చు.

చెప్పుల మచ్చలా?

- ఒక గిన్నెలో రెండు చెంచాల టమాటా రసం, ఒక చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించి పావుగంట అలాగే ఉంచాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే రంగు మారిన పాదాలు యథాస్థితికి వస్తాయి. టమాటాలోని లైకోపిన్... చర్మం మీద సూర్యకాంతి ప్రభావాన్ని తగ్గిస్తుంది. నిమ్మరసం సహజ బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది.
- గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, నాలుగు చెంచాల పెరుగు, అర చెంచా పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలకు పట్టించాలి. బాగా ఆరిన తరవాత చేతితో మెల్లగా మర్దన చేస్తూ పిండిని తొలగించాలి. తరవాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే పాదాలు రంగు తిరుగుతాయి. పెరుగులోని లాక్టిక్ ఆమ్లం... చర్మం మీద మృతకణాలను తొలగిస్తుంది. శనగపిండి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది.



ఇండీ కూటమికి భవిష్యత్ లేదు!

» బీజేపీకి దృఢమైన యంత్రాంగం ఉంది: పి.చిదంబరం

న్యూఢిల్లీ, మే 16: ప్రతిపక్ష 'ఇండీ కూటమి' భవిష్యత్ ఏమంత ఉజ్వలంగా లేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. పైగా బీజేపీకి శక్తిమంతమైన యంత్రాంగం ఉందని, అది ఆషామాషీ రాజకీయ పార్టీ కాదని.. అన్ని వైపుల నుంచీ దానిని ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. త్వరలో జరిగే బిహార్, బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్‌తో కలిసి మృత్యుంజయ్‌సింగ్ యాదవ్ రాసిన 'కంటెస్టింగ్ డెమోక్రాటిక్ డెఫిసిట్' అనే పుస్తకాన్ని చిదంబరం గురువారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఇండీ కూటమి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందని మృత్యుంజయ్‌సింగ్ చెబుతున్నా.. నాకైతే అలా అనిపించడం లేదు. దాని భవిష్యత్ ఉజ్వలంగా లేదు. బహుశా సల్మాన్ దీనికి జవాబు చెప్పగలరు. ఎందుకంటే కూటమి చర్చల బృందంలో ఆయన కూడా భాగస్వామి. నిజంగా కూటమి ఐకమత్యంతో ఉంటే నేనెంతగానో సంతోషిస్తా. కానీ అది చాలా బలహీనంగా ఉంది. అయితే దానిని ఒక్కటిగా కూర్చవచ్చు. ఇంకా సమయం ఉంది' అని చెప్పారు. అయితే కాంగ్రెస్, ఇతర పార్టీలు బీజేపీని ఆషామాషీగా తీసుకోకూడదన్నారు. 'బీజేపీ అంత సంఘటితమైన, బలోపేతమైన పార్టీ లేదు. ప్రతి విభాగంలో పటిష్ఠంగా ఉంది. అది సాధారణ పార్టీ కాదు' అని హెచ్చరించారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఆయన వంటి రాహుల్‌గాంధీ సన్నిహితులకు కూడా కాంగ్రెస్‌కు భవితవ్యం లేదని తెలుసంటూ ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ 'ఎక్స్'లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

పాక్ నుంచి అఫ్గాన్ సరుకు ట్రక్కులకు అనుమతి

న్యూఢిల్లీ, మే 16: ఆపరేషన్ సిందూర్ కారణంగా సరిహద్దులు మూసివేయడంతో పాకిస్థాన్‌లో నిలిచిపోయిన 150 అఫ్గాన్ సరకు రవాణా ట్రక్కులను వాఘా-అట్టారీ సరిహద్దు ద్వారా భారత్ వచ్చేందుకు అనుమతించారు. వీటిలో అధిక శాతం డ్రై ఫ్రూట్స్ తీసుకువచ్చేవే. ఇప్పటికే 8 ట్రక్కులు భారత్ చేరుకున్నట్లు వ్యాపార సంఘాల ప్రతినిధులు తెలిపారు. మరోవైపు అఫ్గానిస్థాన్ తాలిబన్ల పాలనలోకి వెళ్లాక తొలిసారిగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆ దేశ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో గురువారం ఫోన్‌లో సంభాషించారు. ఈమేరకు జైశంకర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు ధన్యవాదాలు తెలిపినట్లు పేర్కొన్నారు. అంతేగాక తప్పుడు, నిరాధార వార్తలతో భారత్, అఫ్గానిస్థాన్ల మధ్య విభేదాలు సృష్టించేందుకు జరిగిన ప్రయత్నాలను తిప్పికొట్టడాన్ని స్వాగతించారు. సుదీర్ఘ కాలంగా రెండు దేశాల ప్రజల మధ్య ఉన్న స్నేహ సంబంధాలను గుర్తుచేసినట్లు జైశంకర్ పేర్కొన్నారు. కాగా, భారత విదేశాంగ మంత్రితో చర్చలు జరిపినట్లు అఫ్గాన్ విదేశాంగ శాఖ కూడా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య సంబంధాలను, వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ చర్చల్లో దృష్టి సారించినట్లు పేర్కొంది.

రక్షణ రంగానికి మరో 50వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత వర్గాలు తెలిపాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాయుధ దళాలకు రికార్డు స్థాయిలో రూ.6.81 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించారు. అంతకుముందు సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన రూ.6.22 లక్షల కోట్ల కంటే ఇది 9.2 శాతం ఎక్కువ. తాజాగా పెంచాలని భావిస్తున్న మొత్తానికి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశం ఉంది. ఈ నిధులను పరిశోధన, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ఉపయోగించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వంలో రక్షణ రంగానికి ప్రాధాన్యం కల్పించారు. 2014-15లో బీజేపీ ప్రభుత్వం రక్షణ శాఖకు బడ్జెట్‌లో రూ.2.29 లక్షల కోట్లు కేటాయించింది.

తుర్కియే ఉత్పత్తులు వద్దు!

యాపిల్ల దిగుమతిని నిలిపేసిన ఆజాద్‌పూర్ మండి.. ఆభరణాలు కొనబోమన్న లఖ్‌నవూ నగల వ్యాపారులు

» దేశమంతా 'బ్యాన్ తుర్కియే' నినాదం

న్యూఢిల్లీ, మే 16: తుర్కియే ఉత్పత్తులు, సేవలను దేశంలో బహిష్కరించాలంటూ సామాజిక మాధ్యమాల్లో మొదలైన నిరసన సెగ తీవ్రమవుతోంది. 'బ్యాన్ తుర్కియే' నినాదం దేశం మొత్తం పాకుతోంది. శత్రు దేశం పాకిస్థాన్‌కు వత్తాసు పలికినందుకు పర్యాటక, వాణిజ్య రంగాల్లో తుర్కియేపై పెద్ద దెబ్బే పడేలా కనిపిస్తోంది. వారం రోజులుగా ఆ దేశానికి భారీగా బుకింగ్‌లు పడిపోగా.. ప్రయాణాలు రద్దు చేసుకున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఇప్పటికే తుర్కియే యాపిళ్లను పుణే మార్కెట్.. ఆభరణాలను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జ్యువెలర్స్ అసోసియేషన్ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. తాజాగా ఆసియాలోనే అతిపెద్ద పండ్లు, కూరగాయల మార్కెట్ అయిన ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండి.. తుర్కియే నుంచి యాపిళ్లు, ఇతర ఉత్పత్తుల దిగుమతులను నిలిపేస్తున్నట్లు తెలిపింది. రాజస్థాన్‌లోని అల్వార్ పండ్ల మార్కెట్ యూనియన్ కూడా తుర్కియే యాపిళ్లను కొనుగోళ్లు చేయబోమంటూ ప్రకటించింది. రాజస్థాన్‌కు రోజూ తుర్కియే నుంచి 15 టన్నులకు పైగానే యాపిళ్లు వచ్చేవని.. ఇకపై దిగుమతులు పూర్తిగా నిలిపేస్తున్నామని ఆ యూనియన్ వెల్లడించింది. ఇటు తుర్కియే ఆభరణాలను దిగుమతి చేసుకోబోమంటూ లఖ్‌నవూ నగల వ్యాపారులు ప్రకటించారు. 'ఇకపై టర్కిష్ నగలను కొనకూడదని మేం నిర్ణయం తీసుకున్నాం' అంటూ చౌక్ సరాఫా అసోసియేషన్ తెలిపింది. తుర్కియేతో పాటు పాక్‌కు మద్దతుగా ఉన్న అజర్‌బైజాన్‌లతో అన్ని వ్యాపార లావాదేవీలను నిలిపేయాలని నగల పరిశ్రమను భారత రత్నాభరణాల దేశీయ మండలి (జీజేసీ) కూడా కోరింది. అలాగే ఆ రెండు దేశాలతో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను నిలిపేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ (సీఏఐటీ) నిర్ణయించింది. ఇరు దేశాలతో ఇకపై ఎలాంటి వ్యాపారం జరగదని స్పష్టం చేసింది. ఈ విషయమై కేంద్రాన్ని కూడా కోరనున్నట్లు వెల్లడించింది. 24 రాష్ట్రాలకు చెందిన ట్రేడ్ నేతలంతా భేటీయై ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించింది.

మాది తుర్కియే కంపెనీ కాదు: సెలెబీ

విమానాశ్రయాల్లో భద్రతా సేవల అందించే సెలెబీ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ ఇండియాపై కేంద్రం వేటు వేయడంతో.. ఇస్తాంబుల్‌లో ఆ కంపెనీ షేర్ ధర 10 శాతానికి పైగా పతనమైంది. ఇటు అదానీ ఎయిర్‌పోర్టు సంస్థ కూడా సెలెబీతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ పరిణామాలతో స్పందించిన సెలెబీ యాజమాన్యం.. తమది తుర్కియే కంపెనీ కాదని వివరణ ఇచ్చింది. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమ సంస్థకు ఏ సంబంధం లేదని.. యాజమాన్య హక్కులన్నీ సెలెబీయోగ్లు కుటుంబానివేనని స్పష్టంచేసింది. తమ మాతృసంస్థలో 65% వాటా కెనడా, యూఎస్, యూకే, సింగపూర్ వంటి పలు దేశాల పెట్టుబడిదారులదేనని వెల్లడించింది.

భారత వర్సిటీల ఝలక్

పాక్‌కు అండగా నిలిచిన తుర్కియేకు మన యూనివర్సిటీలు కూడా ఝలక్‌లు ఇస్తున్నాయి. తుర్కియేలోని యూనస్ ఎమ్రే ఇన్‌స్టిట్యూట్‌తో విద్యా సంబంధిత అవగాహన ఒప్పందాన్ని తక్షణం రద్దు చేసుకుంటున్నట్లు మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (ఎంఏఎన్‌యూయూ) తాజాగా ప్రకటించింది. తుర్కియేతో ఎంఏఎన్‌యూయూ విద్యా సంబంధాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేసింది. తుర్కియే, అజర్‌బైజాన్‌లలోని సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ కూడా ప్రకటించింది. తుర్కియే, అజర్‌బైజాన్‌లోని సంస్థలతో సంబంధాలు తెంచుకున్న భారత తొలి ప్రైవేటు యూనివర్సిటీ ఇదే.. కాగా, ఇప్పటికే జామియా మిలియా ఇస్లామియా కూడా తుర్కియే విద్యాసంస్థలతో ఒప్పందాలను నిలిపేసింది. అంతకుముందు.. జాతీయ భద్రతను పరిగణనలోకి తీసుకొని తుర్కియేలోని ఇనోను వర్సిటీతో కుదుర్చుకున్న విద్యా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు జేఎన్‌యూ కూడా ప్రకటించింది.

చందమామ పిలుస్తోంది!



» చంద్రయాన్-5కు రెడీ అవుతున్న భారత్

» జపాన్ సహకారంతో ఇస్రో మరో మిషన్

» జాబిల్లి దక్షిణ ధ్రువ అన్వేషణకు 'లూపెక్స్'

» ఉపరితలం, నీటి జాడలపై అన్వేషణ

న్యూఢిల్లీ, మే 16: చంద్రయాన్-3తో చరిత్ర సృష్టించిన భారత్.. ప్రస్తుతం చంద్రయాన్ సిరీస్‌లో మరో రెండు ప్రాజెక్టు పనుల్లో తలమునకలైంది. వీటిలో చంద్రయాన్-4 ఇప్పటికే అభివృద్ధి దశలో ఉండగా.. లూనార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్ (లూపెక్స్) మిషన్‌గా పిలిచే చంద్రయాన్-5కు కూడా ఇస్రో ఇటీవలే ఆమోదం కూడా పొందింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూన్ మిషన్ చంద్రయాన్-5 కోసం భారత్, జపాన్ చేతులు కలిపాయి. ఇస్రో, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా) సంయుక్తంగా చేపడుతున్న ఈ మెగా ప్రాజెక్టుకు భారత ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలోనే ఆమోదం తెలిపింది. జపాన్‌కు చెందిన హెచ్3 రాకెట్ ద్వారా లూపెక్స్ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ ప్రయోగం 2027-28లో ఉండే అవకాశం ఉంది.

చంద్రయాన్-5 ఏం చేస్తుంది..?

చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంపై అధ్యయనం చేయడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా చంద్రుడి ఉపరితలం, దాని కింద నీరు, మంచు నిక్షేపాల కోసం అన్వేషణపై దృష్టి పెడుతుంది. భవిష్యత్ అంతరిక్ష కార్యకలాపాలకు ఈ పరిశోధనలు ఉపయోగపడనున్నాయి. అలాగే మానవ నివాసానికి కావలసిన వనరులు చంద్రుడిపై ఉన్నాయా... అనే విషయాలను అర్థం చేసుకోవడానికి ఈ అన్వేషణ ఉపయోగపడనుంది. చంద్రయాన్-5 మిషన్ ద్వారా 6.5 టన్నుల పేలోడ్‌ను కక్ష్యలోకి పంపిస్తారు. దీనిలో 250 కిలోల బరువుండే రోవర్ కూడా ఉంటుంది. అలాగే చంద్రయాన్-3లో ఉపయోగించిన ప్రజ్ఞాన్ కంటే పది రెట్ల బరువైన ల్యాండర్‌ను దీనిలో జాబిల్లిపైకి పంపుతారు. ఇవి చంద్రుడి ఉపరితలాన్ని విశ్లేషించి, శాస్త్రీయ ప్రయోగాలకు అవసరమైన సమాచారాన్ని సేకరిస్తాయి.

నీటి జాడల అన్వేషణ..

జాక్సా అభివృద్ధి చేసిన రోవర్‌లో వాటర్ అనలైజర్లు, స్పెక్ట్రోమీటర్లు, గ్రౌండ్-పెనెట్రేటింగ్ రాడార్, చంద్రుడి ఉపరితలంపై నమూనాల ఆధారంగా నీటిశాతం, నాణ్యతను అంచనా వేయడానికి 1.5 మీటర్ల లోతు వరకు తవ్వగలిగే పరికరాలను అమర్చారు. కాగా, ల్యాండర్‌తోపాటు అనేక ఇతర శాస్త్రీయ పరికరాలను ఇస్రో సమకూర్చనుంది. అలాగే నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) వంటి అంతర్జాతీయ భాగస్వాములు న్యూట్రాన్, మాస్ స్పెక్ట్రోమీటర్లతో సహా మరికొన్ని ప్రత్యేక పేలోడ్లను అందిస్తున్నాయి. ఈ మిషన్ చంద్రుని దక్షిణ ధ్రువానికి సమీపంలో ఉన్న శాశ్వత నీడ ప్రాంతం (పీఎస్ఆర్) లక్ష్యంగా చేసుకుని పరిశోధనలు చేస్తుంది. ఈ ప్రాంతంలో నీటి, మంచు నిక్షేపాలు ఉండి ఉంటాయని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. రోవర్ 100 రోజులపాటు పరిశోధనలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. పరిస్థితులను బట్టి దీన్ని ఒక సంవత్సరం వరకూ పొడిగించే అవకాశం ఉంది.

బెంగాల్ ఉద్యోగుల డీఏ 25% పెంచండి

» మూడు నెలల్లో అమలు చేయండి

» రాష్ట్ర సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 16: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు 25 శాతం కరవు భత్యం (డీఏ) చెల్లించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఆగస్టు నెలలో చేపడుతామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డీఏ చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ఉద్యోగులు కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. డీఏ పెంచాలంటూ 2022 మే నెలలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2022 నవంబరులో సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం డీఏను కొద్దికొద్దిగా పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 4% పెంచడంతో మొత్తం డీఏ 18 శాతానికి పెరిగింది. అదే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 55 శాతం డీఏ వస్తోంది. తేడా 37 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలోనే డీఏ పెంచాలని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది.

జస్టిస్ బేలా త్రివేదికి వీడ్కోలు పలకని బార్

న్యూఢిల్లీ, మే 16: సుప్రీంకోర్టులో శుక్రవారం అసాధారణ దృశ్యం నెలకొంది. పదవీ విరమణ చేసిన మహిళా న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ సంప్రదాయ రీతిలో వీడ్కోలు పలకకుండా బహిష్కరించింది. ఈ చర్యను న్యాయమూర్తులు ఖండించారు. పదవీ విరమణ రోజున ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌లో ఆసీనులు కావడం సంప్రదాయంగా వస్తోంది. దాంతో ఆమె ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌లధర్మాసనంలో కూర్చొన్నారు. సాయంత్రం సమయంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్స్ అసోసియేషన్లు వీడ్కోలు పలకడం మరో సంప్రదాయంగా వస్తోంది. వీడ్కోలు సమావేశంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ఈ చర్యను ఖండించింది. చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ సంఘాలు వద్దన్నప్పటికీ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్, ఉపాధ్యక్షురాలు రచనా శ్రీవాత్సవ ముగింపు రోజున జరిగే సంప్రదాయ ధర్మాసనం ముందుకు వచ్చారంటూ అభినందించారు. ఎవరూ వెళ్లవద్దని అసోసియేషన్లు తీర్మానాలు చేసినప్పటికీ వాటిని ధిక్కరించారని తెలిపారు. జడ్జి ఎలాంటి వారైనా కావచ్చుగానీ, సాయంత్రం 4.30 గంటల సమయంలో జరిగే కార్యక్రమాన్ని నిలిపివేయకూడదన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేక్షకులు మరోసారి నిరూపించారు

అల్లు అరవింద్



శ్రీవిష్ణు హీరోగా కార్తిక్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సింగిల్'. ఇవానా, కేతిక శర్మ కథానాయికలు. అల్లు అరవింద్ నిర్మించారు. ఈ సినిమా ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'సినిమాకు లభిస్తున్న ఆదరణను చూసి శ్రీవిష్ణుని మా ఆఫీసుకు పిలిచి గీతా ఆర్ట్స్‌లో మరో రెండు సినిమాలు చేయాలని కోరాను. సినిమా బాగుంటే థియేటర్లకు వస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. వారికి నా కృతజ్ఞతలు' అని అన్నారు. చిత్ర కథానాయకుడు శ్రీవిష్ణు మాట్లాడుతూ 'మా టీమ్‌లోని వారందరికీ జీవితాంతం గుర్తుండేలా ఈ చిత్రం విజయం సాధించింది' అని అన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'శ్రీవిష్ణు కామెడీ టైమింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ మూడు నెలల్లో రెండు హిట్‌లు కొట్టిన గీతా ఆర్ట్స్‌కి, చిత్ర విజయాన్ని అందుకున్న యూనిట్‌కు నా అభినందనలు' అని అన్నారు. చిత్ర దర్శకుడు కార్తిక్ రాజు మాట్లాడుతూ 'చిత్రబృందంలోని ప్రతీ ఒక్కరు అద్భుతంగా పనిచేయడం వల్లనే సినిమా ఇంతటి విజయాన్ని సాధించింది' అని అన్నారు.



'వీరమల్లు' రాక ఖరారు

సినీ అభిమానులంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పవన్ కల్యాణ్ చిత్రం 'హరి హర వీర మల్లు' విడుదల తేదీ ఖరారైంది. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత ఏ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండు పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొన్నాయి. త్వరలో మూడో గీతంతో పాటు ట్రైలర్‌ని రిలీజ్ చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ప్రస్తుతం సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైన్, డబ్బింగ్ పనులతో తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



ఆ సినిమా కోసం మూడు టైటిల్స్!

'తండేల్' చిత్రం తర్వాత నాగచైతన్య ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం అన్నపూర్ణ స్టూడియో దిగువన రూ. 5 కోట్లతో ఓ భారీ సెట్ వేశారు. ప్రస్తుతం ఈ సెట్‌లోనే కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ట్రజర్ హంట్, మైథాలాజికల్ అంశాలున్న ఈ సినిమా కోసం మూడు టైటిల్స్ పరిశీలిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. వాటిల్లో 'వృక్షకర్మ' ఒకటని, మరో రెండు టైటిల్స్ కూడా ఉన్నాయనీ, ఆయన చెప్పారు. నాగచైతన్య లుక్ ఇందులో చాలా కొత్తగా ఉంటుంది. మీనాక్షి చౌదరి ఇందులో హీరోయిన్. సుకుమార్ రైటింగ్స్ సంస్థ కూడా నిర్మాణంలో భాగస్వామి.

విజయాన్ని ఆస్వాదించాను

సమంత



'పది శాతం మాత్రమే విజయావకాశాలు ఉన్న ఇండస్ట్రీలో చిత్ర నిర్మాణం కరక్టేనా అని ఆలోచిస్తూనే 'శుభం' సినిమా తీశాను. ప్రేక్షకులు ఆదరించారు. ఆ విజయాన్ని ఆస్వాదించాను. అలాంటి విజయానికి ఎవరైనా బానిసవుతారు. అందుకే నిర్మాతలు సినిమాలు తీస్తున్నారేమో' అని అన్నారు నటి సమంత. స్వీయ నిర్మాణంలో సమంత అతిథి పాత్ర పోషించిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. గవిరెడ్డి శ్రీనివాస్, శాలిని, శ్రీయ కొంతం, చరణ్ పేరి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ హారర్ కామెడీ సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సమంత మాట్లాడుతూ 'నటిగా నా సినిమాలు విడుదలైనప్పుడు రివ్యూస్‌లో నా పాత్రకు సంబంధించినంత వరకే చూసుకునే దానిని. ఆ స్వార్థం నాకుండేది. కానీ నిర్మాతగా తొలిసారి ప్రతి రివ్యూను ఆసాంతం చదువుకున్నాను. కుటుంబమంతా కలసి చూసే మంచి సినిమాలు తీయటమే నా లక్ష్యం' అని అన్నారు. చిత్ర దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ 'నటులు అద్భుతంగా నటిస్తే సినిమా యాభై శాతం విజయం సాధించినట్లే. అందరూ కొత్తవారైనప్పటికీ ఈ సినిమాలో బాగా నటించారు. విజయవంతమైన ఇలాంటి సినిమాలు విడుదలవుతుంటే నిర్మాతలకు చాలా ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి. ప్రతీ భాషలో రిమేక్ చేసే కథ ఇది. మంచి సినిమా చేశామనే సంతృప్తి మాకు కలిగింది' అని అన్నారు.

ఆ ప్రచారంలో నిజం లేదు

టీఎస్ఎఫ్‌సీసీ

ఇకపై అద్దె ప్రాతిపదికన కాకుండా వాటాల విధానంలోనే థియేటర్లలో సినిమాలను ప్రదర్శించాలని తెలంగాణ థియేటర్ల యజమానులు నిర్ణయించుకున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని టీఎస్ఎఫ్‌సీసీ (తెలంగాణ స్టేట్ ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్) అధ్యక్షుడు సునీల్ నారంగ్, కార్యదర్శి కే అనుపమ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని మీడియా సంస్థలతో పాటు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశం ఈనెల 18న జరగనుందనీ, అప్పుడే ఎగ్జిబిటర్ల సమస్యలతో పాటు ప్రభుత్వాల విధానాలపైనా చర్చించి, ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయాలను వెల్లడిస్తామని చెప్పారు.



పుట్టిన రోజున సర్‌ప్రైజ్

హృతిక్‌రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కథానాయకులుగా రూపొందుతున్న హిందీ చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటించిన 'వార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కియారా అద్వాణీ కథానాయిక. ఈ స్పై థ్రిల్లర్‌కు అయాన్ ముఖర్జీ దర్శకుడు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 20న ఎన్టీఆర్ ఫస్ట్‌లుక్‌తో 'వార్ 2' టీజర్‌ను విడుదల చేసే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం హృతిక్ రోషన్ సోషల్ మీడియాలో స్పందించారు. 'పుట్టిన రోజు సందర్భంగా నీ కోసం ప్రత్యేక కానుకను సిద్ధం చేశాం. ఏంటో ఊహించగలవా తారక్' అంటూ ఎన్టీఆర్‌ను ఆటపట్టించారు. బదులుగా ఎన్టీఆర్ 'కబీర్.. నిన్ను వేటాడి నీకు ప్రత్యేక బహుమతి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా' అంటూ సరదాదా బదులిచ్చారు. ప్రస్తుతం 'వార్ 2' నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

హీరోయిన్‌గా పచ్చళ్ల పాప?



పచ్చళ్ల ధరలు ఎక్కువగా ఉన్నాయన్న కస్టమర్‌తో దురుసుగా ప్రవర్తించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో అలేఖ్య చిట్టి పికెల్స్ సిస్టర్స్ ఒక్కసారిగా జనం నోళ్లలో నానారు. నెగెటివ్ ప్రచారం వ్యాపారాన్ని దెబ్బతీసినా వారికి సోషల్ మీడియాలో ఫాలోయింగ్ మాత్రం అమాంతం పెరిగింది. ఇప్పుడు అలేఖ్య సిస్టర్స్‌లో ఒకరైన రమ్య తాజాగా సినిమాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. అశ్విన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'వచ్చినవాడు గౌతమ్' చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో ఆమె వేదికపై కనిపించారు. ఈ సినిమాలో రమ్య నటించారని తెలుస్తోంది. అయితే ఆమె కథానాయికగా నటించారా లేదా కీలక పాత్రలో కనిపించబోతున్నారా అనేది తెలియాల్సి ఉంది.



అవి రెండూ కర్మలే

స్వీయ దర్శకత్వంలో దేవన్ హీరోగా రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'. ధన్యబాలకృష్ణన్ కథానాయిక. బేబీ వైష్ణవి సమర్పణలో జ్యోత్స్న నిర్మిస్తున్నారు. తాజాగా డైరెక్టర్ వి.వి.వినాయక్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. 'ప్రేమించడం, ప్రేమించబడటం.. రెండూ కర్మలే. ఈ ప్రేమని అనైతికంగా అనుభవించాలనుకున్నా, అది మరింత కాంప్లికేటెడ్ అయి, ఎన్ని జన్మలైనా నీకు సరైన పాఠం నేర్పే వరకు వదలదు' అనే పవర్‌ఫుల్ వాయిస్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది.

బిజినెస్

'కార్వీ' మదుపరులు త్వరపడండి

జూన్ 2లోగా క్లెయిమ్‌లు సమర్పించండి : సెబీ

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) నుంచి బకాయిలు తీసుకోవాల్సిన మదుపరులు త్వరగా తమ క్లెయిమ్‌లు సమర్పించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కోరింది. ఇందుకు వచ్చే నెల రెండవ తేదీనే తుది గడువు అని గుర్తు చేసింది. కేఎస్‌బీఎల్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) 2023 నవంబరు 23న డిఫాల్టర్‌గా ప్రకటించింది. పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ) ద్వారా తమ ఖాతాల్లోని షేర్లను కుదువపెట్టేందుకు కేఎస్‌బీఎల్‌కు అధికారం ఇచ్చిన మదుపరులు ఈ ఏడాది జూన్ 2 లోగా క్లెయిమ్‌లు సమర్పించాలని కోరింది. ఈ విషయంలో ఇంకా ఏమైనా సహాయం కావాలంటే ఎన్ఎస్ఈ టోల్ ఫ్రీ నంబరు 1800 266 0050 (ఐవీఆర్ ఆప్షన్ 5ను ఎంచుకోవాలి) ద్వారా లేదా defaultisc@nse.co.in ఈ-మెయిల్ ద్వారా ఎన్ఎస్ఈని సంప్రదించాలని కోరింది. గడువు దగ్గర పడుతున్నందున ఇప్పటి వరకు క్లెయిమ్స్ సమర్పించని మదుపరులు త్వరపడాలని కోరింది. పీఓఏ ద్వారా మదుపరుల ఖాతాల్లోని షేర్లను తాకట్టు పెట్టి, ఆ నిధులను ఇతర సంస్థలకు మళ్లించి, చెల్లింపుల్లో విఫలమవడంతో సెబీ 2023 ఏప్రిల్‌లో కేఎస్‌బీఎల్‌పై వేటు వేసింది. కేఎస్‌బీఎల్, దాని సీఎండీ సీ పార్థసారథి ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనరాదని నిషేధించింది. దాంతో పాటు నిధుల దుర్వినియోగానికి రూ.21 కోట్ల జరిమానా కూడా విధించింది.

నవ లిమిటెడ్ లాభం రూ.303 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నవ లిమిటెడ్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,055.80 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.302.80 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 10.9 శాతం పెరగగా లాభం 18.8 శాతం వృద్ధి చెందింది. మార్చితో ముగిసిన పూర్తి సంవత్సరానికి గాను కంపెనీ రూ.4,135.20 కోట్ల ఆదాయంపై రూ.1,434 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఒక్కో షేరుకు రూ.6 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గతంలో ప్రకటించిన రూ.4 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనమని పేర్కొంది.

అన్ని విభాగాల్లో మెరుగైన వృద్ధి: గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీకి చెందిన మెటల్స్, మైనింగ్, ఇంధన విభాగాలు అత్యుత్తమ పనితీరును కనబరచటంతో మంచి వృద్ధిని నమోదు చేసినట్లు నవ లిమిటెడ్ సీఈఓ అశ్విన్ దేవినేని వెల్లడించారు. కాగా మార్చి త్రైమాసికంలో అనుబంధ సంస్థ నవభారత్ ప్రాజెక్ట్స్ నుంచి రూ.30.4 కోట్ల డివిడెండ్‌ను అందుకున్నట్లు ఆయన చెప్పారు. దీంతో 2024-25లో అనుబంధ సంస్థల నుంచి అందుకున్న డివిడెండ్ రూ.114.30 కోట్లకు చేరుకుందన్నారు.

ఆదుకోండి.. మహాప్రభో!

ప్రభుత్వానికి వొడాఫోన్ ఐడియా లేఖ ▸▸ లేకపోతే దివాలా తప్పదు



న్యూఢిల్లీ: టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా కథ కంచికి చేరే సూచనలు కనిపిస్తున్నాయి. పీకల్లోతు అప్పులు, నష్టాల్లో ఉన్న తమను ఆదుకోవాలని మరోసారి ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం తమ వద్ద ఉన్న నిధులతో మహా అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరి వరకు నెట్టుకురాగలమని స్పష్టం చేసింది. కొత్త రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకోకపోతే 2026 మార్చి తర్వాత దుకాణం నడపడం మా వల్ల కాదని కంపెనీ సీఈఓ అక్షయ ముంద్రా గత నెల 17న కేంద్ర టెలికాం శాఖ (డాట్) కార్యదర్శికి ఒక లేఖ రాశారు. వచ్చే ఏడాది మార్చిలోగా ప్రభుత్వ సాయం అందకపోతే దివాలా కోసం ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదని కూడా ఆయన ఆ లేఖలో తేల్చి చెప్పారు.

మూసివేత తప్పదా !

బ్యాంకుల నుంచి కొత్త అప్పులు పుట్టకపోతే నెట్‌వర్క్ విస్తరణ, ఆధునీకరణకు చిల్లిగవ్వ కూడా ఖర్చు చేయలేమని వొడాఫోన్ ఐడియా సీఈఓ తన లేఖలో డాట్‌కు తేల్చి చెప్పారు. అదే జరిగితే గత ఏడాది కాలంగా చేసిన పెట్టుబడి ఖర్చులూ బూడిదలో పోసిన పన్నీరుగా మారతాయని హెచ్చరించారు. అప్పుడు కంపెనీ ఆస్తుల విలువ పడిపోతుందని స్పష్టం చేశారు. కంపెనీ ఈక్విటీలో ఇప్పటికే ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. ఏజీఆర్, స్పెక్ట్రమ్ బకాయిల్లో కొంత మొత్తాన్ని ఈక్విటీగా మార్చడం ద్వారా ప్రభుత్వం ఈ వాటా తీసుకుంది. అయినా కంపెనీ ప్రభుత్వానికి ఇంకా రూ.1.18 లక్షల కోట్ల వరకు బకాయిలు చెల్లించాలి. సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏజీఆర్ బకాయిలపై ప్రభుత్వం ఇంకా వెసులుబాటు కల్పించే స్థితిలో లేదు. దీంతో వొడాఫోన్ ఐడియా ఎన్‌సీఎల్‌టీకి వెళితే కంపెనీ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఆ స్థితి నుంచి తప్పించుకోవాలంటే ఏదో ఒక కంపెనీ ముందుకు వచ్చి వొడాఫోన్ ఐడియా ఆస్తులను కొనుగోలు చేయాలి. ఇందుకు ఏ కంపెనీ ముందుకు వస్తుందన్నది ప్రస్తుతం పెద్ద ప్రశ్న. మరోవైపు అదానీ గ్రూప్ రంగ ప్రవేశం చేసి వొడాఫోన్ ఐడియాను దక్కించుకునే అవకాశం ఉందనే వార్తలు గుప్పుమంటున్నాయి.

రూ.1.95 లక్షల కోట్ల బకాయిలు

వొడాఫోన్ ఐడియా ఇప్పటికే ప్రభుత్వానికి ఏజీఆర్, స్పెక్ట్రమ్ బకాయిల రూపంలో రూ.1.95 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో పెనాల్టీలు, ఆ జరిమానాలపై వడ్డీల రూపంలో చెల్లించాల్సిన రూ.30,000 కోట్లను చెల్లింపుల నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించేలా గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ ఈ నెల 19న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు రానుంది. ఈ పిటిషన్ దాఖలు చేసిన మరుసటి రోజే ఈ లేఖ బయటికి రావడం విశేషం.

ఎగుమతుల్లో 4 రంగాలదే 50% పైగా వాటా

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత ఎగుమతుల్లో 50 శాతానికి పైగా వాటా వ్యవసాయం, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తులదేనని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. దేశంలో తయారీని, విలువ ఆధారిత ఎగుమతులను పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో భారత్ భిన్న రంగాల్లో బలోపేతమవుతుందని ఇది సూచిస్తోంది. 2024-25లో భారత్ నుంచి 43,742 కోట్ల డాలర్ల ఎగుమతులు జరిగాయి. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఈ విలువ దాదాపు రూ.37.40 లక్షల కోట్లు. అందులో ఇంజనీరింగ్ ఉత్పత్తుల వాటా 26.67 శాతంగా ఉండగా.. వ్యవసాయ రంగం 11.85%, ఫార్మా 6.96%, ఎలక్ట్రానిక్స్ 8.82% వాటా కలిగి ఉన్నాయి. ఈ నాలుగు రంగాల మొత్తం వాటా 54.3 శాతంగా ఉంది.

- గత ఆర్థిక సంవత్సరం ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 32.46 శాతం వృద్ధితో 3,858 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.3.30 లక్షల కోట్లు) పెరిగాయి. ప్రధానంగా యూఏఈ, అమెరికా, నెదర్లాండ్స్, బ్రిటన్, ఇటలీకి ఈ ఎగుమతులు జరిగాయి.
- ఇంజనీరింగ్ ఉత్పత్తులు 6.74 శాతం పెరిగి 11,667 కోట్ల డాలర్లకు (రూ.9.98 లక్షల కోట్లు) చేరాయి. అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, యూకే, జర్మనీకి ఈ ఉత్పత్తుల ఎగుమతులు అధికంగా జరిగాయి.
- ఔషధాల ఎగుమతులు 9.4 శాతం వృద్ధితో 3,047 కోట్ల డాలర్లుగా (రూ.2.61 లక్షల కోట్లు) నమోదయ్యాయి. మన ఔషధాలు 200కు పైగా దేశాలకు ఎగుమతవుతున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ రంగ ఎగుమతులు వరుసగా పెరుగుతూ వస్తున్నాయి.
- వ్యవసాయం, దాని సంబంధిత రంగాల నుంచి ఎగుమతులు 7.36 శాతం పెరిగి 5,186 కోట్ల డాలర్లకు (రూ.4.43 లక్షల కోట్లు) చేరాయి.

హెరిటేజ్ ఫుడ్స్ లాభంలో 77% వృద్ధి

- 2024-25లో రూ.188 కోట్లుగా నమోదు
- క్యూ4 లాభం రూ.38 కోట్లు
- ఒక్కో షేరుకు 50 శాతం డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.1,000 కోట్ల రెవెన్యూను సాధించినట్లు ప్రకటించింది. ఒక త్రైమాసిక కాలంలో రికార్డు స్థాయి ఆదాయాలను ఆర్జించటం ఇదే మొదటిసారని వెల్లడించింది. జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ రూ.1,048.46 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.38.16 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.950.56 కోట్లుగా ఉండగా లాభం రూ.40.49 కోట్లుగా ఉంది. అంతేకాకుండా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక రెవెన్యూ కూడా రికార్డు స్థాయిలో రూ.4,134.60 కోట్లుగా నమోదైనట్లు హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే గత ఆర్థిక సంవత్సర లాభం ఏకంగా 77 శాతం వృద్ధి చెంది రూ.188.28 కోట్లుగా నమోదైందని పేర్కొంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.5 ముఖ విలువతో కూడిన ప్రతి షేరుకు రూ.2.50 (50 శాతం) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది

పెరిగిన విలువ ఆధారిత ఉత్పత్తుల వాటా

2024-25 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ ప్రతి త్రైమాసికంలో నిలకడగా 10 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటూ వచ్చినట్లు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. దీంతో రికార్డు స్థాయిలో ఆదాయాలను ఆర్జించినట్లు ఆమె పేర్కొన్నారు. కాగా మార్చి త్రైమాసిక ఆదాయాల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల (వీఏపీ) వాటా 30.1 శాతం నుంచి 32.5 శాతానికి పెరిగిందని తెలిపారు. పెరుగు, పన్నీర్ విభాగంలో మార్కెట్‌తో పాటు కస్టమర్ బేస్‌ను పెంచుకోవటం ఎంతగానో కలిసివచ్చిందని బ్రహ్మణి తెలిపారు.

ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

200 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: ఐటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడటంతో పాటు భారతీ ఎయిర్‌టెల్ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ 200.15 పాయింట్లు కోల్పోయి 82,330.59 వద్దకు జారుకుంది. నిఫ్టీ 42.30 పాయింట్ల నష్టంతో 25,019.80 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.18 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.85 శాతం లాభపడ్డాయి. రంగాలవారీ సూచీల్లో ఇండస్ట్రియల్స్, రియల్టీ, క్యాపిటల్‌గూడ్స్, యుటిలిటీస్, పవర్ 1.80 శాతం వరకు పెరిగాయి. ఐటీ, టెక్, ఫోకస్డ్ ఐటీ, మెటల్, బ్యాంకింగ్ ఇండెక్స్‌లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ఈ వారంలో సెన్సెక్స్ 2,876.12 పాయింట్లు (3.61 శాతం), నిఫ్టీ 1,011.8 పాయింట్లు (4.21 శాతం) లాభపడ్డాయి.

చార్జ్ పవర్‌తో ప్యూర్ జట్టు

ఎనర్జీ స్టోరేజీ సంస్థ ప్యూర్.. కెనడాకు చెందిన చార్జ్ పవర్‌తో జట్టు కట్టింది. కెనడా, అమెరికాలోని ఎనర్జీ స్టోరేజీ మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ప్యూర్ పేర్కొంది. ప్యూర్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ ఇంధన స్టోరేజీ ఉత్పత్తుల శ్రేణిని కో-బ్రాండింగ్ ఒప్పందం ద్వారా ఇరు దేశాల్లోని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం లభించనుందని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	525
వరంగల్	517	గోదావరి	525
చిత్తూరు	603	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	124
వరంగల్	120	గుంటూరు	125
కరీంనగర్	120	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	115
కర్నూలు	120	నెల్లూరు	120
విశాఖపట్నం	121	అనంతపురం	120
గోదావరి	124		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,130 ▲	87,200 ▲	1,08,000 ▲
విజయవాడ	96,500 ▲	90,500 ▲	99,700 ▲
విశాఖపట్నం	95,630 ▼	87,200 ▲	1,08,000 ▼
రాజమండ్రి	95,130 ▲	87,200 ▲	96,800 ▼
ప్రొద్దుటూరు	95,800 ▲	88,140 ▲	98,100 ▲
ముంబై	92,301 ▼	84,548 ▼	94,606 ▲

నం.2 స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంటాం

హ్యుండయ్ సీఓఓ తరుణ్ గార్గ్

న్యూఢిల్లీ: దేశీయ కార్ల మార్కెట్లో నం.2 స్థానాన్ని తిరిగి చేజిక్కించుకుంటామని హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) తరుణ్ గార్గ్ అన్నారు. ఇందుకోసం కంపెనీ కార్యకలాపాల్లో దూకుడు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా మార్కెట్లోకి పలు కొత్త మోడల్ కార్లను విడుదల చేయడంతో పాటు గ్రామీణ, సంస్థాగత మార్కెట్లలో, పాత కార్ల (ప్రీ-ఓన్డ్) విభాగంలో విక్రయాలను పెంచేందుకు కృషి చేయనున్నట్లు శుక్రవారం కంపెనీ ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఆయన తెలిపారు. దేశీయ మార్కెట్లో చాలా కాలంగా రెండో అతిపెద్ద కార్ల విక్రయదారుగా కొనసాగుతూ వచ్చిన హ్యుండయ్.. గత నెలలో నాలుగో స్థానానికి జారుకుంది. విక్రయాలపరంగా మారుతి సుజుకీ తర్వాత రెండు, మూడు స్థానాలను మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ఆక్రమించాయి.

క్యూ4 లాభం రూ.1,614 కోట్లు: మార్చి త్రైమాసికం (క్యూ4)లో హ్యుండయ్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4 శాతం తగ్గి రూ.1,614 కోట్లకు జారుకుంది. ఆదాయం మాత్రం రూ.17,940 కోట్లకు పెరిగింది.

స్పోర్ట్స్

భళా..బల్లెం వీరా!

90 మీటర్ల మార్క్‌తో నీరజ్ చరిత్ర

డైమండ్ లీగ్‌లో భారత స్టార్‌కు రెండోస్థానం ● వెబర్‌కు మొదటి స్థానం



దోహా: మన బల్లెం వీరుడు భళా అనిపించాడు.. మరోసారి అసాధారణ ప్రదర్శనతో దేశం ఉప్పొంగేలా చేశాడు. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న తన 'లక్ష్యాన్ని' జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా చేరుకున్నాడు. దోహాలో శుక్రవారం జరిగిన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ టోర్నీలో నీరజ్.. మూడో ప్రయత్నంలో ఈటెను 90.23 మీటర్ల దూరం విసిరాడు. అయితే, హోరాహోరీగా సాగిన పోటీలో జర్మనీకి చెందిన జులియన్ వెబర్ టైటిల్ దక్కించుకున్నాడు. కాగా.. చాలాకాలంగా 90 మీటర్ల లక్ష్యానికి గురిపెట్టిన నీరజ్ ఏకంగా దానిని మించిన దూరంలో ఈటెను విసరడం విశేషం. తొలి ప్రయత్నంలోనే 88.44 మీటర్ల దూరం విసిరిన చోప్రా..ప్రధాన ప్రత్యర్థులు అండర్సన్ పీటర్స్, జులియన్ వెబర్‌లకు అందనంత దూరంలో నిలిచాడు. రెండో రౌండ్‌లో ఫౌల్ చేసిన భారత అథ్లెటిక్స్ పోస్టర్ బాయ్ నీరజ్ మూడో రౌండ్‌లో ఏకంగా 90.23 మీ.దూరంతో కెరీర్‌లో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఇక..నీరజ్ గత అత్యుత్తమ దూరం 89.94 మీ. దీనిని 2022 స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో నెలకొల్పాడు. అది జాతీయ రికార్డు కూడా కావడం విశేషం. కాగా..అంతకుముందు ఈ సీజన్ అత్యుత్తమ దూరాన్ని (84.52 మీ) నీరజ్ తొలి ప్రయత్నం (88.44 మీ.)లోనే అధిగమించాడు. నాలుగో ప్రయత్నంలో 80.56 మీ. దూరం విసిరిన 27 ఏళ్ల చోప్రా, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఆరో, ఆఖరి ప్రయత్నంలో 88.20 మీ. దూరంతో సరిపెట్టుకున్నాడు.



విజేత వెబర్: నీరజ్‌కు దోహా అంచె టైటిల్ ఖాయమని అనుకున్న దశలో..జర్మనీకి చెందిన జులియన్ వెబర్ అనూహ్యంగా దూసుకొచ్చాడు. ఐదో రౌండ్‌లో 89.84 మీ. దూరం విసిరి చోప్రాకు సమీపంలోకి వచ్చిన వెబర్..ఆరో రౌండ్‌లో 91.06 మీ. దూరం ఈటెను విసిరి టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఈ దూరం వెబర్‌కు వ్యక్తిగత అత్యుత్తమం కూడా. అండర్సన్ పీటర్స్ (గ్రెనడా- 85.64 మీ.)కు మూడోస్థానం దక్కింది. ఈ విభాగంలో పోటీపడిన మరో భారత అథ్లెట్ శ్రీకాంత్ జెనా ఎనిమిది స్థానంతో నిరాశపరిచాడు.

పారుల్..జాతీయ రికార్డ్: మహిళల మూడు వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో భారత్‌కు చెందిన పారుల్ చౌధురి 9ని13.39 సె. గమ్యం చేరి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. అయితే ఈ విభాగంలో ఆమె ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచింది.

3

90 మీ. మార్క్‌ను చేరుకున్న మూడో ఆసియా అథ్లెట్‌గా నీరజ్ రికార్డు నెలకొల్పాడు. అర్షద్ నదీమ్ (పాకిస్థాన్, 92.97 మీ.), చావో సున్ చెంగ్ (తైపీ, 91.36 మీ.) ఇంతకు ముందు ఈ మార్క్‌ను అందుకున్నారు. ఓవరాల్‌గా..అంటే ప్రపంచంలో ఈ ఘనత సాధించిన 25వ అథ్లెట్‌గా చోప్రా నిలిచాడు.

కోహ్లీపైనే కళ్లన్నీ!

నైట్‌రైడర్స్‌తో ఆర్సీబీ ఢీ ● ఐపీఎల్ పున:ప్రారంభం నేడు



నేటి మ్యాచ్	వేదిక బెంగళూరు
బెంగళూరు x కోల్‌కతా	రా.7.30 నుంచి

బెంగళూరు: ఇండో-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారం రోజుల క్రితం అర్ధంతరంగా నిలిచిపోయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పున:ప్రారంభానికి రంగం సిద్ధమైంది. శనివారం నుంచి మళ్లీ లీగ్ జరుగనుంది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్‌లో ఇక్కడి చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆతిథ్య రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. కాగా, ఈ పోరులో అందరి దృష్టీ విరాట్ కోహ్లీపైనే ఉండనుంది. ఐపీఎల్ విరామం సమయంలో అనూహ్యంగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచిన కోహ్లీ.. ఈ సీజన్ లీగ్‌లో అద్భుతంగా ఆడుతున్నాడు. ఈ తరుణంలో కేకేఆర్‌తో మ్యాచ్‌లో విరాట్ మరోసారి అదరగొట్టే అవకాశముంది.


రహానె

రజత్ పటీదార్ సారథ్యంలోని ఆర్సీబీ జట్టు లీగ్‌లో ఇప్పటికే 11 మ్యాచ్‌లాడి 16 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు అడుగుదూరంలో ఉంది. కోల్‌కతాపై నెగ్గి నాకౌట్ బెర్త్ ఖాయం చేసుకోవాలన్న పట్టుదలతో ఆర్సీబీ ఉంది. మరోవైపు 12 మ్యాచ్‌లాడి 11 పాయింట్లతో ఉన్న డిఫెండింగ్ చాంపియన్, రహానే కెప్టెన్సీలోని నైట్‌రైడర్స్‌కు ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరుజట్ల మధ్య జరిగే ఈ రసవత్తర పోరు అభిమానులను అలరించడం ఖాయం.

స్టార్క్ అవుట్

- స్టొయినిస్, ఇన్‌గ్లిస్ రాకతో పంజాబ్‌లో జోష్



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో తొలి టైటిల్ కోసం ఎదురు చూస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వాయిదా తర్వాత శనివారం పునఃప్రారంభమవుతున్న ఐపీఎల్‌కు తాను దూరమవుతున్నట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ప్రకటించాడు. భారత్-పాక్ యుద్ధం కారణంగా లీగ్ వారంపాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే ఢిల్లీ జట్టులోని ఎక్కువ మంది విదేశీ ఆటగాళ్లు మాత్రం భారత్ వచ్చేందుకు ఇష్టపడడం లేదు. అటు స్టార్క్ తన గైర్హాజరు విషయాన్ని ఢిల్లీ యాజమాన్యానికి తెలుపగా, వారు కూడా అతడి నిర్ణయాన్ని గౌరవించినట్టు సమాచారం. అయితే ఢిల్లీ వైస్ కెప్టెన్ డుప్లెసీ తన రాకను ధృవీకరించాడు. ఇక స్టబ్స్ లీగ్ మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉండి ఆ తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం లండన్ వెళ్తాడు. ఇక, కేవలం ఒక్క మ్యాచ్ ఆడిన డొనోవాన్ ఫెరీరా కూడా జట్టుకు దూరమవుతున్నానని ప్రకటించాడు.

బెంగళూరు, పంజాబ్‌లకు ఊరట: టాప్-3లో కొనసాగుతున్న బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లకు కీలక ఆటగాళ్ల రాకతో ఊరట లభించింది. బెంగళూరు పేసర్ హాజెల్‌వుడ్ ప్లేఆఫ్స్‌కు అందుబాటులో ఉంటాడు. ఇక ఆల్‌రౌండర్ స్టొయినిస్‌తో పాటు వికెట్ కీపర్ ఇన్‌గ్లిస్‌ల రాకపై సందేహాలు వీడాయి. తాము భారత్‌కు రానున్నట్టు వెల్లడించడంతో పంజాబ్ శిబిరంలో సంతోషం నెలకొంది. ముంబై ఆల్‌రౌండర్ విల్ జాక్స్ కేవలం లీగ్ మ్యాచ్‌ల కోసం భారత్‌కు రానున్నాడు.

ఈ గౌరవాన్ని ఊహించలేదు

వాంఖడేలో స్టాండ్ ఆవిష్కరణపై రోహిత్





ముంబై: రోహిత్ శర్మకు అరుదైన గౌరవం దక్కింది. వాంఖడే స్టేడియంలో అతడి పేరిట నెలకొల్పిన స్టాండ్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు రోహిత్ తల్లిదండ్రులు, భార్య రితిక హాజరయ్యారు. శరద్ పవార్, అజిత్ వాడేకర్‌ల పేరిట కూడా స్టాండ్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురైన రోహిత్.. 'ఇలాంటి గౌరవం దక్కుతుందని ఊహించలేదు. చిన్నతనంలో ముంబై, భారత జట్టుకు ఆడాలని కోరుకున్నా కానీ, వీటి గురించి ఆలోచించలేదు. వాంఖడే స్టేడియంతో ఎన్నో జ్ఞాపకాలున్నాయి. గొప్ప ఆటగాళ్లు, రాజకీయ నేతల మధ్య నా పేరు ఉండడాన్ని మాటల్లో వర్ణించలేను. 21న ఢిల్లీతో మ్యాచ్ ఆడేందుకు ఇక్కడికి వచ్చినప్పుడు ప్రత్యేక అనుభూతి దక్కనుంద'ని అన్నాడు.

ప్రజ్ఞానంద 'సూపర్'

క్లాసిక్ టోర్నీ విజేత భారత జీఎం



బుఖారెస్ట్ (రుమేనియా): సూపర్ బెట్ చెస్..రుమేనియా అంచె క్లాసిక్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద విజేతగా నిలిచాడు. శుక్రవారం జరిగిన టైబ్రేకర్లలో ప్రజ్ఞానంద 1.5 పాయింట్లు సాధించి టైటిల్ అందుకున్నాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి ప్రజ్ఞానంద, అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్), మాక్సిమ్ లగ్రావ్ (ఫ్రాన్స్) తలా 5.5 పాయింట్లతో సమంగా నిలిచారు. దాంతో బ్లిట్జ్ గేమ్‌ల టైబ్రేకర్లు నిర్వహించగా..మొదట ఫిరౌజాతో డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద రెండో టై బ్రేకర్‌లో లగ్రావ్‌పై విజయం సాధించాడు.

టిమ్..స్టేడియంలో స్విమ్!



బెంగళూరు: మండే ఎండల్లో వరుణుడు దంచి కొడుతుంటే..ఆ జోరు వానలో తడుస్తుంటే..వావ్..ఆ అనుభూతి మాటల్లో వర్ణించలేనిది.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ ఆల్‌రౌండర్ టిమ్ డేవిడ్ కూడా అలాంటి వాతావరణంలో ఒక్కసారిగా చిన్నపిల్లాడిలా మారిపోయాడు. ఐపీఎల్ పునఃప్రారంభంలో భాగంగా శనివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో బెంగళూరు తలపడనుంది. అయితే శుక్రవారం కురిసిన భారీ వర్షంతో స్టేడియం తడిసి ముద్దయ్యింది. డేవిడ్ జోరు వానలో తడుస్తూ..మైదానంపై కప్పిన కవర్లపై చేరిన వర్షపు నీటిలో ఈదుతూ ఎంజాయ్ చేశాడు.

కరుణ్‌కు పిలుపు

- శార్దూల్‌కు కూడా..
- ఇంగ్లండ్ 'ఎ'తో పోరుకు భారత్ 'ఎ' జట్టు

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌లో పర్యటించే భారత్ 'ఎ' జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ నేతృత్వం వహించనున్నాడు. 18 మందితో కూడిన జట్టును సెలెక్టర్లు శుక్రవారం ప్రకటించారు. రంజీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చిన కరుణ్ నాయర్‌కు చోటు కల్పించారు. ఇంగ్లండ్ 'ఎ'తో ఈనెల 30 నుంచి జరిగే రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో అతను మెరుగైన ప్రదర్శన కనబరిస్తే తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కొచ్చు. కరుణ్‌తో పాటు పేసర్ శార్దూల్ ఠాకూర్‌ను జట్టులో చేర్చారు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. ఇషాన్ కిషన్ రెండో కీపర్‌గా ఉంటాడు. ఇక ఐపీఎల్‌లో సన్‌రైజర్స్, రాజస్థాన్ జట్లు ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవడంతో నితీశ్ కుమార్, ఇషాన్, జైస్వాల్‌ను ఎంపిక చేశారు. చెన్నై కెప్టెన్ రుతురాజ్ ఈ టూర్‌కు అందుబాటులో ఉండనున్నాడు. గిల్, సాయి సుదర్శన్ మాత్రం జూన్ 6 నుంచి జరిగే రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటారు. అలాగే భారత్ 'ఎ' జూన్ 13 నుంచి నాలుగు రోజుల మ్యాచ్‌లోనూ తలపడనుంది.

భారత్ 'ఎ' జట్టు: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, కరుణ్, జురెల్, నితీశ్ కుమార్, శార్దూల్, ఇషాన్, సర్ఫరాజ్, ముకేశ్, తుషార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, కాంబోజ్,ఖలీల్, తుషార్, హర్ష్ దూబే, సుతార్, గిల్, సుదర్శన్ (వీరిద్దరూ రెండో మ్యాచ్‌కు).

పోలవరంపై 28న ప్రధాని సమీక్ష

» వర్చువల్ విధానంలో హాజరుకానున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సీఎంలు

హైదరాబాద్, అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి సమీక్ష జరుపనున్నారు. ఈ నెల 28వ తేదీన ఆంధ్ర, తెలంగాణ సీఎంలతో పాటు ఒడిసా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు, ఆయా రాష్ట్రాల జల వనరుల మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ముంపుపై అభ్యంతరాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లే అవకాశాలున్నాయి. దీనిపై ఆయన ఎలా స్పందిస్తారోనన్న ఆసక్తి నెలకొంది.

తెలంగాణ అభ్యంతరాలు ఇవే

పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. బ్యాక్ వాటర్ ముంపు ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతోంది. ఏపీ అందించిన డేటా ప్రకారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెనువెంటనే క్షేత్రస్థాయిలో సర్వే చేసి, వాస్తవాలు నిగ్గుతేల్చి, రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ కోరుతోంది. సీడబ్ల్యూసీ నివేదికను అనుసరించి ఎన్‌జీటీ ఇచ్చిన తీర్పు ప్రకారం కిన్నెరసాని, ముర్రేడువాగుల ప్రవాహాలపై గోదావరి బ్యాక్ వాటర్ వల్ల పడే ప్రభావం అంచనా వేసి, పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు నివారణకు రక్షణ చర్యలు తీసుకోవాలని, రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని కోరుతోంది. భద్రాచలంలో నీటి నిల్వలను పరిశీలించాలని, చారిత్రక భద్రాద్రి ఆలయం, మణుగూరు భారజల ప్లాంట్ రక్షణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

కాళేశ్వరం బ్యారేజీలకు పరీక్షలు చేయించండి

» వానాకాలంలోపు పూర్తి చేసి నివేదికలు తెప్పించండి

» ఎస్‌ఎల్‌బీసీలో డీబీఎంకు చర్యలు చేపట్టండి: ఉత్తమ్



హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సిఫారసులకు అనుగుణంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు కేంద్ర సంస్థలతో భూ సాంకేతిక(జియో టెక్నికల్), భూ భౌతిక(జియో ఫిజికల్) పరీక్షలను వెంటనే చేయించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వానాకాలంలోపే పరీక్షలన్నీ పూర్తిచేయించి, నివేదికలు తెప్పించుకోవాలని నిర్దేశించారు. శుక్రవారం జలసౌధలో నీటి పారుదల శాఖ అధికారులతో ఉత్తమ్ సమావేశమయ్యారు. మేడిగడ్డ బ్యారేజీలో సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రిసెర్చ్ స్టేషన్(సీఎస్‌ఎంఆర్‌ఎస్-ఢిల్లీ)తో.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్‌ఎస్-పుణె)తో పరీక్షలు చేయించాలని నిర్దేశించారు. ఆయా సంస్థలకు లేఖలు రాసి, సకాలంలో పరీక్షలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కాగా, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్‌ఎల్‌బీసీ) ఇన్‌లెట్(దోమలపెంట-శ్రీశైలం) వైపు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం(డీబీఎం)లో టన్నెల్ తవ్వకం చేపట్టడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. దీనికోసం నిర్మాణ సంస్థ ప్రతినిధులను పిలిపించాలని నిర్దేశించారు. ఇన్‌లెట్ వైపు నుంచి 13.9 కి.మీ. తవ్వాక ఫిబ్రవరిలో సొరంగం కూలిపోయి టన్నెల్ బోరింగ్ మెషీన్(టీబీఎం) పూర్తిగా ధ్వంసమైంది. మళ్లీ టీబీఎంను వాడే అవకాశాలు లేకపోవడంతో తక్షణమే డీబీఎం విధానంలో టన్నెల్ తవ్వకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు.

ఎస్‌ఆర్‌బీసీ నీటి కేటాయింపులను సమీక్షించాలి

» కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదన

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రైట్ బ్యాంకు కెనాల్(ఎస్‌ఆర్‌బీసీ)కి నీటి కేటాయింపులను బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఆధారంగా సమీక్షించాలని కృష్ణా ట్రిబ్యునల్-2ను తెలంగాణ కోరింది. తెలంగాణలో పలు ప్రాజెక్టుల కింద 'పర్ డ్రాప్-మోర్ క్రాప్' జాతీయ పాలసీ ఆధారంగా ఒక టీఎంసీ నీటితో 12,800 ఎకరాలకు సాగు నీరు ఇచ్చే విధానాన్ని అనుసరిస్తుండగా... ఏపీలో ప్రాజెక్టుల కింద మాత్రం ఒక టీఎంసీ నీటితో 8400 ఎకరాలకు మాత్రమే సాగునీరు ఇస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయని, వీటిని సరిచేసి, ఏపీలో పొదుపు చేసే నీటిని తమ ప్రాజెక్టులకు కేటాయించాలని అభ్యర్థించింది. శుక్రవారం న్యూఢిల్లీలోని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-2) ముందు తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ తమ వాదనలు వినిపించారు. తెలంగాణలో లోటు వర్షపాతంతో ఆరు తడి పంటలు మాత్రమే సాగుచేస్తున్నారని, కృష్ణా బేసిన్‌లో నికర జలాలతో 15 శాతం మాత్రమే సాగు ప్రాంతం ఉండగా... అదే ఏపీలో 95 శాతం సాగు ప్రాంతానికి నీరు అందుతుందని నివేదించారు. ఉమ్మడి ఏపీలో మిగిలిన కృష్ణా జలాలను శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్‌ఎల్‌బీసీ)కి కేటాయించాల్సి ఉండగా... ఎస్‌ఆర్‌బీసీకి మళ్లించారని నివేదించారు. అందువల్లే ఎస్‌ఆర్‌బీసీకి కేటాయించిన నీటిని బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఆధారంగా సమీక్షించాలని కోరారు. శుక్రవారంతో తెలంగాణ ఈ దఫా వాదనలు పూర్తయ్యాయి. దాంతో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ జూలై 23వ తేదీకి వాయిదా పడింది. తెలంగాణ తదుపరి వాదనలు జూలై 23-25 తేదీల్లో వినిపించనుంది.

అసెంబ్లీ, మండలి ఒకే చోట

» పార్లమెంటు తరహాలో ఏర్పాట్లు

» పనులను పరిశీలించిన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే వర్షాకాలం సమావేశాలకల్లా అసెంబ్లీ కొత్త రూపు సంతరించుకోనుంది. పార్లమెంటు సెంట్రల్ హాల్ తరహాలోనే.. అసెంబ్లీ, మండలి భవనాలను ఒకే దగ్గర నిర్వహించనున్నారు. అసెంబ్లీ భవనంలో ప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతున్న హాలుతో పాటుగా గతంలో సమావేశాలు జరిగిన హాలు కూడా ఉంది. ఆ హాలులో శాసనమండలి సమావేశాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనమండలిని శాసనసభ భవనంలోకి తరలించేందుకు పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సమాచార హక్కు కమిషనర్‌గా మెర్ల వైష్ణవి

తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషనర్‌గా మెర్ల వైష్ణవిని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. ఇప్పటికే రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లుగా అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్‌లను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా మెర్ల వైష్ణవిని మరో కమిషనర్‌గా నియమించడంతో మొత్తం రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా నియమితులైన వారి సంఖ్య ఐదుగురికి చేరుకుంది.

బిల్లులపై 'సుప్రీం' తీర్పు ఆదర్శం

» వివాదాల సృష్టి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం

» జస్టిస్ జాస్తి చలమేశ్వర్

తిరుపతి(విద్య), మే 16(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన పది బిల్లులకు సమ్మతి తెలపకుండా ఆ రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగ వ్యతిరేక వైఖరి అవలంబించారని, దానికి అడ్డుకట్ట వేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు స్వాగతించదగిందని మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో ఆయన 'ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం' తదితర అంశాలపై ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని, ఫెడరల్ స్వభావాన్ని, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడే విషయంలో సుప్రీం తీర్పు ఆదర్శవంతమైందని పేర్కొన్నారు. అలాంటి తీర్పులను స్వాగతించి, రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా వివాదాలు సృష్టించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని హెచ్చరించారు.

హైదరాబాద్‌లో డేటా సిటీ

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తుగా అంచనా వేసి, అందుకు అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శుక్రవారం ఆయన విద్యుత్తు శాఖపై సమీక్ష చేశారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్తు డిమాండ్ చేరుకుందని, 2025-26లో 18,138 మెగావాట్లకు; 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. "గతంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్తు డిమాండ్ పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే 9.8 శాతం పెరిగింది. ఇది గొప్ప విజయం. అయినా, ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించి ప్రభుత్వం ఆదర్శంగా నిలిచింది. భవిష్యత్తు అంచనాలు, అవసరాలకు తగినట్లుగా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలి. విద్యుదుత్పత్తిని పెంచుకోవాలి. ప్రధానంగా, క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు కేంద్రాలపై దృష్టి సారించాలి. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రానికి వెల్లువెత్తిన పెట్టుబడులు, రాబోయే రోజుల్లో తెలంగాణలో జరగబోయే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు ప్రణాళిక ఉండాలి" అని నిర్దేశించారు. పరిశ్రమలతోపాటు గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, సాగునీటి ప్రాజెక్టులు, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ (మెట్రో, ఎలక్ట్రిక్ వాహనాలు)ను దృష్టిలో ఉంచుకొని పునరుత్పాదక విద్యుత్తుపై దృష్టి సారించాలన్నారు. జలాశయాల్లో తేలియాడే సౌర విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుదుత్పత్తిలో ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలని సూచించారు. ఔటర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు కావాల్సిన విద్యుత్తు అవసరాలపై హెచ్‌ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని విద్యుత్తు అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా సబ్ స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలని, లైన్ల ఆధునీకరణపై దృష్టి సారించాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్తు స్తంభాలు, టవర్లు, లైన్లు బయటకు కనిపించరాదని, పూర్తిగా భూగర్భంలోనే లైన్లు వేయాలని సూచించారు. హైటెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రయోగాత్మకంగా స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని, సచివాలయం, నెక్లెస్ రోడ్డు, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ముందుగా వీటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. 160 కిలోమీటర్ల ఔటర్ పొడవునా సోలార్ విద్యుదుత్పత్తికి వీలుగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేయడానికి ప్రణాళిక ఉండాలని, జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్‌పాత్‌లు, నాలాలపైనా సౌర విద్యుదుత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.



సీఎం రేవంత్‌తో అసదుద్దీన్ కరచాలనం, చిత్రంలో షబ్బీర్ అలీ

హజ్ యాత్రను ప్రారంభించిన సీఎం

హైదరాబాద్ నుంచి మక్కాకు బయలుదేరిన హజ్ యాత్ర ప్రయాణికుల బస్సును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. నాంపల్లి హజ్ హౌస్ నుంచి శుక్రవారం సాయంత్రం ఈ బస్సు విమానాశ్రయానికి బయలుదేరింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



నా వ్యాఖ్యలు వక్రీకరించారు..!

» బీఆర్‌ఎస్ హయాంలో మంత్రులపైనే స్పందించా

» ఎడిటెడ్ వీడియోతో మంత్రుల మధ్య గొడవకు యత్నం

» మంత్రి కొండా సురేఖ వివరణ

హైదరాబాద్/ వరంగల్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): 'ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో మంత్రులు డబ్బులు తీసుకుంటారు' తాను వ్యాఖ్యానించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలపై అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ క్లారిటీనిచ్చారు. వరంగల్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఫైళ్ల క్లియరెన్స్‌పై తాను చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ పెయిడ్ సోషల్ మీడియా వక్రీకరించిందని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ పని చేయడానికైనా అప్పటి మంత్రులు పైసలు తీసుకునే వారంటూ అన్న తన మాటలకు ఇప్పటికీ తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. 'కేసీఆర్ మానసపుత్రిక మిషన్ కాకతీయ పథకంలో అవినీతిని 'కమీషన్ కాకతీయ' అని నాటి మంత్రి నాయిని నర్సింహారెడ్డి బయట పెట్టలేదా..? దళిత బంధు పథకం అమలులో ప్రతి ఎమ్మెల్యే 30శాతం కమీషన్ తీసుకుంటారని అప్పటి సీఎం కేసీఆరే స్వయంగా చెప్పలేదా?' అని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ అద్భుత పాలన చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నేతలు తమ సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎడిటెడ్ వీడియో ఒకటి సర్క్యులేట్ చేసి తమ క్యాబినెట్ సభ్యుల గొడవ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ, వారి ఆశలు నెరవేరబోవన్నారు. సోషల్ మీడియాలో ఇంకోసారి ఇటువంటి దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు.

ఏసీబీ అధికారులు అలాంటి ఫోన్లు చేయరు

అలా ఫోన్ చేస్తే ఫిర్యాదు చేయండి: ఏసీబీ డీజీ

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులమంటూ ఎవరైనా అనుమానాస్పద ఫోన్లు చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీజీ విజయ్ కుమార్ తెలిపారు. బాధితులు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్ 9440446106కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. ఇటీవల కొంత కాలంగా వివిధ శాఖల్లోని ప్రభుత్వ ఉన్నతాధికారులకు కొందరు తాము ఏసీబీ అధికారులమంటూ ఫోన్లు చేసి బెదిరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏసీబీ అధికారులెవ్వరూ ఇటువంటి ఫోన్లు చేయరని ఆయన స్పష్టం చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మే వారిపై ఉక్కుపాదం

» రైతులను మోసం చేస్తే పీడీ యాక్ట్

» టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేయాలి

» వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం



హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగుకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని, విత్తనాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేసే కంపెనీలు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని, అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించాలని, సరిహద్దుల్లో టాస్క్‌ఫోర్స్ నిఘా ముమ్మరం చేయాలని సూచించారు. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు? ఎక్కడ నిల్వలున్నాయి? ఎక్కడి నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలకు సంబంధించి అధికారులకు సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఈ సీజన్లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దాంతో, ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందంటూ వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలన్నారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులను అప్రమత్తం చేశారు. ప్యాక్ చేసిన విత్తనాలు తప్ప విడిగా విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయవద్దని, విత్తన ప్యాకెట్లు కొనేటప్పుడు బిల్లు తీసుకుని పంట కాలం ముగిసే వరకూ భద్రపరుచుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాల బారిన పడి రైతులు మోసపోకుండా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.



తడిసిన ధాన్యాన్నీ కొంటాం రైతులకు అండగా ఉంటాం

ఇప్పటిదాకా 50 లక్షల టన్నులు కొన్నాం

కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉత్తమ్

పాల్గొన్న తుమ్మల, పొన్నం, కోమటిరెడ్డి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ధాన్యం కొనుగోలు పురోగతిపై శుక్రవారం ఆయన సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్, డైరెక్టర్ ప్రసాద్‌తో పాటు మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు. యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 60.14 లక్షల ఎకరాలు సాగు చేయగా ధాన్యం దిగుబడి అంచనా 130 లక్షల టన్నుల వరకు ఉంటుందన్నారు. 70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. 2022-23 రబీ సీజన్‌లో మే 15 నాటికి 25.35 లక్షల టన్నులు కొనుగోలు చేయగా.. 2023-24లో అదే సమయానికి 32.93 లక్షల టన్నులు కొన్నామని.. ఈ ఏడాదిలో 50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. పెరిగిన ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 8,348 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో అదనంగా 1,311 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో రానున్న 10-12 రోజులు కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉత్తమ్ సూచించారు. ఇప్పటికే 71 శాతం మేర కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ధాన్యం కొనుగోలుపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నివారించేలా చర్యలు చేపట్టి, రైతులకు భరోసా కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాన్ని అడ్డుకొని, ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని కలెక్టర్లకు సూచించారు. తెల్ల రేషన్ కార్డుల అంశంపై స్పందిస్తూ.. అర్హులైన వారి దరఖాస్తుల పరిశీలన తుది దశకు చేరిందని ఉత్తమ్ తెలిపారు.

సాదాబైనామా సమస్యలకు పరిష్కారం

భూ భారతి ట్రిబ్యునల్ ఏర్పాటు.. తహసీల్దార్ నుంచి సీసీఎల్‌ఏ వరకు ఐదంచెల వ్యవస్థ

» పట్టాదారు పాసు పుస్తకంలో భూ కమతాల మ్యాపులు

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

» నిర్మల్, ఆసిఫాబాద్, రుద్రంగిలో రెవెన్యూ సదస్సులు

» పాల్గొన్న మంత్రులు సీతక్క, పొన్నం



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మంత్రి మాట్లాడుతూ.. భూ భారతి చట్టం అమలులో భాగంగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, ఆపై ట్రిబ్యునల్ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థను భూ భారతి చట్టంలో రూపొందించినట్లు వెల్లడించారు. ఈ చట్టం వల్ల భూ సమస్యల పరిష్కారం వేగంగా జరగడమే కాక, రైతులకు నమ్మకమైన భూ సమాచారం అందుతుందని మంత్రి పేర్కొన్నారు. భూయజమానుల భూ కమతాలకు మ్యాపులను పట్టాదారు పాసు పుస్తకంలో ముద్రించి ఇస్తామని తెలిపారు. మండలాల్లో ఆరు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను అధికారికంగా నియమిస్తున్నామని ప్రకటించారు. దీంతో భూముల హద్దుల గుర్తింపు సులభతరం అవుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరో వెయ్యిమంది సర్వేయర్లను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారులను కూడా నియమిస్తామన్నారు. అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. భూభారతి నాలుగు పైలెట్ మండలాల్లో 13 వేల దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 30వ తేదీలోగా పరిష్కరించదగిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పెద్దలు స్వార్థపూరితంగా నాలుగు గోడల మధ్య ఎవరి అభిప్రాయాలు తెలుసుకోకుండా ధరణి చట్టం తయారుచేశారన్నారు. ప్రజా ప్రభుత్వంగా దేశంలోనే 18 రాష్ట్రాల్లో 20 చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని భూ భారతి చట్టం తయారుచేశామని అన్నారు. భూ సరిహద్దులతోపాటు భూమి కొలతలు పూర్తిగా ఉండే విధంగా రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళా సంఘాలను ప్రోత్సహిస్తూ వివిధ రకాల వ్యాపార యూనిట్లకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు.

ఏపీలో లిక్కర్ 'బాసుల' అరెస్టు!

» ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి బేడీలు

» ఇద్దరూ వైఎస్ జగన్ మనుషులే

» అరెస్టు తప్పించుకునే యత్నాలు

» హైకోర్టు, సుప్రీంకోర్టులో చుక్కెదురు

» ముందస్తు బెయిల్ ఇవ్వలేమన్న సుప్రీం

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. వరుసగా మూడురోజులు రిటైర్డు ఐఏఎస్ అధికారి, మాజీ సీఎం వైఎస్ జగన్ మాజీ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, మాజీ సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని విచారించిన సిట్ అధికారులు శుక్రవారం పొద్దుపోయాక వారిద్దరిని అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడున్నర వేల కోట్ల రూపాయల స్కామ్‌లో నిందితులిద్దరికీ జైలు ఊచలు లెక్కించక తప్పని పరిస్థితి ఏర్పడింది. స్కామ్‌లో కింగ్ పిన్‌గా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి(ఏ1), వాసుదేవ రెడ్డి(ఏ2), విజయసాయి రెడ్డి(ఏ4), మిథున్ రెడ్డి(ఏ6)తో కలిసి అన్ని స్థాయిల్లోనూ సమావేశమై ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప (భారతి సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్, చార్టర్డ్ అకౌంటెంట్) చర్చలు జరిపారు. స్కామ్‌కు సంబంధించి ఆధారాలు సేకరించిన సిట్ అధికారులు వీరు ముగ్గురిని వరుసగా ఏ31, ఏ32, ఏ33గా నిందితుల జాబితాలో చేర్చారు. ఈ నెల 11న ఆదివారం ఉదయం విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాల్సిందిగా హైదరాబాద్‌లోని వీరి ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేశారు. అప్రమత్తమైన ముగ్గురూ మొదట హైకోర్టును ఆ తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించినా ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టులో దాఖలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సిట్ అధికారులు టెక్నాలజీ సాయంతో బాలాజీ గోవిందప్పను కర్ణాటకలో ఈ నెల 13న పట్టుకున్నారు.

ముందస్తు బెయిల్ ఇవ్వలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ మద్యం కుంభకోణం కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మద్యం కుంభకోణంలో వారిద్దరికీ వ్యతిరేకంగా సాక్ష్యాలు ఉన్నట్టు ప్రాథమికంగా అర్థమవుతోందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ముందస్తు బెయిల్‌కు తొలుత హైకోర్టు నిరాకరించడంతో ఆ తీర్పును ఈ ఇద్దరూ మే 2న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ, సిద్దార్థ్ లూత్రా, సిద్దార్థ్ అగర్వాల్, కృష్ణమోహన్ రెడ్డి తరఫున అభిషేక్ మనుసింఘ్వి, ధనుంజయ్‌రెడ్డి తరఫున వికాస్‌సింగ్, బాలాజీ గోవిందప్ప తరఫున సిద్దార్థ్ దవే హాజరయ్యారు. పిటిషనర్ల తరఫున మనుసింఘ్వి వినిపించిన వాదనలపై రోహత్గీ అభ్యంతరం తెలిపారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వడం ద్వారా కేసుపై ప్రభావం పడుతుందని అన్నారు. కేసు విచారణ కీలక దశలో ఉన్న నేపథ్యంలో ముందస్తు బెయిల్ ఇస్తే.. విచారణాధికారి చేతులు కట్టేసినట్టు అవుతుందని ధర్మాసనం అభిప్రాయ పడింది. అయితే, వారిపై రాష్ట్రం ఎటువంటి థర్డ్ డిగ్రీ పద్ధతులను ప్రయోగించకూడదని తెలిపింది.



ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను పరామర్శిస్తున్న ప్రపంచ సుందరి పోటీదారులు

ఐసీయూలో పిల్లలతో..



పాలమూరులోని పిల్లలమర్రి వద్ద బతుకమ్మ ఆడుతున్న అందగత్తెలు



అందాల భామల ముచ్చట్లు!

ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను పరామర్శించిన ప్రపంచ సుందరి పోటీదారులు



హైదరాబాద్ సిటీ/ మహబూబ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల కోసం వచ్చిన అందాల భామలు శుక్రవారంగచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. ఆస్పత్రిలో పిల్లల ఐసీయూ వార్డును సందర్శించి.. కాలేయ, జీర్ణకోశ తదితర సమస్యలతో బాధపడుతున్న పిల్లలను పలకరించారు. వారి పేరు, చదువు, ఇతర వివరాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్వీట్లు, బహుమతులు అందజేశారు. ఆ పిల్లల జబ్బులు, అందుతున్న చికిత్స వివరాలను వైద్యుల నుంచి తెలుసుకున్నారు. అంతకుముందు ఆస్పత్రికి వచ్చిన సుందరీమణులకు ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి బతుకమ్మలను అందించి స్వాగతం పలికారు. వారు ఏఐజీ ఆస్పత్రిలో అత్యాధునిక ఎండోస్కోపీ సౌకర్యాలు, ఇన్నోవేషన్ సెంటర్, క్లినికల్ స్కిల్ ల్యాబ్, రీసెర్చ్ ల్యాబ్, ఆధునిక అంకాలజీ, పిల్లల సంరక్షణ విభాగాలను పరిశీలించారు. వాటి పనితీరును డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. రక్తంలో చక్కెర స్థాయిలు జన్యుపరమైన అంశాలపైనా ఆధారపడి ఉంటాయని తమ పరిశోధనలో తేలిందని ఆయన తెలిపారు. జీర్ణవ్యవస్థలోని మైక్రోబియం మన మెదడును, గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని వివరించారు. ప్రస్తుతం రక్తంలో చక్కెరను ఎప్పటికప్పుడు కొలిచే ప్యాచ్‌లు వచ్చాయని తెలిపారు. ఇక మహిళల ఆరోగ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే.. కుటుంబం, సమాజం అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఏఐసీ ఆస్పత్రి వైద్య రంగంలో కృత్రిమ మేధ (ఏఐ)ను వినియోగించడాన్ని సుందరీమణులు ప్రశంసించారు. ఇలాంటి సదుపాయాలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రావాల్సి ఉందన్నారు.

ప్రపంచ సుందరి పోటీల కోసం వచ్చిన అందాల భామలు ఎక్స్‌పీరియం పార్క్‌లో సందడి చేశారు. సూర్యాస్తమయ (సన్ సెట్) పాయింట్ వద్ద ప్రారంభమైన వీరి సందర్శన.. బుద్ధ ట్రీ, చెట్లతోనే సహజసిద్ధంగా తీర్చిదిద్దిన కుర్చీలు, జపనీస్ గార్డెన్ మీదుగా సాగింది. పార్క్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ల వద్ద ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకున్నారు. భిన్నమైన మొక్కలు, చెట్లను, తమ సహచర పోటీదారులను కెమెరాల్లో బంధించారు.

పిల్లలమర్రి వద్ద సందడి

ఏడు శతాబ్దాల చరిత్ర కలిగిన పాలమూరులోని పిల్లలమర్రి వద్ద అందాల భామలు శుక్రవారం సాయంత్రం సందడి చేశారు. తొలుత రాజరాజేశ్వర ఆలయంతోపాటు, పురావస్తు నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి నిర్వహిస్తున్న మ్యూజియాన్ని సందర్శించారు. తర్వాత పిల్లలమర్రి ప్రాంగణానికి చేరుకున్నారు. వారికి చెట్టు విశిష్టతను అటవీ అధికారులు వివరించారు. ఆ ప్రాంగణంలో అందాల భామలు బతుకమ్మ ఆడారు. మొక్కలు నాటారు. కూచిపూడి, భరతనాట్యం, బంజారా నృత్యాలను వీక్షించారు. తామూ కాలు కదిపారు. హస్తకళలు, చేనేత స్టాళ్లను సందర్శించారు. పలువురు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వందల ఏళ్ల నుంచి మర్రిచెట్టును కాపాడుకోవడం గొప్ప విషయమని.. ఈ చరిత్రను ప్రపంచం మొత్తం ప్రచారం చేస్తామని చెప్పారు. ఇక డీహైడ్రేషన్‌తో మిస్ చైనా సుందరి అస్వస్థతకు గురికాగా.. ఓఆర్ఎస్ నీళ్లు తాగి, కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. కాగా.. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. తెలంగాణ పర్యాటకానికి ప్రపంచ సుందరి పోటీదారులే బ్రాండ్ అంబాసిడర్లని చెప్పారు. ఇక్కడి పర్యాటక ప్రాంతాలపై ప్రచారం చేయాలని అందాల భామలను కోరారు. పోటీలు ముగిసిన వెంటనే వెళ్లిపోకుండా.. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడి చరిత్ర, సంస్కృతిని తమ దేశాల్లో ప్రచారం చేయాలని అందాల పోటీదారులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు.



పిల్లలమర్రిలో అందగత్తెలు పర్యటన సందర్భంగా కళాకారుల నృత్యరూపకం

ఎకో పార్క్‌లో ఉత్సాహంగా..

ప్రపంచ సుందరి పోటీలో ఉన్న అందాల భామలు.. హైదరాబాద్ శివార్లలోని ప్రొద్దుటూరులో ఉన్న ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను సందర్శించారు. బ్యాటరీ వాహనాల్లో పార్కు మొత్తం కలియదిరిగారు. దాదాపు 150 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్క్‌లో ఎన్నో దేశాలకు చెందిన 25వేలకుపైగా రకాల మొక్కలు ఉన్నాయి. వాటిని ఆసక్తిగా పరిశీలించారు. తమ దేశాల మొక్కలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. పార్క్‌లో సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్న చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఈజిప్షియన్ రాక్ స్పాట్ వద్ద నాటు నాటు పాటకు ఉత్సాహంగా కాలు కదిపారు. పార్క్ అద్భుతంగా ఉందని కొనియాడారు. భావితరాల భవిష్యత్ కోసం ప్రకృతిని కాపాడాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.



ఎకోపార్క్‌లో అందాల భామల సందడి

పార్క్ సందర్శన సమయంలో పంజాబీ డోలు బృందంలోని ఓ కళాకారుడి అత్యుత్సాహం అవాక్కయ్యేలా చేసింది. డోలు వాయిస్తున్నప్పుడు.. అందాల భామలు ఉత్సాహంగా నృత్యం చేశారు. ఓ కళాకారుడు మిస్ వరల్డ్ బొలీవియా ఓల్గా ఛావెజ్‌ను తన డోలుపై కూర్చోబెట్టుకున్నాడు. అధికారులు ఆ బృందాన్ని మందలించి, కళాకారులను బయటికి పంపారు.



ఎకోపార్క్‌లో సుందరీమణుల నృత్యం

3 బృందాలుగా.. 3 చోట్లకు..

తెలంగాణలో పర్యాటకానికి మిస్ వరల్డ్ పోటీలతో ఊపు తీసుకురావాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు వీలుగా అందాల భామల పర్యటనలకు ప్రణాళిక రూపొందించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం.. ప్రపంచ సుందరి పోటీదారులను మూడు బృందాలుగా మూడు ప్రాంతాలకు తీసుకెళ్లారు. రాష్ట్రంలో వైద్య పర్యాటకం, అందుబాటులో మంచి వైద్యం, ఆరోగ్య సంస్కరణలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు.. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిని 37 మంది అందాల భామలతో కూడిన ఒక బృందం సందర్శించింది. ఇక మహబూబ్‌నగర్‌లో వందల ఏళ్ల చరిత్ర ఉన్న 'పిల్లలమర్రి' వద్ద 22 మందితో కూడిన మరో బృందం పర్యటించి, అక్కడ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంది. 20 మందితో కూడిన మూడో బృందం హైదరాబాద్ శివార్లలోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను సందర్శించింది.



గురువారం భూదాన్ పోచంపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్వాతి

అందాల భామలకు అందమైన డ్రెస్సులు

చేనేతకు ఆధునిక శైలి

అలరించిన తెలుగు డిజైనర్ దుస్తులు



ఎం.స్వాతి

వికారాబాద్, మే 16 ఆంధ్రజ్యోతి: సంప్రదాయ చేనేత బట్టలకు ఆధునిక శైలిలో రూపొందించి మిస్ ఇండియా వంటి అంతర్జాతీయ ఈవెంట్‌లో తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించారు డిజైనర్ స్వాతి. ప్రత్యేకంగా పోచంపల్లి, నారాయణపేట వంటి చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాల్ని వాడి ఆమె రూపొందించిన దుస్తులు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. ప్రపంచ అందాల పోటీల్లో భాగంగా భూదాన్ పోచంపల్లిలో ముద్దుగుమ్మలకు డ్రెస్సులు రూపొందించిన స్వాతి వికారాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు మఠం వైద్యనాథ్ కూతురు. ఆమె ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌లో మైరీతి, తరం పేరుతో డిజైనర్ స్టోర్స్ ఏర్పాటు చేసి ఎంతోమంది సెలబ్రిటీలతో కలిసి పనిచేశారు. ఈ క్రమంలోనే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న ముద్దుగుమ్మలకు దుస్తులను రూపొందించే అవకాశం వచ్చింది. సంప్రదాయ వస్త్రాలకు ఆధునికతను జోడిస్తూ దుస్తులు రూపొందించడానికి నెల రోజులు కష్టపడ్డారు. గురువారం జరిగిన కార్యక్రమంలో అందాల భామలు ఈ డ్రెస్‌లు ధరించి అందరిని అలరించారు.

ఒంటరి మహిళ దారుణ హత్య

మేడ్చల్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా అద్దె ఇంట్లో ఉంటున్న ఓ మహిళను దుండగులు కిరాతకంగా హతమార్చారు. ముక్కు, చెవి, గొంతు కోసి హతమార్చి మృతదేహానికి నిప్పంటించి పారిపోయారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం వికారాబాద్‌కు చెందిన దాసరి లలిత అలియాస్ లక్ష్మి(50) మేడ్చల్ మునిసిపల్ పరిధిలోని వెంకటరమణ వైన్‌షాపులో స్వీపర్‌గా పని చేస్తూ అత్వేల్లిలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. గురువారం తెల్లవారుజామున లక్ష్మి గది నుంచి పొగలు రావటం గమనించిన ఇంటి యజమాని అనుమానంతో గదిలోకి వెళ్లాడు. లక్ష్మి మృతదేహం కాలుతున్న స్థితిలో కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులొచ్చి ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పైసలిస్తామన్నా.. పట్టించుకోలే

అందాల పోటీల స్పాన్సర్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పర్యాటక సంస్థ ఈడీ బదిలీ

- ఎక్సైజ్ శాఖలో రిపోర్టు చేసిన విజయ్
- రాబడి 3 కోట్ల నుంచి 30లక్షలకు పడిపోవడంపైనా
- విచారణకు ఆదేశించిన సర్కారు!
- 'మిస్ వరల్డ్' తర్వాత పర్యాటక సంస్థ ప్రక్షాళన

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు (ఈడీ) సిహెచ్.విజయ్‌పై వేటు పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను మాతృ శాఖ అయిన ఎక్సైజ్ శాఖకు బదిలీ చేసింది. దీంతో కొద్ది రోజులుగా సంస్థ ఎండీ, ఈడీల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరుకు తెర దించినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలకు సహకారం అందించేందుకు ముందుకొచ్చిన యాజమాన్యాలు, సంస్థల ప్రతినిధులను సమన్వయం చేయడంలో పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, ఈడీ విజయ్ బాధ్యతారహితంగా వ్యవహరించారనే ఫిర్యాదులు వచ్చాయి. విజయ్ డిప్యుటేషన్‌పై పర్యాటక అభివృద్ధి సంస్థ ఈడీగా ఎనిమిది నెలలుగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీల బాధ్యతలను పర్యాటక శాఖకు అప్పగించింది. సుమారు 22 రోజుల పాటు రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రాయోజకులుగా ఉంటామంటూ పలు కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థలు, జాతీయ బ్యాంకులు ముందుకు వచ్చాయి. అయా సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకొని, కార్యాచరణ ఖరారు చేసే బాధ్యతలను ప్రభుత్వం పర్యాటకాభివృద్ధి సంస్థకు అప్పగించింది. అయితే సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలు, సంస్థ కార్యకలాపాల నిర్వహణపై ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఈడీ విజయ్ మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సర్దుకుపోవాలని ఇద్దరికీ సూచించినట్లు తెలిసింది. అదే సమయంలో మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణకు నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చిన సంస్థల ప్రతినిధులు ఎండీ ప్రకాశ్‌రెడ్డిని సంప్రదించగా.. ఆయన ఈడీ విజయ్‌ను కలవాలని సూచించినట్లు తెలిసింది. ప్రతినిధులతో ఆయన సంప్రదింపులు జరిపినప్పటికీ స్పష్టమైన కార్యాచరణ, స్పాన్సర్‌షిప్‌కు అవకాశం ఉన్న కార్యక్రమాలపై సమాచారం ఇవ్వకుండా జాప్యం చేసినట్లు సమాచారం. ఫలితంగా పోటీలను స్పాన్సర్ చేయలేమంటూ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, బ్యాంకర్లు వెళ్లిపోయారు. మిస్ వరల్డ్ పోటీలకయ్యే రూ.27 కోట్ల ఖర్చులో సుమారు 25 కోట్ల వరకు స్పాన్సర్ల ద్వారా సమకూరుతుందని సర్కారు భావించింది. అయితే పర్యాటక సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో స్పాన్సర్లు వెనక్కి వెళ్లిన విషయం సీఎం రేవంత్‌కు తెలిసింది. దీనిపై వివరణ కోరగా ఈడీ నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఎండీ ప్రకాశ్‌రెడ్డి నివేదించినట్లు సమాచారం. ఈడీ విజయ్‌ను బదిలీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో విజయ్ మంత్రి జూపల్లి ద్వారా వెళ్లి సీఎంను కలిసి.. తనను అడుగడుగునా అడ్డుకుంటున్నారంటూ ప్రకాశ్‌రెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ప్రకాశ్‌రెడ్డిని మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించిన సర్కారు.. ఆ పనులను విజయ్‌కు అప్పగించింది. కాగా.. ఇటీవల పర్యాటక సంస్థలో జరుగుతున్న కార్యకలాపాలు, రవాణా విభాగంలో అత్యవసర బిల్లుల చెల్లింపులు, ఉద్యోగులు, అధికారుల మధ్య జరుగుతున్న ఘర్షణలను తెలుసుకున్న ప్రభుత్వం.. ఈడీ విజయ్‌ను తక్షణమే వైదొలగాలని ఆదేశించింది. ఆయన గురువారం సాయంత్రం బాధ్యతల నుంచి తప్పుకొని ఎక్సైజ్ శాఖలో రిపోర్టు చేసినట్లు తెలిసింది. పర్యాటక సంస్థలో గత ఏడాదిగా ఆదాయం రూ.3 కోట్ల నుంచి 30 లక్షలకు పడిపోవడం పైనా ప్రభుత్వం విచారణకు ఆదేశించినట్లు సమాచారం. మిస్‌వరల్డ్ పోటీల తర్వాత పర్యాటక సంస్థ కార్యకలాపాలను సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

హైదరాబాద్ పోలీసులకు అరుదైన గౌరవం

డ్రగ్స్ నిర్మూలనలో కృషికి 'నార్కోటిక్ వింగ్'కు అంతర్జాతీయ అవార్డు..



దుబాయ్‌లో నిర్వహించిన వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో అవార్డు అందుకుంటున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీసులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. మాదక ద్రవ్యాలపై పోరు, నియంత్రణ, అవగాహన కార్యక్రమాలతోపాటు బాధితుల పునరావాసానికి చేసిన కృషికి గానూ హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ)కు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. శుక్రవారం దుబాయ్‌లోని పోలీస్ ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కోటిక్స్' అవార్డును పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అందుకున్నారు. 138 దేశాలకు చెందిన పోలీసులు ఈ అవార్డు కోసం పోటీపడగా.. హైదరాబాద్ పోలీసులు తొలిస్థానంలో నిలిచి సత్తా చాటారు. దీనిపై సీవీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఈ అవార్డును సాధించడంలో బృంద సభ్యుల కృషి ఎంతో ఉందని.. అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో మరిన్ని మైక్రో బ్రూవరీలు

- హైదరాబాద్‌తో పాటు జిల్లాలకు విస్తరించే యోచన!

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పబ్బులు, క్లబ్బులకే పరిమితమైన మైక్రో బ్రూవరీలు త్వరలో జిల్లాల్లోనూ అందుబాటులోకి రాబోతున్నాయి. ఇప్పటి వరకు పరిమితంగా ఉన్న మైక్రోబ్రూవరీలను విస్తృతం చేయబోతోంది తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ. లోకల్ బ్రాండ్లతో తయారు చేసి బీర్ ప్రియులకు ఇక తాజాగా డ్రాట్ బీరు అందించనుంది. అందుకు సంబంధించిన కసరత్తు ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ అధికారులు మొదలు పెట్టారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాల తయారీలో నిమగ్నమయ్యారు. మైక్రోబ్రూవరీల ఏర్పాటు వల్ల ఆదాయం పెంచుకోవచ్చునని ఎక్సైజ్‌శాఖ యోచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1171 బార్లు ఉన్నాయి. ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన బార్లతో కలిపితే ఈ సంఖ్య పెరగనుంది. వీటితో పాటు హైదరాబాద్, శంషాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 55కిపైగా పబ్బులున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో 18వరకు మైక్రోబ్రూవరీలు నడుస్తున్నాయి. వీటి వార్షిక బీరు ఉత్పాదకశక్తి సుమారు 18 లక్షల బల్క్‌లీటర్లకుపైనే. దేశంలో ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, పుణెలో మైక్రోబ్రూవరీలు ఎక్కువగా ఉన్నాయి. అక్కడి తరహాలోనే గ్రేటర్ హైదరాబాద్‌లో 2015లో ఏర్పాటుచేయాలనే డిమాండ్ రావడంతో అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని 2016లో 50 కంపెనీలు పోటీపడుతూ దరఖాస్తు చేసుకోగా.. 18 కంపెనీలకు మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు అవకాశమిచ్చారు. ఆ తర్వాత కూడా మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు డిమాండ్ పెరుగుతూనే వచ్చింది. రాష్ట్రంలో 2025-26లో రూ.27,623 కోట్లు రాబట్టాలని ఎక్సైజ్‌శాఖకు ప్రభుత్వం లక్ష్యం నిర్ణయించడంతో బార్లు ఏర్పాటుతో పాటు కొత్త బ్రాండ్‌ల మద్యం తీసుకరావడానికి ప్రయత్నిస్తుంది. ఇప్పటికే బీరు ధరలు పెంచగా.. మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఆదాయం రాబట్టుకోవడంలో భాగంగా ఈ ఏడాదిలో బెంగళూరు తరహాలో రాష్ట్రంలో మైక్రోబ్రూవరీల ఏర్పాటును తెర మీదకు తీసుకొచ్చారు. అక్కడ 100 వరకు ఉండగా.. రాష్ట్రంలో కొత్తగా కనీసం 50వరకైనా ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వీటిని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే కాకుండా మిగిలిన ప్రాంతాల్లోనూ వ్యాపారుల నుంచి అధిక డిమాండ్ వస్తోంది. వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండలోనూ మైక్రోబ్రూవరీల సంస్కృతిని విస్తరించడానికి అధికారుల పరిశీలన జరుగుతోంది. కొత్తగా బ్రూవరీలు అందుబాటులోకొస్తే దరఖాస్తు రుసుము, వ్యాట్, అమ్మకం పన్నుల వంటి ఆదాయం సమకూరనుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎక్సైజ్ శాఖ సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంది. ప్రభుత్వ ఆమోదం తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

ఆకట్టుకునేలా సదుపాయాలు

మైక్రోబ్రూవరీల్లో వివిధ రకాలైన ఫ్లేవర్స్ కలిగిన బీరు లభిస్తుంది. వాస్తవానికి లిక్కర్ ఎన్ని సంవత్సరాలు నిల్వ ఉంటే అంత ఎక్కువ విలువ పెరుగుతుంది. కానీ.. బీరును ఎంత ఫ్రెష్‌గా తాగితే అంత టేస్ట్ ఉంటుందని మందుబాబులు చెప్పే మాట. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఏ బీర్ అయినా.. బ్రూవరీల్లో తయారయ్యేదే. రసాయనాలు కలిపినా.. మూడునాలుగు నెలలకు మించి నిల్వ ఉండదు. కానీ.. మైక్రోబ్రూవరీస్‌లో లభించే డ్రాట్ బీరును ఎలాంటి సీసాలు, క్యాన్లలోను నింపరు. చిన్నచిన్న యంత్రాలు, ఉన్నచోటే తయారు చేస్తారు. లేదా దగ్గరలోని బ్రూవరీల్లో తయారు చేసి గంటల వ్యవధిలోనే కావాల్సిన చోటుకు బేరర్స్‌లో తరలిస్తారు. ఆ బీర్‌ను మగ్గుల్లో పట్టుకుని అప్పటికప్పుడే తాగడానికి ఆసక్తి చూపుతారు. తక్కువ ధరకు ఇవి లభిస్తుండటంతో బీర్ ప్రియులు తమకు ఇష్టమైన బ్రూలను ఆస్వాదిస్తారు. బీర్ ప్రియులను ఆకర్షించేలా వీటిలో విశాలమైన కిచెన్, డైనింగ్, పార్కింగ్, ఎక్కువ స్థలం కలిగి ఉండేలా ఏర్పాటు చేసి ఎక్కువ మంది వచ్చేలా ప్రయత్నిస్తారు.

ఏపీ ఈసెట్‌లో సిద్దిపేట విద్యార్థులకు టాప్ ర్యాంకు


రేవతి


నవ్య

మిరుదొడ్డి, మే 16 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా విద్యార్థులు ఇంజనీరింగ్ (బీటెక్) ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు నిర్వహించిన ఏపీ ఈసెట్-2025లో సిద్దిపేట జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి మొదటి, రెండో ర్యాంకులను దక్కించుకున్నారు. గురువారం విడుదల చేసిన ఏపీ ఈసెట్ -2025 ఫలితాల్లో ఈసీఈ విభాగంలో జిల్లాలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కంట్లె రేవతి రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును సాధించారు. మొత్తం 200 మార్కులకు గాను ఆమె 169 మార్కులు పొందారు. ఇదే గ్రామానికి చెందిన నర్సింలు చెన్నవ్వల కుమార్తె నవ్య ఇదే విభాగంలో 155 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు. ఇప్పటికే వీరిద్దరూ సికింద్రాబాద్‌లోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్‌లో ఈసీఈ చదువుతున్నారు. ఐఏఎస్‌లు కావడమే తమ లక్ష్యమని రేవతి, నవ్య ఈ సందర్భంగా తెలిపారు.

40 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

కొడంగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్‌లో 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు కలిసి పట్టుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్ శుక్రవారం దాడులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వ్యవసాయ శాఖ అధికారి తులసి, ఎస్సై జీవీ సత్యనారాయణ పోలీసు సిబ్బందితో కలిసి అంగడిరైచూర్ గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన మల్లారి పెద్ద మల్లప్ప ఇంట్లో 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. మల్లప్పను విచారించగా కర్ణాటకకు చెందిన ఎర్రప్పనేని కొండప్ప నాయుడు, మంగలి వెంకటయ్య నుంచి విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిపాడు. పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాల విలువ దాదాపు రూ.40 లక్షలు ఉంటుందని డీఎస్పీ పేర్కొన్నారు.

పసుపు రైతులకు న్యాయమైన ధర అందటం లేదు

- పసుపు బోర్డు ఏర్పాటు చేసినా లాభం లేదు: కోదండరెడ్డి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసినా రైతులకు న్యాయమైన ధర అందడం లేదని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర సాంగ్లి, కేరళలోని ఎరోడ్ మార్కెట్లలో ధర ఎక్కువగా వస్తున్నదని, తెలంగాణలో మాత్రం తక్కువగా ఉందన్నారు. రైతులకు కురుకుమిన్ శాతం ఎక్కువగా ఉండే విత్తనాలు అందించాలని రాష్ట్ర ఉద్యాన శాఖకు సూచించినట్లు తెలిపారు. పసుపు సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆధునిక యంత్రాలు అందించాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందని సూచించారు.

132 కిలోల మత్తుపదార్థాల పట్టివేత కేసులో బెయిల్ ఇవ్వలేం: హైకోర్టు

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం (ఎన్డీపీఎస్ యాక్ట్) ప్రకారం 100 గ్రాములకు మించి మత్తుపదార్థాలు కలిగి ఉండడం తీవ్రమైన నేరమని హైకోర్టు తెలిపింది. 132 కిలోల ఆల్ప్రాజోలం అనే మత్తుపదార్థాన్ని ఉత్పత్తి చేసిన కేసులో దోషిగా తేలిన పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లా జిన్నారం అనంతారం గ్రామంలోని వెంకటరాఘవ ల్యాబ్స్‌లో బండారు హనుమంత్‌రెడ్డి, వాసంశెట్టి నరేశ్ మరికొంత మందితో కలిసి ఆల్ప్రాజోలంను ఉత్పత్తి చేస్తున్నారనే సమాచారంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు 2016లో దాడులు చేశారు. వారివద్ద నుంచి 132 కిలోల ఆల్ప్రాజోలం, ఉత్పత్తి యంత్రాలు, రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నిరూపితం కావడంతో నిందితులకు సంగారెడ్డి కోర్టు పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దోషి వాసంశెట్టి నరేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం మత్తుపదార్థాలు 100 గ్రాముల పరిమాణం దాటితే తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని తెలిపింది. ఇలాంటి కేసుల్లో బెయిల్ ఇవ్వడానికి కోర్టులు అంతగా సుముఖత వ్యక్తం చేయవని వ్యాఖ్యానించింది.

వేద పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం: టీటీడీ

తిరుమల, మే 16(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి టీటీడీ వేదపాఠశాలల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను టీటీడీ ఆహ్వానించింది. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం(తిరుమల), కీసరగుట్ట, విజయనగరం, భీమవరం, నల్గొండ, కోటప్పకొండలో వివిధ కోర్సుల్లో ప్రవేశం కోసం అర్హులైన బాలుర నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొంది. కోర్సుల వివరాలు, అర్హత, ఆవశ్యకత, దరఖాస్తు వంటి ఇతర వివరాల కోసం టీటీడీ వెబ్‌సైట్ 'తిరుమల.ఓఆర్‌జీ'ని సంప్రదించాలని, ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని టీటీడీ స్పష్టం చేసింది.

నిజామాబాద్ జిల్లాలో రూ. 25 లక్షల విలువైన అల్ప్రాజోలం పట్టివేత

- ఐదుగురి అరెస్టు.. పరారీలో మరొకరు..

బోధన్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): అల్ప్రాజోలం ముఠాను నిజామాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. గురువారం అర్ధరాత్రి మహారాష్ట్ర నుంచి కారులో అల్ప్రాజోలం తెలంగాణలోకి వస్తోందన్న సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా కారులో రూ.25లక్షల విలువైన రెండున్నర కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకోవడంతోపాటు ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పోలీసు స్టేషన్‌లో ఈ వివరాలను పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. మహారాష్ట్రలోని సాతరా జిల్లా కేంద్రానికి చెందిన విశ్వనాథ్ శివాంకర్.. అదే పట్టణంలో సూర్యప్రభ అనే పేరుతో ఫార్మా కెమికల్ కంపెనీ నడుపుతున్నాడు. శివాంకర్‌కు సాతరాకు చెందిన అమర్ సింగ్ దేశ్‌ముఖ్, బాబు రావు బస్వరాజ్ కాడేరి, షబ్బీర్ అలీ పాషామియా చౌదరి, పరమేశ్వర్ విజయ్‌తో పాటు నిజామాబాద్ జిల్లా సాలూరకు చెందిన మల్లెపూల లక్ష్మణ్ గౌడ్‌లు స్నేహితులు. శివాంకర్ గత రెండేళ్లుగా ఫార్మా కంపెనీ పేరిట ఫ్యాక్టరీలో మత్తు పదార్థాలు తయారు చేస్తుండేవాడు. సరిగ్గా ఇదే కోవలో అల్ప్రాజోలం తయారు చేసి వివిధ ప్రాంతాలకు విక్రయించేవాడు. తన దందాను తెలంగాణలోనూ విస్తరించాలని అమర్ సింగ్, బాబు రావు, షబ్బీర్ అలీ, విజయ్, లక్ష్మణ్ గౌడ్‌తో కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. ఆ తర్వాత తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వీరితో కలిసి అల్ప్రాజోలం విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా అల్ప్రాజోలాన్ని తరలిస్తుండగా బోధన్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వనాథ్ శివాంకర్ పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేవంత్ కక్కుర్తి వల్లే ప్రకృతి విధ్వంసం: వివేకానంద

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సీఎం దొంగలా దొరికిపోయారని, పదివేల కోట్ల కోసం రేవంత్‌రెడ్డి కక్కుర్తి పడటం వల్లే.. అంతలా ప్రకృతి విధ్వంసం జరిగిందని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద ఆరోపించారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కె.సంజయ్, అనిల్ జాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు అద్దం పట్టాయన్నారు. అటవీ విధ్వంసం నేపథ్యంలో అధికారులకు శిక్ష విధించాలా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించిన విధానం చూస్తుంటే.. రాజకీయ నాయకుల మాటలు వింటే జైలు పాలవుతారని ఇటీవల సీఎం చేసిన వ్యాఖ్యలు నిజమయ్యాయని అనిపిస్తోందన్నారు. అలాంటి కఠిన చట్టాలున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా వన్యప్రాణులను చంపించిన సీఎంను కూడా శిక్షించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇంజనీరింగ్ చదువును ఉచితం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదని, దానికి తోడు పెరుగుతున్న ఫీజులను నియంత్రించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు.

'గ్రూప్స్' పరీక్షలపై స్టే అడిగితే జరిమానా విధిస్తాం

- పిటిషనర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- తెలంగాణ ప్రభుత్వ వాదనతో ఏకీభావం
- పిటిషన్ ఉపసంహరణకు అనుమతి

న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్ 1, 2, 3 పరీక్షల మొత్తం ప్రక్రియపై స్టే ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తులపై శుక్రవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గ్రూప్-1 నియామక ప్రక్రియను ఆపాలని, గ్రూప్ 2, 3 నోటిఫికేషన్లపై స్టే ఇవ్వాలని కోరుతూ 12 మంది పిటిషన్ వేశారు. వారిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మందలించింది. ఉద్దేశపూర్వకంగా నియామకాలను రద్దు చేయాలని కోర్టులను ఆశ్రయిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. 370 పేజీల రిట్ పిటిషన్‌తో కుమ్మరి ప్రవీణ సహా 12 మంది ఏప్రిల్ 30న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దివ్యాంగుల రిజర్వేషన్లు వర్టికల్ విధానంలో అమలు చేశారని, ఇది నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. ప్రత్యేకించి.. గ్రూప్ 1 నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో 29 రాజ్యాంగ బద్ధమా? కాదా? అనేది తేల్చాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో 33 ద్వారా ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులు సరికాదని తెలిపారు. ఆ పిటిషన్ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జీ బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి, ఏవోఆర్ దేవినా సేహ్గల్, ఉదయ్ భాను, పిటిషనర్ల తరఫున రాణా ముఖర్జీ హాజరయ్యారు. గ్రూప్ -1 నియామక ప్రక్రియ చివరి దశలో ఉన్నదని, పరీక్ష ముగిసిందని, నియామక పత్రాలు మాత్రమే ఇవ్వాల్సి ఉందని నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. జీవో 29 రద్దు అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ జరిగిందని తెలిపారు. కేవలం ఉద్దేశపూర్వకంగానే నియామక ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తున్నారని వాదించారు. ప్రభుత్వ



వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. పిటిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేయగా, ధర్మాసనం అనుమతించింది.

పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

త్రివేణి సంగమానికి రెండో రోజు 50 వేల మంది రాక.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క దంపతుల పుణ్యస్నానం

- ఇతర రాష్ట్రాల నుంచీ భక్తుల హాజరు
- బస్సుల సంఖ్య 300కు పెంపు
- నేడు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం
- పుష్కరాల్లో పాల్గొనడం అదృష్టం: భట్టి

భూపాలపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలు వైభవంగా సాగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమానికి వస్తున్న భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పుష్కరాలు ప్రారంభమైన గురువారం 20 వేల మంది భక్తులు వచ్చినట్టు అంచనా వేయగా.. రెండో రోజైన శుక్రవారం 50 వేల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అంచనా వేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క దంపతులు కాళేశ్వరాన్ని సందర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు వారికి ఘన స్వాగతం పలకగా.. భట్టి దంపతులు తొలుత సరస్వతీ మాతను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నదిలో పుణ్యస్నానం ఆచరించి సరస్వతీమాతకు చీర, సారె సమర్పించారు. అంతకుముందు శ్రీ పీఠం వ్యవస్థాపకుడు స్వామి పరిపూర్ణానంద, జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా తదితరులు పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా, ఈ పుష్కరాలకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. శని, ఆదివారాల్లో భక్తుల రాక మరింత పెరుగుతుందని, సోమవారం రాజరాజేశ్వరస్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో.. భక్తులు భారీగా తరలి వస్తారని అధికారులు చెబుతున్నారు.

కిటకిటలాడిన బస్సులు..

పుష్కరాలకు శుక్రవారం ఉదయం 6గంటల నుంచే భక్తుల రాక పెరగడంతో బస్సులన్నీ కిటకిటలాడాయి. నిన్నటివరకు 60 బస్సులను మాత్రమే నడిపిన అధికారులు శుక్రవారం ఆ సంఖ్యను 300కు పెంచారు. ఇవే కాకుండా 3వేలకు పైగా ప్రైవేటు వాహనాల్లోనూ భక్తులు వచ్చినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక బస్టాండ్ నుంచి జ్ఞాన సరస్వతీ పుష్కరఘాట్ వరకు రోడ్లన్నీ భక్తులతో సందడిగా మారాయి. ఇటు కాళేశ్వరం ముక్తీశ్వర ఆలయంలోనూ భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. అయితే పదే పదే వీవీఐపీల బ్రేక్ దర్శనాల కోసం సాధారణ భక్తులను నిలిపివేయడంతో చాలామంది భక్తులు ఇబ్బందులు పడ్డారు. అసహనంతో దేవాదాయ శాఖ అధికారులతో, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు భక్తుల రద్దీకి తగ్గట్టుగా దేవాదాయ శాఖ 40 వేలకు పైగా లడ్డూలు, పులిహోర ప్రసాదాలను భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం కాస్త చల్లగా ఉన్నా.. మధ్యాహ్నం ఒక్కసారిగా భానుడు ప్రతాపం చూపడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.


సరస్వతి మాతకు చీర, సారె సమర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క దంపతులు

సరస్వతీ పుష్కరం మహా అద్భుతం: భట్టి

కాళేశ్వరం: సరస్వతీ పుష్కరాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. మొదటిసారిగా కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలతో పాటు టెంట్ సిటీ ఏర్పాటు చేసి వేల మంది విడిది చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పుష్కర మహోత్సవాల్లో ప్రతీ రోజు ఒక పీఠాధిపతితో పాటు తామంతా వస్తున్నామని తెలిపారు. జీవితంలో చేసిన పొరపాట్లన్నీ పుష్కర స్నానంతో పరిసమాప్తం అవుతాయన్నారు. పుష్కర కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును అభినందించారు. అనంతరం టెంట్‌సిటీకి వెళ్లిన భట్టి.. శుక్రవారం రాత్రి అక్కడే బస చేయనున్నారు.

100 కోట్ల పన్ను ఎగవేత కేసులో లగ్జరీ కార్ల డీలర్ అరెస్టు

- హైదరాబాద్‌లో బషారత్ అహ్మద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు
- అహ్మదాబాద్‌కు తరలింపు
- కార్లు కొన్న వారిలో రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రూ.వంద కోట్ల పన్ను ఎగవేత కేసులో లగ్జరీ కార్ల డీలర్, గచ్చిబౌలిలోని కార్‌లాంజ్ షోరూం యజమాని బషారత్ అహ్మద్ ఖాన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు అరెస్టు చేశారు. అహ్మదాబాద్‌లో నమోదైన కేసు ఆధారంగా ఖాన్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి గుజరాత్‌లోని అహ్మదాబాద్ కోర్టులో శుక్రవారం హాజరు పరిచారు. అమెరికా, జపాన్‌లలో అత్యంత ఖరీదైన లగ్జరీ కార్లను కొనుగోలు చేసి దుబాయ్, శ్రీలంక మీదుగా భారత్‌కు ఖాన్ తరలించినట్టు అధికారులు గుర్తించారు. పన్నులు తప్పించుకోవడానికి అహ్మద్ ఈ మార్గాన్ని ఎంచుకున్నట్టు డీఆర్ఐ విచారణలో వెల్లడైంది. విదేశీ లగ్జరీ కార్ల అసలు ధరకన్నా కొన్ని సందర్భాల్లో 50 శాతం తక్కువకు నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించారని, కస్టమ్స్ సుంకాన్ని ఎగవేసేందుకు అమెరికాలో కొన్న కారును శ్రీలంక ద్వారా భారత్‌కు తీసుకొచ్చేవారని అధికారులు తెలిపారు. అహ్మద్‌తోపాటు అతని వ్యాపార భాగస్వాములు ఇలా దేశంలోకి వచ్చిన కార్లను అహ్మదాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో దాచినట్టుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు ఖాన్ వద్ద కార్లు కొనుగోలు చేశారని, వీటిలో కొన్ని కార్లను పూర్తిగా నగదు చెల్లించి కొన్నట్టుగా అనుమానిస్తున్నట్టు డీఆర్ఐ అధికారులు తెలిపారు. అమెరికా, జపాన్‌లో కొన్న ఖరీదైన లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ కార్లను శ్రీలంకకు తరలించాక అక్కడ భారత్‌లో వాడేందుకు వీలుగా రైట్ హ్యాండ్ డ్రైవ్‌కు మార్చడమేకాకుండా దీనికి అనుగుణంగా పత్రాలు సృష్టించినట్టు చెప్పారు. దాదాపు 30 కార్లను ఈ విధంగా ఖాన్ తెప్పించారని, ఈ కార్లను కొన్న పలువురు పన్ను ఎగవేతలో భాగస్వాములైన క్రమంలో వారిపై దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

మంత్రివర్గ విస్తరణకు ముఖ్యమంత్రే అడ్డు

- రేవంత్‌రెడ్డి-భట్టికి మధ్య విభేదాలు..
- ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించి పథకాలు, ఉద్యోగుల బకాయిలు ఎగ్గొట్టేందుకు ప్లాన్
- మంత్రిమండలి రెండుగా చీలిపోయింది
- రాహుల్ వద్ద 'రేవంత్ ఫైలు'.. త్వరలో కీలక నిర్ణయం :ఏలేటి



హైదరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణను ముఖ్యమంత్రే అడ్డుకుంటున్నారని బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సీఎంకు భట్టి విక్రమార్కతో విభేదాలున్నాయని, అందుకే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భట్టి ఏమీ స్పందించకుండా మౌనంగా ఉన్నారన్నారు. శుక్రవారం తన నివాసంలో మీడియాతో ఏలేటి చిట్‌చాట్ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ విధించి, సంక్షేమ పథకాలు, ఉద్యోగుల బకాయిలు నిలిపేయాలని ప్రభుత్వం యత్నిస్తోందని.. అయితే, ఈ నిర్ణయాన్ని మంత్రివర్గంలోని పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. దీంతో మంత్రిమండలి రెండుగా చీలిపోయిందన్నారు. 'మంత్రివర్గంలో తనను వ్యతిరేకించే మంత్రులే ఎక్కువ ఉన్నారని భావిస్తున్న సీఎం రేవంత్.. తన పక్షానికి మంత్రి పదవులిచ్చే అవకాశం లేకపోవడంతో కావాలనే విస్తరణను అడ్డుకుంటున్నారు. విస్తరణ జరిగితే తన వద్ద ఉన్న కీలక శాఖలపై పట్టు కోల్పోవచ్చన్న భయంతోనే అందుకు అంగీకరించడం లేదు. బీసీలకు పనికిరాని శాఖలు ఇచ్చారు' అని ఆరోపణలు గుప్పించారు. సీఎం కొన్ని శాఖల్లో జోక్యం చేసుకోవడం.. సీనియర్ మంత్రులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తమవుతోందని.. ముఖ్యంగా భూముల వ్యవహారంలో సీఎంకు, రెవెన్యూ మంత్రికి మధ్య గ్యాప్ పెరిగిందని చెప్పారు. రాహుల్ గాంధీ ఇటీవల హైదరాబాద్ వచ్చినప్పుడు రేవంత్‌ను పలకరించకపోవడం, రేవంత్ వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్లు బహిరంగంగా విమర్శించడం కూడా పార్టీలో అంతర్గత కలహాలకు నిదర్శనమన్నారు. అంతిమంగా రేవంత్‌పై వస్తోన్న అనేక ఆరోపణల ఫైలు ప్రస్తుతం రాహుల్ వద్ద ఉందని, త్వరలో ఆ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందని వ్యాఖ్యానించారు.

మహేశ్వర్‌రెడ్డి జ్యోతిషం చెప్పుకుంటే మంచిది: అడ్లూరి లక్ష్మణ్

బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రాజకీయాలు వదిలేసి జ్యోతిషం చెప్పుకుంటే మంచిదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణకుమార్ విమర్శించారు. రెండు నెలలకోసారి ఊహకు అందని కథలు, ఊకదంపుడు సోది చెబుతున్న ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏం జరుగుతున్నది మాత్రం తెలియదన్నారు. జ్యోతిష్యం పైన అంత పట్టు ఉంటే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎవరికి వస్తుంది... ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీలోనే కొనసాగుతారా లేదా అన్నది చెప్పాలని వ్యాఖ్యానించారు.

పాకిస్థాన్ అంటే ఉగ్రవాద ఫ్యాక్టరీ

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు గుణపాఠం

- నేడు హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై 'తిరంగా యాత్ర'
- తాత్కాలికంగానే ఆపరేషన్ సిందూర్ నిలిపివేత
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ అంటే ఉగ్రవాదాన్ని తయారుచేసే ఫ్యాక్టరీగా ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి చెప్పారు. 'ఉగ్రవాదంపై గట్టి చర్యలు తీసుకుంటాం. మానవత్వానికి హాని చేసే వారిని వదిలి పెట్టం. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదానికి భారత్ సైన్యం గుణపాఠం చెప్పింది' అని పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్ తాత్కాలికంగా మాత్రమే నిలిపేశామని, పూర్తిగా నిలువరించలేదని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత 15 రోజుల్లో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ప్రతీకారం తీర్చుకున్నదని చెప్పారు. కాందహార్ విమాన హైజాకింగ్, పుల్వామా ఉగ్రదాడి కీలక సూత్రధారులైన ఉగ్రవాదులు యూసఫ్ రవూఫ్, అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులందరినీ భారత సైన్యం మట్టుబెట్టిందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో సైనికుల ధైర్యాన్ని అభినందించేందుకు శనివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద జరిగే 'తిరంగా యాత్ర'లో ప్రజలు, విద్యార్థులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలుపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని రాజకీయాలకతీతంగా ప్రముఖులందరినీ ఆహ్వానించామని చెప్పారు. గతంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల కోసం ఎదురు చూసిన నేపథ్యం నుంచి భారత సైన్యానికి రాఫెల్ ఫైటర్ జెట్ విమానాలు, బ్రహ్మోస్ క్షిపణులను మోదీ సర్కారు సమకూర్చిందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రాఫెల్ యుద్ధ విమానాలు, ఎస్-400 క్షిపణుల కొనుగోలు చేసినప్పుడు.. అందుకు వ్యతిరేకంగా కొన్ని పార్టీల నేతలు ఆరోపణలు చేశారని, కానీ, వాటి విలువ, ప్రాధాన్యత, ఫలితాలేమిటో మొత్తం ప్రపంచం చూసిందని పేర్కొన్నారు. రక్షణ రంగ పరిశోధనలకు అవసరమైన వసతుల కల్పన, అంతరిక్ష రంగ పరిశోధన అభివృద్ధికి కృషి చేస్తుందని కిషన్ రెడ్డి చెప్పారు. దేశీయంగా తయారయ్యే రక్షణ రంగ సామాగ్రి 35 శాతానికి చేరుకోగా, అందులో ప్రైవేటు రంగ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగిందని ఆయన వివరించారు.

ఆపరేషన్ కగార్ పూర్తిగా నిలిపి వేయాలి

- దేశ పౌరులపై యుద్ధం సరికాదు
- బండి సంజయ్ సానుకూలంగా స్పందించాలి
- మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలి
- కాల్పుల విరమణ దిశగా అడుగులు వేయాలి
- కేంద్రానికి మేధావులు, విద్యావంతుల విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్ సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మోదీ ప్రభుత్వం దేశ పౌరులపై యుద్ధం చేయడం సరికాదని ఓయూ విద్యార్థి సంఘాలు ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావులు, విద్యావంతులు అభిప్రాయపడ్డారు. మావోయిస్టు పార్టీతో కేంద్రం చర్చలు సాగించాలని ఆచార్య హరగోపాల్ కోరారు. మారణహోమాన్ని ఆపడానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రయత్నించాలని శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ముందుగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటన చేయాలన్నారు. కర్రెగుట్టల్లో మోహరించిన సైనిక బలగాలను వెనక్కి పిలిపించారే గానీ, ఆపరేషన్ కగార్‌ను మాత్రం కొనసాగిస్తున్నారని పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలల్లో 500 మందికి పైగా మృతిచెందారని చెప్పారు.

రాహుల్, ఖర్గేలకు వినతిపత్రం

ఆపరేషన్ కగార్ మీద కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ప్రకటించాల్సిందిగా భారత్ బచావో ప్రతినిధులు మే 9న రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలను కలిసి వినతిపత్రం అందించినట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ చెప్పారు. శాంతి చర్చల డిమాండ్‌ను ఇండియా కూటమి బలపరచాలని కోరగా, అందుకు అనుకూలంగా తనవంతు ప్రయత్నిస్తానని రాహుల్ మాట ఇచ్చినట్లు గోపీనాథ్ వివరించారు. ఆపరేషన్ కగార్‌ను పూర్తిగా నిలిపివేసి, కాల్పుల విరమణ ప్రకటించాలని ప్రొఫెసర్లు కాసీం, కొండా నాగేశ్వర్, అన్వర్, భారత్ బచావో జాతీయ కార్యదర్శి గాదె ఇన్నయ్య, కాంగ్రెస్ నేత బెల్లయ్య నాయక్, ఎస్ఎల్ పద్మ తదితరులతో పాటు సభాధ్యక్షత వహించిన ఆజాద్, ఇతర విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఆపరేషన్ ముగిసినట్లు ప్రకటించడంపై అనుమానాలు

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 21రోజులు సాగించిన మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ ముగిసినట్లు మే14న ప్రకటించడం పలు అనుమానాలకు తావునిస్తున్నాయని శాంతి సమన్వయ కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఈ ఆపరేషన్‌పై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, ప్రజాస్వామ్యవాదులు, మానవహక్కుల కార్యకర్తల సమక్షంలో విచారణ జరిపించాలని పీయూసీఎల్ అఖిల భారత అధ్యక్షుడు కవిత శ్రీవాత్సవ డిమాండ్ చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.